
మంగళవారం 26-3-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 191

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



బెంగళూరు బల్లే బల్లే...
పంజాబ్ కింగ్స్‌పై ఆర్‌సీబీ విజయం.. మెరిసిన విరాట్ కోహ్లి, కార్తీక్ - 12లో



అమెరికాలో అమూల్ పాలు
వారం రోజుల్లో ప్రవేశపెట్టనున్న జీసీఎంఎంఎఫ్ - 13లో



ఆ నినాదాలను త్యజించగలరా?
జైహింద్ అని తొలుత నినదించింది ముస్లింలని తెలిస్తే.. వాటిని త్యజిస్తారా? అని సంఘ్ పరివార్‌ను కేరళ సీఎం విజయన్ ప్రశ్నించారు.
వివరాలు 6లో ▸



భారతీయ విద్యార్థిని దుర్మరణం
లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్సెస్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తోన్న చేష్టా కొచ్చర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.
వివరాలు 6లో ▸



షూస్, షాంపూ బాటిళ్లలో కొకైన్
ఓ ప్రయాణికురాలు తెచ్చిన రూ.19.79 కోట్ల విలువైన కొకైన్‌ను ముంబై ఎయిర్‌పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
వివరాలు 6లో ▸



ఉజ్జయినిలో అగ్ని ప్రమాదం
ఉజ్జయినిలోని మహాకాళ్ ఆలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది అర్చకులు, వారి సహాయకులు గాయపడ్డారు.
వివరాలు 6లో ▸

ఇటు పేదల సైన్యం.. అటు పెత్తందార్ల పటాలం



రిజర్వుడు స్థానాలు పోగా మిగిలిన జనరల్ స్థానాల్లో 40 శాతం సీట్లను బీసీలకే ఇచ్చిన సీఎం జగన్

- రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేకున్నా బలహీన వర్గాలకు 48 శాసనసభ, 11 ఎంపీ సీట్లు
- అసెంబ్లీ, ఎంపీ కలిపి మొత్తం 200 స్థానాల్లో.. 100 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే
- సేవే పరమావధిగా.. నిజాయితీ కొలమానంగా విద్యావంతులు, సామాన్యులకు పట్టం
- ఉపాధి కూలీ లక్కప్ప, టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు, కార్మికుడు ఖలీల్ అహ్మద్, రైతు బిడ్డ తిరుపతిరావుకు అవకాశం
- రాజకీయ సాధికారతతో సీఎం జగన్ బలంగా అడుగులు.. దేశ చరిత్రలో ఇదో రికార్డు
- 156 శాసనసభ, 20 ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి
- 33 శాసనసభ, 4 లోక్‌సభ స్థానాల్లోనే బీసీలకు చాన్స్.. బడుగులకు ఇచ్చింది 23 శాతమే
- ఓసీలకు కేటాయించిన 75 స్థానాల్లో 30 చోట్ల సొంత సామాజిక వర్గానికే చంద్రబాబు చాన్స్
- కోట్లు కుమ్మరించే వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఆర్థిక నేరగాళ్లు, నేర చరితులకే బాబు టికెట్లు.. బడుగులకు మరోసారి వెన్నుపోటు

3 లో

ఇడుపులపాయ నుంచి ప్రచార భేరి

రేపటి నుంచి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు సీఎం జగన్ శ్రీకారం
- వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రార్థనలు, నివాళులు అర్పించి యాత్ర ప్రారంభం
- వేంపల్లి, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా సాయంత్రానికి ప్రొద్దుటూరులో సభ
- 27న రాత్రి ఆళ్లగడ్డలోనే బస.. 28న నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో బస్సు యాత్ర

2 లో



వెన్నుపోటు పొడుస్తారా?

టీడీపీపై బీజేపీ నాయకుల ఆగ్రహం

తడిగుడ్డతో గొంతులు కోసేవాడు అంటూ ప్రధానిపైనే టీడీపీ పోస్టులు
మా పార్టీ సభ్యత్వం లేని రఘురామకు ఎందుకు సీటివ్వాలంటున్న బీజేపీ నేతలు
17 ఎంపీ సీట్లు ఉన్న చంద్రబాబే ఇచ్చి ఉండొచ్చుగా అంటూ మండిపాటు
చివరికి కాంగ్రెస్‌తో కలిసి కూడా దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి
మరోవైపు.. టీడీపీ అనుకూల పత్రికల్లోనూ మోదీపై విష ప్రచారం
టీడీపీ దుష్ప్రచారాన్ని పట్టించుకోని రాష్ట్ర నాయకత్వంపై బీజేపీ నేతల ఆగ్రహం

2 లో

ఫ్యాక్ట్‌చెక్

హే జీసస్.. రోత రాతల పాపాలను క్షమించుడి!

- క్రైస్తవుల సంక్షేమంపై రామోజీ నీచపు రాతలు
- రాయితీల కోత పేరుతో మడత వ్యాఖ్యలు
- నవరత్నాలతో నవోదయం పచ్చ కళ్లకు కన్పించవా
- బాబు జమానాలో అరకొర పథకాలతో సరి
- సీఎం జగన్ హయాంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ తోడ్పాటు

14 లో

చంద్రబాబు చేసిన అవమానాలు గుర్తులేవా?

- మంద కృష్ణ మాదిగపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజం
- కూటమికి మంద కృష్ణ మద్దతు వెనుక స్వార్థ రాజకీయం
- అవకాశవాదులకు ఆశాభంగం తప్పదు: గుంటూరు కృష్ణ
- బాబుకు మాదిగలను తాకట్టు పెడతావా: పి.ఓబులేసు

5 లో

'రేషన్'లో పౌష్టికాహారం

- ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలు అందిస్తున్న ప్రభుత్వం
- రైతుల నుంచే నేరుగా జొన్నలు, రాగులు మద్దతు ధరకి కొనుగోలు
- మార్కెట్లో ధర లేనపుడు ప్రభుత్వ కొనుగోలుతో ధరల స్థిరీకరణ
- కొర్రలను మద్దతు ధరకు కొనేలా కేంద్రాన్ని ఒప్పించిన రాష్ట్ర ప్రభుత్వం

3 లో

ప్రాణం పోసిన 108 అంబులెన్స్‌లు

- 2020 జూలై నుంచి 43.03 లక్షల మందికి అత్యవసర సేవలు
- సేవలు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికం

3 లో



ఎలక్ట్రానిక్స్ రంగంలో 36,205 మందికి ఉద్యోగాలు

24 దిగ్గజ కంపెనీల ద్వారా రూ.10,705 కోట్ల పెట్టుబడులు

బ్లూస్టార్, డైకిన్, హావెల్స్ వంటి ఏసీ తయారీ యూనిట్లు ఏర్పాటు
దేశంలో అమ్ముడయ్యే ప్రతి రెండు ఏసీల్లో ఒకటి మేకిన్ ఆంధ్రానే
విశాఖ జీఐఎస్‌లో రూ.15,711 కోట్ల విలువైన మరో 23 ఒప్పందాలు
వీటి ద్వారా మరో 55,140 మందికి లభించనున్న ఉపాధి
కొప్పర్తిలో ఈఎంసీ పూర్తి స్థాయిలో అందుబాటులోకొస్తే మరిన్ని అవకాశాలు

2 లో

వలంటీర్లు జిహాదీ టెర్రరిస్టులు



- టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- వలంటీర్లు డేటా చౌర్యం చేసి వాడుకుంటున్నారు
- ఎన్నికల తర్వాత ఓటు వేయని వారిపై కక్ష సాధిస్తారు
- వలంటీర్లను స్లీపర్ సెల్స్‌లా సీఎం జగన్ తయారు చేశారు
- సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలపై వలంటీర్ల మండిపాటు
- సేవలు చేస్తున్న మాపై ఇలాంటి వ్యాఖ్యలు బాధాకరం

5 లో

వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దారుణం

మంత్రి కారుమూరి

5 లో

ఆరు అసెంబ్లీ సీట్లపై బాబు అయోమయం

పెండింగ్‌లో పెట్టిన స్థానాలపై గందరగోళం

పొత్తులో టీడీపీ సీట్లు 144.. ఖరారు చేసినవి 138 మాత్రమే

- పి.గన్నవరం జనసేనకు బదిలీ..
- అనపర్తిపై తేల్చని బీజేపీ
- టీడీపీ సీట్లలో మిగతా ఆరు ఏవన్న దానిపై అనిశ్చితి
- బీజేపీకి ఇచ్చిన 10 స్థానాలు ఏమిటో ఇప్పటికీ తేలలేదు
- గుంతకల్లు, ఆదోని, ఆలూరు సీట్లతో బంతాట
- రాజంపేట, జమ్మలమడుగులో ఏదన్నదీ తేలని వైనం
- దర్శి, అనంతపురం అర్బన్‌లో అభ్యర్థుల కోసం పాట్లు
- 4 ఎంపీ అభ్యర్థుల ఖరారులోనూ జాప్యమే



సాక్షి, అమరావతి: అసమ్మతి నేతల నిరసనలతో సతమతమవుతున్న టీడీపీలో కూటమి సీట్ల సర్దుబాటు మరింత గందరగోళంగా మారింది. పెండింగ్‌లో ఉంచిన ఆరు స్థానాలకు అభ్యర్థుల ఖరారులో పార్టీ అధినేత చంద్రబాబు అయోమయానికి గురవుతున్నట్లు సమాచారం. పొత్తులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీకి 144, జనసేనకు 21, బీజేపీకి 10 స్థానాలు కేటాయించారు. అయితే, బీజేపీ పోటీ చేసే 10 స్థానాలు

మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఎక్కడో ఓ చోట అతనికి టికెటివ్వండి సార్! లేకుంటే కొంపమునిగేట్లుంది!

సుగుణమ్మకు బాబు ఝలక్

పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటు జనసేనకు

- ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన పవన్
- టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆశలపై నీళ్లు
- కన్నీటి పర్యంతమైన సుగుణమ్మ
- చంద్రబాబు పునరాలోచించాలని వినతి
- ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని కేడర్ అంగీకరించడంలేదని వెల్లడి


మీడియా సమావేశంలో కన్నీటి పర్యంతమవుతున్న తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

సాక్షి, తిరుపతి: టీడీపీ నాయకురాలు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడం, 2 రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి వచ్చిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు పవన్‌కళ్యాణ్ తిరుపతి టికెట్టు ఇవ్వడంతో సుగుణమ్మ కంగుతిన్నారు. నిన్నటి వరకు తనకే తిరుపతి టికెట్టు వస్తుందని భ్రమలో ఉన్న ఆమె సోమవారం మీడియా ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. చంద్రబాబు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, చంద్రబాబు సర్వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని కేడర్ అంగీకరించటంలేదని చెప్పారు.

లోకల్.. నాన్ లోకల్ వార్
జిల్లా కేంద్రమైన తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి విషయంలో ప్రతి రోజూ కూటమి నేతల మధ్య వివాదాలు రాజుకుంటూనే ఉన్నాయి. సుగుణమ్మతోపాటు తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, జేబీ శ్రీనివాసులు, ఊకా విజయకుమార్

మిగతా 10వ పేజీలో ▶

గాజాలో కాల్పుల విరమణ



ఇజ్రాయెల్‌-హమాస్ మధ్య వివాదం మొదలైన అయిదు నెలల తర్వాత సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత రంజాన్ మాసంలో గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని సంబంధిత వర్గాలను కోరుతూ ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది. 15 సభ్యదేశాలతో కూడిన మండలిలోని 10 తాత్కాలిక సభ్యదేశాలు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. రష్యా, చైనా సహా 14 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఎవరూ వ్యతిరేకించనప్పటికీ శాశ్వత సభ్యదేశం అమెరికా ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది.

6 లో

బదిలీ అధికారం యజమానికి ఉంది



- కేజీబీవీల్లో కాంట్రాక్టు టీచర్ల బదిలీలు తప్పుకాదు
- ఈ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు సబబే
- రాష్ట్ర ప్రభుత్వం తన సంక్షేమ విధానంలో భాగంగానే వారికీ కనీస వేతన స్కేల్ ఇచ్చింది
- కేజీబీవీల్లో పనిచేసే కాంట్రాక్టు టీచర్లకు కనీస వేతన స్కేల్ అమలుచేయాల్సిందే.. కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలపై హైకోర్టు కీలక తీర్పు

2 లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ధైర్యంగా బతకగలుగుతున్నా

మా ఆయన తిక్కస్వామి వ్యవసాయ కూలీ. ఆయన సంపాదనతోనే కర్నూలు జిల్లా పెద్దతుంబళం గ్రామంలో ఒడుదొడుకులతో సంసారం సాగేది. పనిలేని రోజు పస్తులుండాల్సి వచ్చేది. పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. మాకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. భర్త మరణంతో కుటుంబ పోషణ చాలా భారమైంది. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మా కుటుంబానికి ఆసరా దొరికినట్టయింది. రూ. 30 వేలు పొదుపు రుణం సున్నావడ్డీ కింద తీసుకుని కుట్టుమెషీన్ కొనుక్కున్నా. నాకు వితంతు పింఛను కూడా వస్తోంది. మా ఇద్దరు పిల్లలు ఇప్పుడు చదువుకుంటున్నారు. ఒకరికి అమ్మ ఒడి కింద రూ.15వేలు అందుతోంది. బడిలో మంచి ఆహారం, అవసరమైన పుస్తకాలు, యూనిఫాం వంటివి అందిస్తున్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం కూడా మంజూరైంది. ఎలాంటి భయం లేకుండా బతుకుతున్నానంటే జగనన్న ఆశీర్వాదమే కారణం.



– బయటిగేరి రాజేశ్వరి, పెద్దతుంబళం
(కపటి రామచంద్ర, విలేకరి, ఆదోని రూరల్)

సాయం చేసి.. ఉపాధి బాట వేసి..

నా భర్త ఏలేటి కిరణ్‌తోపాటు నేను కూడా అద్దె ఆటో నడుపుతూ రాజమహేంద్రవరం మండలం కొంతమూరులో ఇద్దరు మగ పిల్లలను పోషించుకుంటూ జీవిస్తున్నాం. అద్దె ఆటో కన్నా సొంత ఆటో కొనుగోలు చేయాలనుకున్నాం. ధర కనుక్కుంటే రూ.4.50 లక్షల వరకూ అవుతుందని తెలిసింది. అంత సొమ్ము భరించలేమని భయపడ్డాం. ఆ సమయంలో సీఎం జగనన్న 'ఉన్నత మహిళా శక్తి' పథకం ద్వారా ఉపాధికి భరోసా కల్పించారు. ఎటువంటి వడ్డీ లేకుండా రూ.2.79 లక్షల విలువైన ఆటోను ప్రభుత్వం అందించింది. దీంతో మా కుటుంబం కుదుటపడింది. అంతేగాకుండా ఇంటి స్థలాన్ని మంజూరు చేసి పట్టా అందించారు. ఇద్దరు మగ పిల్లల్లో ఏలేటి సంజయ్ సాత్విక్ ఐదో తరగతి, ఏలేటి సంజయ్ సంపత్ మూడో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇద్దరిలో చిన్నవాడికి అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. అంతేకాకుండా వైఎస్సార్ విద్యా కానుక ద్వారా పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్‌లు, షూలు, సాక్సులు సైతం అందించారు. జగనన్న గోరుముద్ద ద్వారా మధ్యాహ్నం పౌష్టికాహారమైన భోజనాన్ని పెడుతున్నారు. సీఎం జగనన్న ద్వారా జరిగిన మేలు మా కుటుంబం మరచిపోదు. జీవితాంతం రుణపడి ఉంటాం.



– ఏలేటి దేవీదుర్గ, ఆటో డ్రైవర్ కొంతమూరు
(యెనుముల విశ్వనాథం, విలేకరి, రాజమహేంద్రవరం రూరల్)

పోతాయనుకున్న ప్రాణాలు నిలిపారు

దుకాణాల్లోనూ, ఇళ్లలోనూ ధూపం వేస్తూ, దిష్టి తాళ్లు కడుతూ పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో జీవించే కుటుంబం మాది. జిల్లాలో కోవిడ్ బారిన పడిన మొదటి వరుసలోని వ్యక్తిని. దాంతో మేమంతా తీవ్ర భయభ్రాంతులకు గురై, తీవ్ర మానసిక వేదన అనుభవించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చుకు వెరవకుండా అండగా నిలిచి ప్రాణాలు నిలిపారు. ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించి 16 రోజుల పాటు వైద్యం చేయించారు. రెండు పూటలా పౌష్టికాహారం అందించడంతోపాటు ఉదయం, సాయంత్రం టిఫిన్ ఇచ్చారు. సమయానికి మందులు ఇచ్చి ప్రాణాలకు అండగా నిలిచారు. భయభ్రాంతుల నుంచి నేడు సాధారణ జీవితంలోకి వచ్చి మళ్లీ జీవనోపాధిలో ముందుకు సాగడం అంతా సీఎం జగన్ చలవే. అంతేగాకుండా మా కుటుంబానికి అమ్మఒడి ద్వారా ఏడాదికి రూ. 15వేలు, నా భార్యకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.36 వేలు లబ్ధి చేకూరింది. సీఎంకు మా కుటుంబం అంతా రుణపడి ఉంటుంది.



– షేక్ ఖాసీం, పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా
(గుర్రాల శ్రీనివాసరావు, పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లా)

ఎలక్ట్రానిక్స్ రంగంలో 36,205 మందికి ఉద్యోగాలు

24 దిగ్గజ కంపెనీల ద్వారా రూ.10,705 కోట్ల పెట్టుబడులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఓవైపు భారీ ఎత్తున పెట్టుబడులు, మరోవైపు యువతకు ఉద్యోగాల వెల్లువ కొనసాగింది. ముఖ్యంగా రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ రంగం రికార్డు స్థాయి పెట్టుబడులను ఆకర్షించింది. 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో రూ.10,705 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చాయి. అంతేకాకుండా మరో రూ.15,711 కోట్ల విలువైన కొత్త పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. ఈ ఐదేళ్ల కాలంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో బ్లూస్టార్, డైకిన్, పానాసోనిక్, డిక్సన్, హావెల్స్, సన్నీఆప్టిక్స్ వంటి అనేక దిగ్గజ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రారంభించడంతోపాటు భారీ ఎత్తున విస్తరణ కార్యక్రమాలను చేపట్టాయి. అంతేకాకుండా పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాయి. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక 2019 మే నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 24 కంపెనీల ద్వారా రూ.10,705 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవం రూపంలోకి రావడంతో ఏకంగా 36,205 మందికి ఉపాధి లభించింది.

మరో 55,140 మందికి ఉపాధి

గతేడాది మార్చిలో విశాఖపట్నంలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 23 ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటి ద్వారా మరో రూ.15,711 కోట్ల పెట్టుబడులతోపాటు 55,140 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఎయిర్ కండీషనర్లు, సెల్‌ఫోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. కోవిడ్ తర్వాత ఎలక్ట్రానిక్స్ రంగంలో చైనా దిగుమతులను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం (పీఎల్ఐ) స్కీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందిపుచ్చుకుంది. ఈ పథకం కింద పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన అనేక కంపెనీలను స్వాగతించింది. అంతేకాకుండా వీటికి వేగంగా అనుమతులు మంజూరు చేయడంతో కంపెనీలు ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి.



శ్రీసిటీలో భారీగా తయారీ యూనిట్లు

కాగా దేశంలో అమ్ముడయ్యే ప్రతి రెండు ఎయిర్ కండీషనర్లలో ఒకటి మనం రాష్ట్రంలోనే తయారవుతుండటం విశేషం. తిరుపతి జిల్లా శ్రీసిటీలో జపాన్ ఏసీ తయారీ సంస్థ డైకిన్, బ్లూస్టార్, హావెల్స్, పానాసోనిక్, యాంబర్, ఈపాక్ వంటి సంస్థలు భారీ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. ఇందులో ఒక్క డైకిన్ తొలి దశలో ఏటా 10 లక్షల యూనిట్లను తయారుచేస్తోంది. అంతేకాకుండా రెండో దశలో మరో 15 లక్షలు తయారుచేసేలా విస్తరణ చేపట్టనుంది. ఇందుకోసం రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులను ఈ జపాన్ సంస్థ పెట్టింది. అలాగే, బ్లూస్టార్ ఏటా 12 లక్షల యూనిట్లను తయారుచేసే విధంగా యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది.

కొప్పర్తి ఈఎంసీతో మరో 28,250 మందికి ఉపాధి

ప్రస్తుతం ఏటా దేశవ్యాప్తంగా 75 లక్షల గృహ వినియోగ ఏసీలు అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఈ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షలకుపైనే ఉంటుందని అంచనా. ఒక్క ఏసీ తయారీ రంగంలోనే రాష్ట్రం రూ.3,755 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 10,000 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇవి కాకుండా రూ.749 కోట్లతో కొప్పర్తిలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రూ.8,910 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 28,250 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే డిక్సన్ వంటి కంపెనీలు కొప్పర్తిలో ఉత్పత్తిని ప్రారంభించడం విశేషం.

బదిలీ చేసే అధికారం యజమానికి ఉంది

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీ విషయంలో రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వారిని బదిలీచేసే అధికారం సదరు యజమాని (ప్రభుత్వం)కి ఉందని స్పష్టంచేసింది. ఒప్పందంలో బదిలీ ప్రస్తావన ఉన్నప్పుడు ప్రభుత్వం వారిని బదిలీ చేయడం తప్పుకాదని తేల్చిచెప్పింది. కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను బదిలీచేస్తూ 2022లో ప్రభుత్వం జారీచేసిన జీఓ–103ను హైకోర్టు సమర్థించింది. అలాగే, కాంట్రాక్టు ఉద్యోగులు కనీస వేతన స్కేల్‌కు అర్హులని స్పష్టంచేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన సంక్షేమ విధానంలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుని వారందరికీ కనీస వేతన స్కేల్‌ను వర్తింపజేస్తూ సమగ్ర ఉత్తర్వులు జారీచేసిందని.. అందులో కేజీబీవీల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఉన్నారని పేర్కొంది. సవరించిన కనీస వేతన స్కేల్‌ను కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు 1-1-2022 నుంచి అమలుచేయాలని.. వారికి చెల్లించాల్సిన బకాయిలను 12 వారాల్లో చెల్లించాలని అధికారులకు తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ కృపాసాగర్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీళ్లు..

రాష్ట్ర ప్రభుత్వం తమకు కనీస వేతన స్కేల్‌ను ఖరారుచేస్తూ జారీచేసిన ఉత్తర్వులను అమలుచేసేలా అధికారులను ఆదేశించడంతో పాటు, తమను వివిధ ప్రాంతాలకు బదిలీచేస్తూ జారీచేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీల్లోని కాంట్రాక్టు టీచర్లు 2022లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి డాక్టర్ జస్టిస్ కుంభజడల మన్మథరావు కాంట్రాక్టు టీచర్ల బదిలీల ఉత్తర్వుల విషయంలో జోక్యానికి నిరాకరించారు. ఇదే సమయంలో కోర్టుకొచ్చిన టీచర్లు ఎక్కడ పనిచేస్తున్నారో వారిని అక్కడే కొనసాగించాలని.. అంతేకాక.. వారికి కనీస వేతనాలు, తదనుగుణ బకాయిలు కూడా చెల్లించాలని చెప్పారు. బదిలీల విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ కాంట్రాక్టు టీచర్లు.. కనీస వేతనాలపై ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు.



బదిలీ అధికారం యజమానికి ఉంది

'ఇక కాంట్రాక్టు టీచర్ల బదిలీ విషయానికొస్తే, వారిని కావాల్సిన చోటుకు బదిలీ చేయడం సబబే. నిజానికి.. 2013 నాటి కాంట్రాక్టు ఒప్పందంలో బదిలీల విషయంలో ఎలాంటి నిబంధన లేదు. దీని ఆధారంగా కాంట్రాక్టు టీచర్లు తమను బదిలీ చేయడానికి వీల్లేదంటున్నారు. అయితే, 2022లో తీసుకొచ్చిన కొత్త ఒప్పందంలో బదిలీ నిబంధన ఉంది. అందువల్ల ప్రస్తుత కేసులో కాంట్రాక్టు టీచర్ల బదిలీ ఉత్తర్వులను ఎంతమాత్రం తప్పుపట్టలేం. బదిలీల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు సమర్థనీయమే'.. అని ధర్మాసనం తన తీర్పులో స్పష్టంచేసింది.

వారికిచ్చి వీరికివ్వకపోవడం వివక్షే..

వీటిపై జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. కాంట్రాక్టు టీచర్ల తరఫు న్యాయవాది ఎన్వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందన్నారు. ఈ తీర్పు కాంట్రాక్టు, తాత్కాలిక, అడ్‌హాక్ తదితర ఉద్యోగులకు వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీస వేతనాలను వర్తింపజేస్తూ జీఓ ఇచ్చిందని, అయితే అధికారులు వాటిని కాంట్రాక్టు టీచర్లకు వర్తింపచేయడం లేదన్నారు. పిటిషనర్లు కాంట్రాక్టు టీచర్లు మాత్రమేనని, వారికి ట్రాన్స్‌ఫర్లు వర్తింపజేయడానికి వీల్లేదని తెలిపారు. కనీస వేతనాలు వర్తింపజేయకుండా బదిలీలు చేయడానికి వీల్లేదన్నారు. సర్వ శిక్షా అభియాన్ తరఫు న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపిస్తూ.. కేజీబీవీ, యూనివర్సిటీలు, సొసైటీలు, మోడల్ పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీస వేతన స్కేల్‌ను వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అయితే, ఈ ఉత్తర్వులు మంజూరు చేసిన ఖాళీల కింద నియమితులైన వారికి మాత్రమే వర్తిస్తాయన్నారు. అలాగే, బదిలీ చేయాలని పలువురు కాంట్రాక్టు టీచర్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారని, ఆ మేరకు వారి బదిలీ జరిగిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కనీస వేతనాల విషయంలో ఎన్వీ సుమంత్ వాదనలతో ఏకీభవిస్తూ ఇటీవల తీర్పు వెలువరించింది. అంతేకాక.. 'తమకు కనీస వేతన స్కేల్ ఉత్తర్వులను వర్తింపజేయాలన్న కాంట్రాక్టు టీచర్ల అభ్యర్థన సబబైనదే. సమాన పనికి సమాన వేతనం చెల్లించకపోవడం అన్నది దోపిడీ, బానిసత్వం కిందకే వస్తుందని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తన సంక్షేమ విధానంలో భాగంగానే కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకునే వారికి కనీస వేతన స్కేల్‌ను అమలుచేస్తూ ఉత్తర్వులిచ్చింది. అధికారులు ఆ స్కేల్‌ను వర్తింపజేయకపోవడం ఏకపక్షం. కనీస వేతనాల విషయంలో సింగిల్ జడ్జి తీర్పును ఏ రకంగానూ విమర్శించాల్సిన అవసరంలేదు'.. అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

నేటి నుంచి టైగర్ ట్రయంఫ్ సీఫేజ్ విన్యాసాలు

యుద్ధ విన్యాసాల్లో సత్తా చాటనున్న భారత్, యూఎస్ త్రివిధ దళాలు



యూఎస్ఎస్ హాల్‌సే యుద్ధ నౌక

సాక్షి, విశాఖపట్నం: భారత్, యూఎస్ మధ్య రక్షణ బంధం మరింత బలోపేతం చేసేందుకు రెండు దేశాల మధ్య నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్–2024 యుద్ధ విన్యాసాలు కీలక దశకు చేరుకున్నాయి. నేటి నుంచి విశాఖ వేదికగా సీ ఫేజ్ విన్యాసాలు జరగనున్నాయి. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖలో టైగర్ ట్రయంఫ్–2024 విన్యాసాలు ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యాయి. 18 నుంచి 25 వ తేదీ వరకూ హార్బర్ ఫేజ్ విన్యాసాలు జరిగాయి. నేటి నుంచి ఈ నెల 31 వరకు నిర్వహించే సీ ఫేజ్ విన్యాసాల్లో భారత్, యూఎస్ దేశాలకు చెందిన త్రివిధ దళాలు పాల్గొంటున్నాయి. యూఎస్‌కు చెందిన యూఎస్ఎస్ సోమర్‌సెట్ యుద్ధ నౌక వారం రోజుల క్రితమే విశాఖ చేరుకోగా.. తాజాగా యూఎస్ఎస్ హాల్‌సే యుద్ధ నౌక ఈ విన్యాసాల్లో పాల్గొనేందుకు వచ్చింది. వీటితో పాటు ల్యాండింగ్ ఎయిర్ క్రాఫ్టులు, హెలికాప్టర్లు, యూఎస్ మెరైన్ కార్ప్స్, ఎమ్మార్కెడ్ దళాలు విశాఖలో ఉన్నాయి. ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్స్ కూడా ఈ విన్యాసాల్లో పాల్గొననున్నాయి. హ్యుమనిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్, యుద్ధ విన్యాసాల్ని విశాఖ తీరానికి 40 మైళ్ల దూరంలో నిర్వహించనున్నారు.

రంగుల కేళీలో.. రక్షణ 'బంధం'

విశాఖలో భారత్, అమెరికాకు చెందిన త్రివిధ దళాలు సోమవారం హోలీ సంబరాల్లో మునిగి తేలాయి. ఈస్ట్రన్ నేవల్‌కమాండ్ పరిధిలోని మైదానంలో రక్షణ దళాలకు చెందిన వారంతా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

వెన్నుపోటు పొడుస్తారా..?

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ మిత్రధర్మాన్ని సైతం పక్కనపెట్టి బీజేపీపైనా, ప్రధాని నరేంద్ర మోదీపైనా అసభ్య పదజాలంతో తీవ్ర దుష్ప్రచారానికి దిగడంపై కమల దళం తీవ్ర స్థాయిలో మండిపడుతుంది. రఘురామకృష్ణరాజు విషయంలో రెండ్రోజులుగా టీడీపీ అభిమానులు సాగిస్తున్న ప్రచారానికి తోడు చంద్రబాబుకు అత్యంత అనుకూలంగా ఉండే ప్రధాన పత్రికలో సైతం 'మోదీ.. మోనార్క్' ఎడిటోరియల్ కథనాలు రాయడంపైనా బీజేపీ రాష్ట్ర నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా చంద్రబాబు చెప్పిన రఘురామ కృష్ణరాజును కాకుండా 30 ఏళ్లకుపైగా బీజేపీలో కొనసాగుతున్న సీనియర్ నేత భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఇవ్వడమే తమ పాపమైందని అంటున్నారు. పొత్తులో భాగంగా టీడీపీకి 17 లోక్‌సభ నియోజకవర్గాలున్నాయని, మూడేళ్లకు పైగా టీడీపీతోనే అంటకాగుతున్న రఘురామరాజుకు ఒక టికెట్ ఇవ్వొచ్చు కదా అని కమలం నేతలు ప్రశ్నిస్తున్నారు. రఘురామరాజుకు బీజేపీ సభ్యత్వం కూడా లేదని, ఆయనకు టికెట్ ఎలా ఇస్తామని అంటున్నారు. శ్రీనివాస వర్మ పేరును ప్రకటించినప్పటి నుంచి 'సమయం వచ్చినప్పుడు తడి గుడ్డతో గొంతు కోసేవాడే మోడీజీ' అంటూ ప్రధానిపైనే పోస్టులు పెడుతున్నారని మండిపడుతున్నారు. రఘురామరాజుకి బీజేపీ నుంచి అవకాశం ఇవ్వకపోతే బీజేపీ పక్కా డబుల్ గేమ్ ఆడుతున్నట్టే లెక్కా' అంటూ మరొక పోస్టు వచ్చిందని.. 'ఇంకా బీజేపీ జగన్‌రెడ్డి చేతిలో ఉంది అని చాలా మంది తెలుగుతమ్ముళ్ల అనుమానం' అంటూ ఇంకొకరు పోస్టులు పెడుతున్నారని, 'బీజేపీ జస్ట్ అలయెన్స్‌లో ఉంటుంది, ఓటు వేసేది లేదు. పోతేపోయింది -- ఇలాంటి రాజకీయాలా..' అంటూ అసభ్య పదజాలంతో మరో పోస్టు పెట్టారని, ఇలా అనేక మెసేజ్‌లు పెడుతున్నారని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి కాంగ్రెస్ సోషల్ మీడియాలో బీజేపీకి వ్యతిరేకంగా 'నో ఓట్ ఫర్ బీజేపీ' 'నో ఓట్ టు బీజేపీ' శీర్షికలతో చేస్తున్న ప్రచారానికి టీడీపీ అభిమానులు జతకలుస్తున్నారని చెప్పారు. రెండు రోజుల కిందటే చంద్రబాబుకు పూర్తి అనుకూలంగా ఉండే ఒక పత్రికలో నరేంద్ర మోదీ వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేస్తూ ఆ పత్రిక యజమాని ఎడిటోరియల్ కూడా రాశారని చెప్పారు. రఘురామకు సీటు నిరాకరించినప్పటి నుంచి ఓ ప్రణాళిక ప్రకారం తమ పార్టీపైన, ప్రధానిపైన దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నేతలు అంటున్నారు. ఇంత విష ప్రచారం జరుగుతున్నా బీజేపీ రాష్ట్ర నాయకత్వం పట్టించుకోకపోవడాన్ని కూడా వారు తప్పుపడుతున్నారు. రఘురామకృష్ణరాజు ఇప్పటికీ టీడీపీ నుంచి పోటీ చేసేందుకు ఆయన అభిమానులు మంగళవారం హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశాలకు ఏర్పాట్లు చేసుకుంటూ మరో పక్క బీజేపీపై ఇలాంటి ప్రచారానికి దిగడాన్ని తప్పుపడుతున్నారు.





సోషల్ మీడియాలో బీజేపీపై తెలుగు తమ్ముళ్లు పెట్టిన పోస్టులు

చంద్రబాబు మార్కు రాజకీయం..

2019లో వైఎస్ జగన్ ప్రభంజనంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నరసాపురం లోక్‌సభ స్థానంలో గెలుపొందిన రఘురామకృష్ణరాజు ఆ తర్వాత పూర్తిగా తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుకు అనుకూలంగా పనిచేస్తూ, 10 రోజుల క్రితమే వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారని బీజేపీ నాయకులు గుర్తు చేస్తున్నారు. అలాంటి రఘురామకృష్ణరాజుకు పొత్తులో టీడీపీ పోటీ చేస్తున్న ఏదో ఒక సీటు ఇచ్చి ఉండొచ్చు.. లేదంటే నరసాపురం లోక్‌సభ సీటునే టీడీపీనే తీసుకొని ఆయనకు కేటాయించి ఉండొచ్చు కదా అంటూ కమలం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆయనకు టీడీపీ నుంచి టికెట్ ఇచ్చే ఉద్దేశం లేక చంద్రబాబు వ్యూహాత్మకంగా ఆయన సిట్టింగ్ స్థానం నరసాపురం లోక్‌సభ స్థానాన్ని సీటును పొత్తులో బీజేపీకి కేటాయించారని బీజేపీవర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా బీజేపీ మొదట ఏలూరు లోక్‌సభ స్థానాన్ని కోరినప్పటికీ, ఆ స్థానాన్ని బీసీకి ఇవ్వాలన్న సాకుతో చంద్రబాబు బీజేపీకి నరసాపురం స్థానాన్ని సూచించారని అంటున్నారు. నరసాపురం నుంచి రఘురామకృష్ణరాజుకు బీజేపీ టికెట్టు ఇప్పించాలని ప్రయత్నించారని, అయితే, నరసాపురంలో బీజేపీ నేత శ్రీనివాసవర్మ మూడు దశాబ్దాలుగా పార్టీకి పని చేస్తున్న వ్యక్తి ఎంపిక చేయడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. 1991లో బీజేపీ యువజన విభాగం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా మొదలు పెట్టి ప్రస్తుతం రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్నారని, అందువల్ల బీజేపీ ఈ స్థానం నుంచి శ్రీనివాస వర్మను పోటీకి దింపిందని పేర్కొంటున్నారు. ఇది నచ్చకే బీజేపీపై టీడీపీ విష ప్రచారం చేస్తోందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. 2014 ఎన్నికల్లో సైతం బీజేపీ – టీడీపీ పొత్తులోనే చంద్రబాబు నరసాపురం లోక్‌సభ సీటు బీజేపీ అభ్యర్థిగా రఘురామకృష్ణరాజును పోటీ చేయించడానికి ఈ తరహా డ్రామాలే ఆడారని కొందరు కమలం పార్టీ నాయకులు గుర్తు చేస్తున్నారు. 'బీజేపీ ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో రఘురామకృష్ణరాజు పేరు లేకపోవడంలో ఆశ్చర్యం ఏముంది? కనీసం భారతీయ జనతా పార్టీలో ప్రాథమిక సభ్యత్వం కూడా తీసుకోకుండా సీటు ఎలా ఆశిస్తారు.. ఇది బీజేపీ శ్రేణులకే కాదు, సామాన్యులకూ అర్థం కాని ప్రశ్న. కానీ వారిపై జాలి చూపే పార్టీలు ఎందుకు సీటు ఇవ్వలేదో సమాధానం చెప్పాలి' అంటూ బీజేపీ నాయకుడు లక్ష్మీపతి రాజా సోషల్ మీడియాలో ట్వీట్ చేయడం గమనార్హం.

ఇడుపులపాయ నుంచి ప్రచార భేరి

రేపటి నుంచి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు సీఎం జగన్ శ్రీకారం

- వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రార్థనలు, నివాళులు అర్పించి యాత్ర ప్రారంభం
- వేంపల్లి, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా సాయంత్రానికి ప్రొద్దుటూరులో సభ
- 27న రాత్రి ఆళ్లగడ్డలో బస.. 28న నంద్యాల లోక్‌సభ నియోజకవర్గంలో బస్సుయాత్ర
- ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 21 రోజులపాటు కొనసాగనున్న యాత్ర
- సిద్ధం సభలు జరిగిన 4 ఎంపీ నియోజకవర్గాలు మినహా 21 చోట్ల బస్సు యాత్ర
- బస్సు యాత్రలో రోజూ ఉదయం ప్రజలు, మేధావులతో సీఎం సమావేశం
- ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపర్చుకోవడానికి సలహాలు, సూచనల స్వీకరణ
- సాయంత్రం ఆయా చోట్ల జరిగే బహిరంగ సభలకు హాజరు

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచారభేరి మోగించనున్నారు. బుధవారం ఉదయం 10.56 గంటలకు సీఎం జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి ఇడుపులపాయ చేరుకుని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రార్థనలు చేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను ప్రారంభిస్తారు. తొలిరోజు బస్సు యాత్ర కడప పార్లమెంట్ నియోజకవర్గంలో జరగనుంది. ఇడుపులపాయ నుంచి వేంపల్లి, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా సాయంత్రం ప్రొద్దుటూరు చేరుకుని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి దువ్వూరు, చాగలమర్రి మీదుగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. గురువారం నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర నిర్వహిస్తారు.



ప్రజాక్షేత్రంలోనే జననేత..

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 21 రోజులపాటు సీఎం జగన్ బస్సుయాత్రను నిర్వహించనున్నారు. ఒక్కో రోజు ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో యాత్ర జరగనుంది. సిద్ధం సభలు జరిగిన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలు మినహా మిగతా 21 ఎంపీ స్థానాల పరిధిలో బస్సు యాత్ర నిర్వహిస్తారు. యాత్రలో రోజూ ఉదయం వివిధ వర్గాల ప్రజలు, మేధావులతో సీఎం జగన్ సమావేశమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపర్చుకోవడానికి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. సాయంత్రం ఆయా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. బస్సు యాత్రలో 21 రోజులు ప్రజలతో సీఎం జగన్ మమేకమవుతారు. పూర్తిగా ప్రజాక్షేత్రంలోనే ఉంటారు.

విప్లవాత్మక మార్పులను వివరిస్తూ.. నాటి అరాచకాలను ఎండగడుతూ..

వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడం కోసం భీమిలి(ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు(రాయలసీమ), మేదరమెట్ల(దక్షిణ కోస్తా)లలో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలకు ప్రజలు ఒకదానికి మించి మరొకటి పోటీపడుతూ పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజాసభలుగా చరిత్రలో నిలిచాయి. అదే సమయంలో టీడీపీ–జనసేన పొత్తు లెక్క తేలాక తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ, బీజేపీతో జత కలిశాక మూడు పార్టీలు చిలకలూరిపేటలో ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. సిద్ధం సభల ఊపుతో 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించిన సీఎం జగన్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా బస్సు యాత్ర ద్వారా తొలి విడత ప్రచారాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రతి ఇంటా, ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పులను వివరిస్తూ 2014–19 మధ్య చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ–జనసేన–బీజేపీ సర్కార్ అరాచకాలను మరోసారి గుర్తు చేయనున్నారు. ఇప్పుడు మళ్లీ అదే కూటమి జట్టు కట్టటాన్ని ఎండగడుతూ బస్సు యాత్రలో ప్రచారం చేయనున్నారు.

ఇటు పేదల సైన్యం.. అటు పెత్తందార్ల పటాలం

రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేకున్నా బలహీన వర్గాలకు 48 శాసనసభ, 11 ఎంపీ సీట్లు

అసెంబ్లీ, ఎంపీ కలిపి మొత్తం 200 స్థానాల్లో.. 100 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే

లోక్‌సభ స్థానాల్లో టీడీపీ-జనసేన-కూటమి పోటీ ఇలా..

పార్టీ	పోటీ చేసే స్థానాలు	అభ్యర్థులను ఖరారు చేసినవి	అభ్యర్థులను ఎంపిక చేయాల్సినవి
టీడీపీ	17	13	4
జనసేన	2	1	1
బీజేపీ	6	6	0
మొత్తం	25	20	5

రిజర్వుడు స్థానాలు పోగా ఏకంగా 40 శాతం జనరల్ సీట్లను బీసీలకే ఇచ్చిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదల పక్షాన ఎవరు? పెత్తందారులకు కొమ్ము కాస్తోంది ఎవరనేది ఎన్నికల సాక్షిగా స్పష్టంగా తేలిపోయింది. ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షాన నిలిస్తే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పెత్తందార్ల వైపు నిలిచింది. రాష్ట్రంలోని 175 శాసనసభ, 25 లోక్‌సభ నియోజకవర్గాలు వెరసి 200 స్థానాలకు గానూ సగం అంటే వంద సీట్లను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ కేటాయించడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన 36 శాసనసభ, ఐదు లోక్‌సభ వెరసి 41 స్థానాలను మినహాయిస్తే మిగతా 159 శాసనసభ, లోక్‌సభ జనరల్ స్థానాల్లో 59 చోట్ల (48 శాసనసభ, 11 లోక్‌సభ) బీసీ వర్గానికి చెందిన అభ్యర్థులను సీఎం జగన్ బరిలోకి దించారు. అంటే జనరల్ స్థానాల్లో దాదాపు 40 శాతం సీట్లను బీసీలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 159 జనరల్ స్థానాలకు గానూ కేవలం 35 స్థానాల్లో(31 శాసనసభ, 4 లోక్‌సభ) మాత్రమే బీసీలకు అవకాశం కల్పించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను ఖరారు చేసిన జనరల్ స్థానాలను పరిగణనలోకి తీసుకున్నా బీసీలకు కేవలం 37 స్థానాలను (33 శాసనసభ, 4 లోక్‌సభ) మాత్రమే కేటాయించారు. కూటమి కేవలం 23 శాతం స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. సేవే పరమావధిగా జనబలమే గీటురాయిగా నిజాయితీ, నిబద్ధత, విధేయత కొలమానంగా విద్యావంతులు, సామాన్యులకు సీఎం జగన్ పట్టంగట్టారు. మరోవైపు చంద్రబాబు యథాప్రకారం కోట్లు కుమ్మరించే వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఆర్థిక నేరగాళ్లు, నేర చరితులకు పెద్దపీట వేశారు.



అదే ఒరవడితో...

నామినేటెడ్ పనులు, పదవుల్లో ఆయా వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకంగా చట్టం చేసి మరీ రాజకీయ సాధికారతకు బాటలు వేసిన సీఎం జగన్ అదే ఒరవడిని కొనసాగిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో సగం సీట్లను వారికి కేటాయించారు. రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేని బీసీలకు 48 శాసనసభ, 11 లోక్‌సభ వెరసి 59 స్థానాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుని సీఎం జగన్ సంచలనం సృష్టించారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. అందులోనూ ఉపాధి కూలీ ఈర లక్కప్ప (మడకశిర), టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు (నెల్లూరు), బంగారు నగల తయారీ కార్మికుడు ఖలీల్ అహ్మద్(నెల్లూరు సిటీ), సర్నాల తిరుపతిరావు (మైలవరం), సాధారణ న్యాయవాది గూడూరు ఉమాబాల (నరసాపురం) లాంటి సామాన్యులను బరిలోకి దించారు. దేశంలో సామాజిక న్యాయం నినాదంతో ఆవిర్భవించిన బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, బీసీ నేతలు నాయకత్వం వహిస్తున్న సమాజ్‌వాది పార్టీ(అఖిలేష్ యాదవ్), ద్రవిడ మున్నేత్ర కజగం (తమిళనాడు సీఎం స్టాలిన్) సైతం ఈ స్థాయిలో బడుగు, బలహీన వర్గాలకు సీట్లను కేటాయించిన దాఖలాలు లేవు.

మరోసారి ద్రోహం..

సామాజిక న్యాయంలో సీఎం జగన్ దేశానికి మార్గ నిర్దేశం చేస్తూ ఆదర్శంగా నిలవగా రాజకీయాలను ఫక్తు వ్యాపారంగా మార్చేసి ఓటుకు కోట్లు వెదజల్లిన చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మాత్రం యథాప్రకారం సామాజిక ద్రోహానికి పాల్పడింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అరకొరగా కేటాయించడంతోపాటు మిగతా చోట్ల రూ.కోట్లకు కోట్లు కుమ్మరించే ఆర్థిక నేరగాళ్లు, వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలనే చంద్రబాబు బరిలోకి దించారు. 2014 తరహాలోనే తాజాగా మరోసారి జనసేన-టీడీపీతో జతకట్టిన చంద్రబాబు 144 శాసనసభ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ 21 శాసనసభ, రెండు లోక్‌సభ స్థానాల్లో జనసేన, పది శాసనసభ, 6 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ పోటీ చేసేలా పొత్తు లెక్కలు తేల్చారు. ఈ కూటమి ఇప్పటిదాకా 156 శాసనసభ, 20 లోక్‌సభ వెరసి 176 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 78 స్థానాలను మాత్రమే కేటాయించింది. ఇందులో 31 శాసనసభ, నాలుగు లోక్‌సభ వెరసి 35 స్థానాల్లో మాత్రమే చంద్రబాబు బీసీలకు అవకాశం ఇచ్చారు. మరో మూడు నాలుగు సీట్లకు మించి ఆ వర్గాలకు కేటాయించే అవకాశం లేదని కూటమి నేతలే చెబుతుండటం గమనార్హం.

నినాదం కాదు విధానమే..

58 నెలలుగా సామాజిక న్యాయం అంటే నినాదం కాదు అమలు చేయాల్సిన విధానమని ప్రతి అడుగులో చాటిచెబుతున్న సీఎం జగన్ సార్వత్రిక ఎన్నికల్లో మరో అడుగు ముందుకేశారు. ఈనెల 16వతేదీన ఒకేసారి 175 శాసనసభ, 25 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. 29 స్థానాల్లో ఎస్సీ, ఏడు స్థానాల్లో ఎస్టీ, 48 స్థానాల్లో బీసీ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దించారు. అంటే 84 శాసనసభ స్థానాలను ఆ వర్గాలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అభ్యర్థులకు ఏడు నియోజకవర్గాల్లో అవకాశం కల్పించారు. 25 లోక్‌సభ స్థానాలకుగానూ 11 చోట్ల బీసీలకు సీట్లు ఇచ్చిన సీఎం జగన్ నాలుగు స్థానాల్లో ఎస్సీలకు, ఒక చోట ఎస్టీ వర్గానికి చెందిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. సీఎం జగన్ ప్రకటించిన అభ్యర్థుల్లో అత్యధికులు సామాన్యులే ఉన్నారు.

పెత్తందార్లకు బాబు పెద్దపీట..

2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ ఆ వర్గాల ప్రజల పుట్టుకను అవహేళన చేసిన చంద్రబాబు, హామీలను నిలబెట్టుకోవాలని వేడుకున్న బీసీలను తోకలు కత్తిరిస్తా, తాటతీస్తానంటూ బెదిరించారు. బలహీన వర్గాలకు చెందిన వారు న్యాయమూర్తులుగా పనికిరారంటూ ఆ వర్గాల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరిన మైనార్టీ యువకులపై దేశద్రోహం కేసులు బనాయించి కటకటాల పాలుచేసి ఆ వర్గాలను అణగదొక్కారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆ వర్గాలకు ద్రోహం చేసి పెత్తందార్లకే పెద్దపీట వేశారు.

- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇప్పటిదాకా 156 శాసనసభ స్థానాలకు (టీడీపీ 138, జనసేన 18) అభ్యర్థులను ప్రకటించగా బీసీలకు 33 (టీడీపీ 31, జనసేన 2), ఎస్సీలకు 27 (టీడీపీ 24, జనసేన 3), ఎస్టీలకు 6 (టీడీపీ 5, జనసేన 1), మైనార్టీలకు 3 సీట్లను కేటాయించారు. అంటే ఆ వర్గాలకు మొత్తం 69 శాసనసభ స్థానాలను కేటాయించారు. టీడీపీ ఓసీలకు కేటాయించిన 75 స్థానాల్లో 30 చోట్ల చంద్రబాబు తన సొంత సామాజిక వర్గానికి చెందిన వారినే బరిలోకి దించడం గమనార్హం.
- కూటమి ఇప్పటిదాక 25 లోక్‌సభ స్థానాలకుగానూ 20 స్థానాల్లో (టీడీపీ 13, బీజేపీ 6, జనసేన 1) అభ్యర్థులను ఖరారు చేసింది. అందులో బీసీలకు 4 (టీడీపీ), ఎస్సీలకు 4 (టీడీపీ 3, బీజేపీ 1), ఎస్టీలకు ఒకటి (బీజేపీ) కేటాయించారు.
- శాసనసభ, లోక్‌సభ రెండూ కలిపి బీసీలకు 59 సీట్లను సీఎం జగన్ కేటాయించగా చంద్రబాబు కేవలం 35 స్థానాల్లో మాత్రమే వారికి పోటీకి అవకాశం కల్పించడం గమనార్హం. మైనార్టీలకు సీఎం జగన్ 7 శాసనసభ స్థానాల్లో అవకాశం ఇచ్చి ఆదరిస్తే చంద్రబాబు మూడు స్థానాలకే పరిమితం చేశారు.
- ఎన్నికల్లో కోట్లకు కోట్లు కుమ్మరించే కాంట్రాక్టర్లు అమిలినేని సురేంద్రబాబు (కళ్యాణదుర్గం నియోజకవర్గం), ఎన్నారైలు పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు లోక్‌సభ), వెనిగండ్ల రాము (గుడివాడ), కాకర్ల సురేష్ (ఉదయగిరి నియోజకవర్గం), వ్యాపారులు మాజీ మంత్రి పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ), కేశినేని చిన్ని (విజయవాడ), ఎం.భరత్ (విశాఖ లోక్‌సభ), చింతమనేని ప్రభాకర్ (దెందులూరు), వెలగపూడి రామకృష్ణ (విశాఖ ఈస్ట్), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల) లాంటి నేర చరిత్ర కలిగిన వారిని చంద్రబాబు బరిలోకి దించి తాను పెత్తందార్లకే కొమ్ము కాస్తానని మరోసారి నిరూపించుకున్నారు.

సామాజిక ప్రయాణం..

గత ఎన్నికల్లో అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని పాలనలో ప్రతి అడుగులోనూ చాటిచెబుతున్నారు. మంత్రివర్గంలో ఏకంగా 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఇవ్వగా రాజ్యసభ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల పదవుల్లో సింహభాగం ఆయా వర్గాలకే ఇచ్చారు. దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఆయా వర్గాలకే రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ పదవులు, పనులు దక్కేలా చర్యలు తీసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లు, నాన్ డీబీటీతో రూ.1.79 లక్షల కోట్లు వెరసి రూ.4.49 లక్షల కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూర్చగా ఇందులో సింహభాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ప్రయోజనం పొందారు. సీఎం జగన్ ఒకవైపు పరిపాలనలో భాగస్వామ్యం మరోవైపు ఆర్థిక చేయూతనిస్తుండటం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలు సామాజిక సాధికారత సాధించేందుకు బాటలు వేసింది. ఇది ఆయా వర్గాల ప్రజల్లో సీఎం జగన్ నాయకత్వం పట్ల విశ్వసనీయత మరింత పెరిగేందుకు దోహదం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు అగ్రవర్ణ పేదలు సీఎం జగన్ వెంటే నడుస్తున్నారని భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలు చాటిచెప్పాయి. మరోవైపు సామాజిక ద్రోహం తలపెట్టిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమికి నిరాదరణ ఎదురవుతోంది. టీడీపీ-జనసేన పొత్తుల లెక్క తేలాక ఆ రెండు పార్టీలూ ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభకు, బీజేపీతో జత కలిశాక మూడు పార్టీలు చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలు ప్రజలు లేక పేలవంగా సాగడమే ఇందుకు నిదర్శనం. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం మరోసారి సృష్టించడం ఖాయమని సిద్ధం సభలు తేల్చి చెప్పగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఘోర పరాజయం తథ్యమని తాడేపల్లిగూడెం, చిలకలూరిపేట సభలు నిరూపించాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయాన్ని నమోదు చేయడం ఖాయమని టైమ్స్ నౌ-ఏటీజీ, జీన్యూస్-మాట్రిజ్ లాంటి దిగ్గజాలకు పైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ వెల్లడైంది. వీటిని పరిశీలిస్తే వచ్చే ఎన్నికలు ఏక పక్షమేనని, వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి వైఎస్ జగన్ మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక ఇలా..

సామాజిక వర్గం	వైఎస్సార్‌సీపీ కేటాయించిన స్థానాలు	టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కేటాయించిన స్థానాలు
ఎస్సీ	29	27 (టీడీపీ 24, జనసేన 3)
ఎస్టీ	7	6 (టీడీపీ 5, జనసేన 1)
బీసీ	48	33 (టీడీపీ 31, జనసేన 2)
మొత్తం	84	66

(నోట్.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 156 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది)





మైనార్టీలకు శాసనసభ సీట్లు

పార్టీ	కేటాయించిన స్థానాలు
వైఎస్సార్‌సీపీ	7
టీడీపీ	3

ఎంపికపై కూటమి మల్లగుల్లాలు

కూటమితో జతకట్టిన చంద్రబాబు జనసేనకు 21, బీజేపీకి 10 అసెంబ్లీ సీట్లు పోగా మిగతా 144 శాసనసభ స్థానాల్లో టీడీపీ పోటీ చేసేలా పొత్తు కుదుర్చుకున్నారు. రెండు లోక్‌సభ స్థానాలను జనసేనకు, ఆరు లోక్‌సభ స్థానాలను బీజేపీకి కేటాయించగా మిగతా 17 ఎంపీ స్థానాల్లో టీడీపీ పోటీ చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకూ 138 అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించగా మరో ఆరు స్థానాలపై చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నారు. 18 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన పవన్ కళ్యాణ్ మిగతా సీట్లకు అభ్యర్థుల ఎంపికపై కుస్తీ పడుతున్నారు. 13 ఎంపీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ఖరారు చేయగా మిగతా నాలుగు చోట్ల చంద్రబాబు ఆపసోపాలు పడుతున్నారు. తనకు కేటాయించిన ఆరు లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. జనసేనకు కేటాయించిన రెండు లోక్‌సభ స్థానాల్లో కాకినాడకు అభ్యర్థిని ప్రకటించిన పవన్ కళ్యాణ్ మచిలీపట్నం ఎంపీ సీటుపై తర్జన భర్జన పడుతున్నారు.

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక ఇలా..

సామాజిక వర్గం	వైఎస్సార్‌సీపీ కేటాయించిన స్థానాలు	టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కేటాయించిన స్థానాలు
ఎస్సీ	4	4(టీడీపీ 3, బీజేపీ 1)
ఎస్టీ	1	1(బీజేపీ)
బీసీ	11	4(టీడీపీ)
మొత్తం	16	9

(నోట్.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 20 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది)

శాసనసభ స్థానాల్లో టీడీపీ-జనసేన-కూటమి పోటీ ఇలా..

పార్టీ	పోటీ చేసే స్థానాలు	అభ్యర్థులు ఖరారైనవి	అభ్యర్థులను ఎంపిక చేయాల్సినవి
టీడీపీ	144	138	6
జనసేన	21	18	3
బీజేపీ	10	-	10
మొత్తం	175	156	19



108 ప్రాణం పోసిన అంబులెన్స్‌లు

2020 జూలై నుంచి 43.03 లక్షల మందికి అత్యవసర సేవలు

సేవలు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికం

బాబు పాలనలో నిర్వీర్యమైన సేవలను బలోపేతం చేసిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం బండమీదపల్లెకు చెందిన వసంత, రాజశేఖర్ దంపతులు. వీరు ఇదే మండలంలోని ముదిరెడ్డిపల్లె అటవీప్రాంత సమీపంలోని మామిడి తోటకు కావలి ఉంటున్నారు. గర్భిణి అయిన వసంతకు గత ఏడాది మే 28న ఉన్నట్టుండి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో 108కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన 108 అంబులెన్స్ వసంత ఉన్న ప్రాంతానికి చేరుకుంది. అయితే మామిడితోటకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఒక కి.మీ దూరంలో అంబులెన్సు ఆగిపోయింది. దీంతో రోడ్డు పక్కనే ఆపి పైలెట్ ప్రసాద్, టెక్నీషియన్ గణేశ్‌లు నడుచుకుంటూ వసంత ఉండే తోటకు చేరుకున్నారు. అప్పటికే ఆమె తీవ్రమైన పురిటినొప్పులతో బాధపడుతోంది. వసంత పరిస్థితిని గమనించిన టెక్నీషియన్ ఆలస్యం చేస్తే తల్లీ, బిడ్డ ప్రాణాలకు ముప్పని ఆ తోటలోనే వసంతకు కాన్పు చేశాడు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం బాలింత వసంతను స్ట్రెచర్‌పై కి.మీ మేర మోసుకుని వెళ్లి అంబులెన్స్‌లో ఎక్కించుకుని చౌడేపల్లి ప్రభుత్వాస్పత్రికి తల్లీ, బిడ్డను చికిత్సకోసం తరలించారు. వసంత తరహాలోనే పురిటినొప్పులతో బాధపడే గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన క్షతగ్రాతులు, ఇతర అనారోగ్య బాధితులకు రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు అండగా నిలుస్తున్నాయి. ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతున్న లక్షల మందికి అంబులెన్స్‌లు సంజీవనిలా పునర్జన్మను ప్రసాదిస్తున్నాయి. ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉన్న సీఎం వైఎస్ జగన్ గత టీడీపీ ప్రభుత్వంలో కునారిల్లిన 108 అంబులెన్స్ వ్యవస్థకు ఊపిరిలూదారు. ప్రతి మండలానికి రెండు అంబులెన్స్‌లను సమకూర్చి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించారు.



43.03 లక్షల మంది సేవల వినియోగం

2020 జూలై నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకూ 43,03,990 మంది అత్యవసర సేవలు అందుకున్నారు. వీరిలో అత్యధికంగా మహిళలే ఉన్నారు. 9.34 లక్షల మంది గర్భిణులు, బాలింతలు, ఆ తరువాత ఎక్కువగా 5.58 లక్షల మంది కిడ్నీ, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు సేవలు పొందారు. రోడ్డు, ఇతర ప్రమాదాల్లో క్షతగాత్రులైన 4.63 లక్షల మందిని అంబులెన్స్‌లు ఘటనా స్థలాల నుంచి సకాలంలో ఆస్పత్రులకు తరలించాయి. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 108కు ఫోన్ చేసిన 15 నిమిషాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లోనే అంబులెన్స్‌లు ఘటనా స్థలికి చేరుకుంటున్నాయి. ఈ సమయం గిరిజన ప్రాంతాల్లో గతంలో 30 నిమిషాలుగా ఉంటే ఇపుడు అది 17–23 నిమిషాలకు తగ్గిపోయింది.

నాడు దైన్యం.. నేడు ధైర్యం..

గత టీడీపీ ప్రభుత్వంలో 108 సేవల పరిస్థితి రాష్ట్రంలో దైన్యంగా మారింది. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంస్కరణల ఫలితంగా నేడు ఆపత్కాలంలో ప్రజలకు వీటి సేవలు ధైర్యంగా ఉంటున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి 336 వాహనాలే ఉన్నాయి. మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేని దుస్థితి. దీనికి చెక్ పెడుతూ 2020 జూలై 1న 412 కొత్త వాహనాలను సీఎం జగన్ ప్రారంభించారు. 26 నియోనాటల్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో వీటి సంఖ్య 748కు పెరిగింది. ఇందు కోసం మొత్తం రూ.96.5 కోట్లు ఖర్చు చేశారు. 2022 అక్టోబర్‌లో అదనంగా మరో 20 కొత్త 108 అంబులెన్సులను గిరిజన ప్రాంతాల్లో చేర్చారు. వీటి కోసం రూ.4.76 కోట్లు వెచ్చించారు. దీంతో 108 అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. వీటిలో 2.5 లక్షల కిలో మీటర్లకుపైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి 146 కొత్తవి ఇటీవలే కొనుగోలు చేసి అందుబాటులోకి తెచ్చింది. దీని కోసం మరో రూ.34.79 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి నెలా 108 అంబులెన్సుల నిర్వహణ కోసం రూ.14.39 కోట్లు వెచ్చిస్తోంది. అంటే ఏడాదికి రూ.172.68 కోట్లు కేటాయిస్తోంది. వీటికి తోడు ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ కోసం ఏడాదికి రూ.15.88 కోట్లు ఖర్చు చేస్తోంది.

2020 జూలై నుంచి 108 అంబులెన్స్ సేవలు ఇలా

సంవత్సరం	సేవలు పొందిన వారు
2020	4,07,439
2021	10,77,624
2022	12,15,880
2023	13,02,589
2024(ఇప్పటి వరకూ)	3,00,188

'రేషన్'లో పౌష్టికాహారం

- ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలు అందిస్తున్న ప్రభుత్వం
- రైతుల నుంచే నేరుగా జొన్నలు, రాగులు మద్దతు ధరకి కొనుగోలు
- మార్కెట్లో ధర లేనపుడు ప్రభుత్వ కొనుగోలుతో ధరల స్థిరీకరణ
- కొర్రలను మద్దతు ధరకు కొనేలా కేంద్రాన్ని ఒప్పించిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పౌష్టికాహారం సరఫరాకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. రైతులు పండించిన చిరుధాన్యాలు (రాగులు, జొన్నలు) ఉత్పత్తులను మద్దతు ధరకు సేకరించి తిరిగి వాటిని పీడీఎస్‌లోకి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందిస్తోంది. తొలుత వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమలను ప్రాధాన్యంగా తీసుకుని పైలెట్ ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో రాగులు, రాయలసీమలో జొన్నల వినియోగానికి మంచి డిమాండ్ కనిపిస్తోంది. కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే రేషన్‌లో మూడు కేజీల బియ్యం బదులు రాగులు లేదా జొన్నలను పంపిణీ చేస్తోంది. అయితే రేషన్‌లో ఇచ్చే రాగులకు బదులు రాగిపిండి ఇవ్వాలని విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో ప్యాకెట్ల రూపంలో రాగి పిండిని కిలో రూ. 11కు పంపిణీ చేస్తోంది.

ఒడిశా నుంచి రాగులు..

ఏపీలో రాగుల పంట శ్రీసత్యసాయి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో సాగవుతుంది. తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న కారణంగా పౌరసరఫరాల సంస్థ సేకరణ కూడా తక్కువగా ఉంటోంది. దీంతో కర్ణాటక, ఒడిశా నుంచి రాగులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయితే కర్ణాటక నుంచి సానుకూల జవాబు రాకపోవడంతో ఒడిశా నుంచి సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇక కొర్రలకు కూడా మద్దతు ధర ఇవ్వాలంటూ సీఎం జగన్ కేంద్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తికి సానుకూల స్పందన వచ్చింది. రాగులకు ఇచ్చే మద్దతు ధర క్వింటా రూ. 3,846కే కొర్రలను కూడా కొనుగోలు చేసుకోవచ్చని కేంద్రం అనుమతించింది. రాష్ట్రంలో కొర్రసాగు పెంచేందుకు ప్రభుత్వం రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తోంది.

ప్రభుత్వ కొనుగోలుతో ధరల స్థిరీకరణ

క్వింటాలు రాగులకు మద్దతు ధర రూ.3,846, జొన్నలకు రూ.3,225గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే రూ.78.18 కోట్ల విలువైన 25 వేల టన్నుల జొన్నలను పౌరసరఫరాల సంస్థ సేకరించింది. వాస్తవానికి మార్కెట్‌లో ధర లేనప్పుడు ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో ధరలను స్థిరంగా ఉంచగలిగింది. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో జొన్నలను ఏప్రిల్ నుంచి కార్డుదారులందరికీ అందజేయనుంది. మరోవైపు అదనంగా మరో 20 వేల టన్నుల వరకు జొన్నల కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఇక పంటను నేరుగా కల్లాల్లోనే కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వం రైతులపై రవాణా, హమాలీ ఖర్చుల భారాన్ని తగ్గిస్తోంది. ఒక గోనె సంచి వినియోగానికి (50కేజీలు) రూ.3.39, క్వింటా లేబర్ చార్జీ కింద రూ.22 రైతులకు అందిస్తోంది.



త్వరలోనే నువ్వు అన్నీ మరిచిపోతావు.
త్వరలోనే ప్రతి ఒక్కరూ నిన్నూ మరచిపోతారు.
- మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 26 మార్చి 2024

ప్రపంచానికి మాస్కో పాఠం

ప్రపంచదేశాలు ఉలిక్కిపడ్డాయి. శుక్రవారం రాత్రి మాస్కో సమీపంలో క్రిక్కిరిసిన మాల్‌లోకి వచ్చి, ఓ సంగీత కార్యక్రమ హాలులోని జనంపై నలుగురు తీవ్రవాదులు జరిపిన విచక్షణారహితమైన దాడి ప్రపంచ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. గత రెండు దశాబ్దాల్లో రష్యాలో కనివిని ఎరుగని ఈ స్థాయి దాడిలో దాదాపు 140 మందికి పైగా అమాయకులు ప్రాణాలు విడిస్తే, కొన్ని పదుల మంది గాయాల పాలయ్యారు. రష్యా అధ్యక్షుడిగా పుతిన్ అయిదోసారి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే ఈ దుశ్చర్య జరగడం గమనార్హం. యథేచ్ఛగా కాల్పులు జరిపి, భవనాన్ని తగులబెట్టిన దుండగులకు ఉక్రెయిన్‌తో లింకుందని రష్యా గూఢచర్య సంస్థల మాట. అయితే, 2022 నుంచి రష్యా యుద్ధంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఉక్రెయిన్ మాత్రం తమకు సంబంధం లేదని ఖండించింది. కాగా, ఈ దాడి తామే చేసినట్టు తీవ్రవాద 'ఐఎస్ఐఎస్'(ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ అండ్ సిరియా) శాఖ అయిన 'ఇస్లామిక్ స్టేట్ - ఖొరసాన్ ప్రావిన్స్' (ఐఎస్ఐఎస్-కె) ప్రకటించడంతో కొత్త చర్చకు తెర లేచింది.

జనబాహుళ్యం ప్రాంతాల్లో ఇస్లామిస్ట్ ఉగ్రదాడుల ప్రమాదం ఉందని అమెరికా మార్చి 7 నాటికే హెచ్చరించింది. అయినా, రష్యా పెడచెవిన పెట్టింది. అలా ఈ దాడులు మాస్కో స్వీయ భద్రతా వైఫల్యానికి అద్దం పట్టడమే కాక, ఆ దేశానికి తలవంపులయ్యాయి. మాస్కో శివారులోనే తీవ్రవాదులు చులాగ్గా దాడి చేస్తుంటే, ఉక్రెయిన్‌పై యుద్ధంతో తీరిక లేని రష్యాకు తగిన ప్రత్యేక దళాలు అందుబాటులో లేకుండా పోయాయనే మాటా వినిపిస్తోంది. అయినా సరే, దేశంలో అసమ్మతిపై ఉక్కుపాదం మోపి, ఎన్నికల్లో ఎన్నడూ లేనంతగా 87.7 శాతంపైగా ఓట్లు తెచ్చుకొని, ఉక్రెయిన్‌పై యుద్ధానికి ప్రజామోదం ఉందని చెప్పుకుంటున్న రష్యా పాలకులు ఇప్పటికీ తప్పుడు దిశ వైపు చూస్తుండడం ఆశ్చర్యకరం. స్వయంకృతమని భావిస్తున్న తీవ్రవాద ముప్పుకూ పాశ్చాత్య ప్రపంచాన్నే నిందిస్తుండడం విచిత్రం. రెండు దశాబ్దాల పైగా ఉత్తర కాకసస్, చెచెన్యాలలో తీవ్రవాదంపై రష్యా తలపడుతోంది. సిరియా - ఇరాన్‌లతో దాని స్నేహం, మధ్యప్రాచ్యంలో దాని తీవ్రవైఖరి సరే సరి. ఇస్లామిజమ్ అణచివేతకూ దిగింది. దానికిప్పుడు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విశ్లేషణ.

నిజానికి, ఇరాక్, సిరియా దేశాల యుద్ధక్షేత్రాల్లో అసలైన ఐఎస్ఐఎస్ చాలా వరకు ఓటమి పాలైంది. అయితే, ఆ మాతృసంస్థ తాలూకు రక్తసిక్త వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న 'ఐఎస్ ఐఎస్-కె' పడగ విప్పి, బుసలు కొడుతోంది. అఫ్గానిస్తాన్ నుంచి పనిచేస్తున్నట్టుగా అందరూ భావిస్తున్న ఈ వర్గం నిదానంగా తన విషవృక్షపు ఊడలను విస్తరిస్తోంది. ఇప్పటికే అటు అఫ్గానిస్తాన్‌లోనూ, ఇటు పాకిస్తాన్‌లోనూ అది అనేక దాడులు జరిపింది. ఈ జనవరిలో సైతం ఇరాన్‌లోని కెర్మాన్‌లో ఇరానియన్ జనరల్ సంస్మరణ కార్యక్రమం సందర్భంగా అది జరిపిన బాంబు దాడుల్లో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తాజా మాస్కో దాడితో ఈ తీవ్రవాద గ్రూపు భౌగోళికంగా తన పరిధిని విస్తరించుకుంటున్నట్టు కనిపిస్తోంది. 2015 నాటి సిరియా అంతర్యుద్ధంలో రష్యా సేనలు అక్కడి అధ్యక్షుడు బషర్ అల్-అసద్ ఏలుబడిని సమర్థిస్తూ, ఐఎస్ వర్గానికి వ్యతిరేకంగా నిలిచాయి. సిరియాలో ప్రస్తుతం సద్దు లేనందున 'ఐఎస్ఐఎస్-కె' సారథ్యంలోని తీవ్రవాదులు అక్కడ తమ ఓటమికి ఇప్పుడిలా దాడి రూపంలో రష్యాపై ప్రతీకారం తీర్చుకోవాలని భావించి ఉండవచ్చు.

ఉక్రెయిన్‌తో యుద్ధంలో మునిగిన పుతిన్ ఈ తాజా తీవ్రవాద దాడిపై స్పందించే తీరు రానున్న రోజుల్లో ప్రపంచ శక్తి సంబంధాలపై ప్రభావం చూపడం ఖాయం. అసలు దాడికీ, ఉక్రెయిన్‌కూ సంబంధం ఉందన్న రష్యా మాట నమ్మశక్యంగా లేకపోగా, మధ్య ఆసియా ప్రాంతానికి విస్తరించాలని 'ఐఎస్ఐఎస్-కె' పడుతున్న ఆరాటానికి బలమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. తజిక్ వర్గాల్లో ఈ తీవ్రవాద వర్గానికి ఆకర్షణ పెరుగుతోందనీ, ఈ ప్రాంతానికి విస్తరించే సత్తా దానికి ఉందనీ జనవరిలోనే ఐరాస భద్రతా మండలి తన నివేదికలో హెచ్చరించడం గమనార్హం. గత రెండు దశాబ్దాల్లో వివిధ రకాల తీవ్రవాద ఘటనలు చూసిన మాస్కో కళ్ళు తెరిచి నిద్ర నటించడం మానాలి. ప్రస్తుత పరిస్థితుల్లో శుష్క ఆరోపణలు మానేసి, సమస్య అసలు మూలాలపై దృష్టి పెట్టాలి. సొంత పెరట్లోనే ఈ తీవ్రవాద వర్గంతో పోరాటం చేస్తున్న అఫ్గానిస్తాన్ పాలకులతో కలసి కార్యాచరణ చేపట్టాలి.

రష్యా ఘటన సాక్షిగా ఇప్పుడు కావాల్సిందల్లా... తీవ్రవాదంపై ప్రపంచ దేశాల మధ్య ఒక స్పష్టమైన అవగాహన, అంగీకారం. అంతర్జాతీయంగా ఐఎస్ఐఎస్-కె ఊడలు మరింత లోతుగా దిగక ముందే వివిధ ప్రపంచ దేశాలు నడుం బిగించాలి. మునుపు ఐఎస్‌ను మట్టి కరిపించడానికి కలసికట్టుగా కాలు కదిపినట్టే ఇప్పుడూ ముందుకు కదలాలి. ఐఎస్ఐఎస్-కె బలంగా వ్యతిరేకించే అఫ్గాన్ తాలిబన్‌తో అంతర్జాతీయ సమాజం సైతం సమన్వయం చేసుకోవాలి. సొంత గడ్డపై ఐఎస్ఐఎస్-కె, టీటీపీ లాంటి తీవ్రవాదుల కార్యకలాపాలను అనుమతించడం వల్ల చివరకు తమ దేశంతో పాటు, ఈ ప్రాంత భద్రతకే ప్రమాదమని అఫ్గానిస్తాన్ కూడా గ్రహించాలి. అందుకే, ఆ దేశం, దాని పొరుగునున్న ఈ తీవ్రవాద విషసర్పం కోరలు పీకే పనిలో ముందు వరుసలో నిలవాలి. ఇరాన్, చైనా, రష్యా, మధ్య ఆసియా దేశాలు కలిసొచ్చి, ప్రాంతీయంగా ముప్పుగా పరిణమిస్తున్న ఈ తీవ్రవాద భూతాన్ని నిర్వీర్యం చేయాలి. ఏకాగ్ర దృష్టితో సునిశితమైన కార్యాచరణకు దిగితేనే ఫలితాలుంటాయి. అప్పుడే అసువులు బాసిన అమాయకుల పక్షాన నిలిచి, దోషులను వెంటాడి వేటాడగలం. పొంచివున్న సరికొత్త తీవ్రవాద వర్గపు ప్రమాదం నుంచి ప్రపంచాన్ని కాపాడగలం.

ఓటు ప్రజాస్వామ్య జీవధాతువు

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో రాజకీయాలు 2024 సార్వత్రిక ఎన్నికల శంఖారావంతో ఊపందుకున్నాయి. ఓటరు చైతన్యం ఇందులో కీలకం. ఓటు దేశ ప్రజలకు జీవధాతువు. మన జీవిత నిర్మాణానికి అది ఒక పనిముట్టు. ఓటుహక్కును మనం దుర్వినియోగం చేసుకుంటే, మన మిగిలిన హక్కులన్నీ కాల రాయ బడతాయి. అందుకే ఓటు అనేది అత్యున్నతమైనది. దాని విలువ అమూల్యమైనది. ఆ విలువ మానవ విలువలతో సమానమైనది. భిన్న భావజాలాల ప్రభావం ఈ ఎన్నికల మీద ఉండబోతోంది. అంబేద్కర్ వాదుల, సామ్యవాదుల, సోషలిస్టుల, కమ్యూనిస్టుల, స్త్రీవాదుల, దళిత బహుజన వాదుల, మైనారిటీ హక్కుల వాదుల, మానవ హక్కుల పోరాటవాదుల సిద్ధాంతాల ప్రజ్వలనం సమాజంలో అంతర్గతంగా బలంగా ఉందని చెప్పక తప్పదు.

వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) మళ్ళీ తెరపైకి వచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు మరో మూడు నాలుగు రోజుల్లో షెడ్యూలు వస్తుందనగా... బీజేపీకి ఓట్లు కురిపిస్తుందని భావిస్తున్న సీఏఏను మోదీ సర్కారు బ్రహ్మాస్త్రంగా బయటికి తీసింది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు మనదేశ పౌరసత్వాన్ని కల్పించడం దీని లక్ష్యం. సీఏఏ చట్టం 2019 లోనే పార్లమెంట్ ఆమోదం పొందినా, రాష్ట్రపతి సమ్మతి కూడా లభించినా... విపక్షాల ఆందోళనలు, దేశవ్యాప్తంగా నిరసనల కారణంగా అమలులో జాప్యం జరిగింది. పూర్తిస్థాయి నిబంధనలపై సందిగ్ధం నెలకొనడంతో చట్టం కార్యరూపం దాల్చలేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందే దీన్ని అమల్లోకి తీసుకొస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పలుమార్లు చెబుతూ వచ్చారు. సరిగ్గా అదను చూసి ఇపుడు దానిని తెరపైకి తెచ్చారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి 2014 డిసెంబర్ 31 కంటే ముందు మన దేశానికి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలకు ఈ చట్టం వర్తిస్తుంది.

భారతదేశంలోకి అనేక మతాలవారు ఆయా కాలాల్లో వచ్చారు. భారతీయ జన జీవనంలో కలసిపోయారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి అన్ని మతాలవారు, కులాల వారు కలసి పోరాడారు. భారతదేశానికి మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుండి ముస్లింలకు పార్లమెంట్‌లోనూ, అసెంబ్లీలోనూ ప్రాతినిధ్యం ఇస్తూ వస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ముస్లిం సభ్యులు 76 మంది ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ముస్లిం ఎంపీలు గణనీయంగా ఎన్నికయ్యారు. ఆనాడు ముస్లింల జనాభా 6 శాతం కంటే తక్కువ. మొదటి రాజ్యసభలో సుమారు 10.5 శాతం ముస్లిం సభ్యులున్నారు. 2014లో బీజేపీ స్వల్ప మెజారిటీతో లోక్‌సభ ఎన్నికలలో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ అధికారానికి వచ్చిన నాటి నుండి ముస్లింల ప్రాతినిధ్యం అత్యల్పం. అందుకే 2024 ఎన్నికల్లో ముస్లింలు ఏకమై సెక్యులర్ పార్టీలకు ఓట్లు వేస్తారని ఒక పరిశోధనా పత్రం పేర్కొంది. బీజేపీపై పోటీ చేసే బలమైన అభ్యర్థికి ఓట్లు వేస్తారని ఆ పరిశోధన అంచనా వేసింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 27 మంది ముస్లిం అభ్యర్థులు గెలవగా (17వ లోక్‌సభ), 16వ లోక్‌సభలో 23 మంది ముస్లిం సభ్యులున్నారు. పార్లమెంట్ చరిత్రలో ఇది ముస్లింలు తక్కువ సంఖ్యలో వున్న రెండోసభ. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ముస్లిం జనాభా (17.22 కోట్లు) కలిగివున్న దేశం. నిజానికి ముస్లింలు ఈ దేశ స్వాతంత్ర్యంలో పాల్గొన్న ప్రధానమైన శక్తులు. వారిని నిర్లక్ష్యం చేయడం దేశ అభివృద్ధికి, సౌభాగ్యానికి గొడ్డలిపెట్టు.

క్రైస్తవులు భారతదేశానికి ఇతర దేశాల నుండి వలస వచ్చినవారు



కాదు. హిందూమతంలో అస్పృశ్యతకు, నిరాదరణకు గురైనవారు ఆ మతంలోకి వెళ్ళి అక్షర విద్యను నేర్చుకున్నారు. దళితులు ఎక్కువ మంది క్రైస్తవ మతంలో చేరి అక్షర విద్యను నేర్చుకున్నారు. వారిని నిరాకరించడం వల్ల, జనరల్ సీట్లలో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల లౌకికవాదం దెబ్బతింటుంది. ఇక బౌద్ధం భారతదేశంలో సామాజిక, సాంస్కృతిక విప్లవాన్ని తీసుకువచ్చింది. సమసమాజ భావాన్ని ప్రజ్వలింప చేసింది. మానవతా ధర్మాన్ని ప్రబోధం చేసింది. భారతదేశ వ్యాప్తంగా బౌద్ధ సంస్కృతి వికాసం జరిగింది. భారతదేశం నుండి ప్రపంచ దేశాలకు బౌద్ధం విస్తరించింది. భారతదేశ వ్యాప్తంగా బౌద్ధులు కోట్లాది మంది వున్నారు. వారు ప్రత్యక్షంగా లేకపోవచ్చు. పరోక్ష రాజకీయ ఉద్యమంలో వున్నారు. తప్పకుండా భారత రాజకీయాల్లో వీరి ప్రభావం స్పష్టంగా వుంది. ఇకపోతే రామ్ మనోహర్ లోహియా ప్రభావం దళిత బహుజన రాజకీయాల మీద బలంగా వుంది. మండల కమిషన్ రిపోర్టును బయటికి తీసుకొచ్చిన వి.పి. సింగ్ ప్రభావం కూడా బలంగా వుంది. కమ్యూనిస్టులు, అంబేడ్కర్ వాదుల అశేషమైన భావజాలం కూడా 2024 ఎన్నికల మీద వుంది. భారతదేశంలో అనేక భావజాలాల ప్రభావానికి ఈ ఎన్నికలు గురవుతాయి అనడంలో సందేహం లేదు. పూలే, అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా, పెరియార్ రామస్వామి నాయకర్, వి.పి. సింగ్, కాన్షీరామ్... వీరందరి ప్రభావం తప్పక ప్రజల మీద ఉంది.

ఇకపోతే 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గడిచిన తొమ్మిదేళ్ళ పది మాసాల్లో పెరిగిన నిరుద్యోగం, చుక్కలనంటిన నిత్యావసరాల ధరలు, నల్ల ధనాన్ని వెనక్కి తీసుకురావడంలో విఫలం కావడం, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొన్న అష్ట కష్టాలను ప్రధానాంశాలుగా ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' విస్తృతంగా ప్రచారం చేయాలి. మాజీ ఎన్నికల కమిషనర్ టి.ఎన్. శేషన్ చెప్పినట్లుగా దశ మహాపాతకాలు దేశ ఎన్నికల వ్యవస్థను కరకర నమిలేస్తున్నాయి. భారతదేశంలో ఎన్నికలు కొత్త కాదు. ప్రజలు చైతన్యవంతులు, ఆలోచనాపరులు. అయితే, యువతకు ఉద్యోగ వసతి కల్పిస్తారనీ, ఆర్థిక అభివృద్ధి చేస్తారనీ ఎక్కువమంది మోదీకి ఓట్లు వేశారు. కానీ పేద ప్రజలకు భరోసాని ఇచ్చే 'జాతీయ గ్రామీణ ఉపాధి హామి' పథకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం నీరుగార్చింది.

స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించడమనేది కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధ విధి. ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడం వల్ల కొంత మేలు ఉన్నప్పటికీ, లోపాలు కూడా లేక పోలేదు. సున్నితమైన నియోజకవర్గాల్లో, ఎన్నికల సంబంధ హింసాకాండ చోటు చేసుకొనే అవకాశమున్న పోలింగ్ కేంద్రాల్లో తగిన సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించడానికి విడతలవారీ ఎన్నికల నిర్వహణ దోహదపడుతుంది. 85 ఏళ్ళ వయస్సు పై బడిన వారందరూ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 85 వయస్సు పైబడిన ఓటర్లు దేశ వ్యాప్తంగా 82 లక్షల మంది ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఇందులో వందేళ్ళు దాటిన ఓటర్లు 2 లక్షల 18 వేల మంది వున్నారు.

భారతదేశ రాజకీయాల్లో ఈనాడు అనివార్యంగా ఓబీసీలకు సీట్లు పెంచవలసిన చారిత్రక అవసరం ముందుకు వచ్చింది.

బీసీలు వృత్తికారులే కాక, శ్రామికశక్తులు! చాలామంది బీసీలు తమ విముక్తిదాతైన పూలే గూర్చి తెలుసుకోలేకపోతున్నారు. మహాత్మా పూలే ఓబీసీలకు అర్థమైనపుడే వారిలో సామాజిక, రాజకీయ చైతన్యం వస్తుంది. స్త్రీలకు కూడా మునిపటి కంటే ఎక్కువ సీట్లు ఇస్తారు. విద్యాధికులు, రిటైర్డ్ ఆఫీసర్లు, అడ్వకేట్లు, పాత్రికేయ ప్రముఖులు, రిటైర్డ్ జడ్జిలు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు కూడా ఇప్పుడు రాజకీయ రంగంలోకి దూకారు. ఆంధ్రప్రదేశ్‌లోకి బీజేపీని ఆహ్వానించడం వల్ల చంద్రబాబు ముస్లింల, క్రైస్తవుల, సోషలిస్టుల, కమ్యూనిస్టుల ఓట్లు కోల్పోతున్నారు. రాజ్యాంగేతరమైన భావజాలం ఎన్నికలలో పెరగడం ఆశ్చర్యకరం. అయితే భారతదేశంలో ఇవన్నీ అనేక సందర్భాలలో జరుగుతూ వచ్చాయి. వాటన్నింటినీ భారతదేశం తట్టుకొని నిలబడుతూ వచ్చింది. బీజేపీ తన వ్యూహ ప్రతి వ్యూహ రచనల్లో ప్రధానంగా పార్టీలను చీల్చడం, లొంగదీసుకోవటం వంటి అనేక వ్యూహాలతో ముందుకువెళ్తోంది. కానీ భారత రాజ్యాంగాన్ని దాటి వెళ్లే శక్తి ఏ వ్యక్తికీ, ఏ పార్టీకీ లేదని మనం తప్పక నమ్మాలి. దాని అంతర్గత శక్తి బౌద్ధ సూత్రాలతో నిండి ఉంది. అందుకే 2024 ఎన్నికలకు దళిత బహుజన లౌకికవాద భావజాలంతో ముందుకు నడవాల్సిన చారిత్రక సందర్భం ఇది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు ၊ 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోవాలి!



లద్దాఖ్‌ను కాపాడండి అని పిలుపు నిస్తూ సోనమ్ వాంగ్‌చుక్ 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రభుత్వం కచ్చితంగా చర్చలు ప్రారంభించాలి. పట్టించుకోకుండా ఉండకూడదు.

- శివ్ అరూర్, జర్నలిస్ట్

దారుణ వారం



కశ్మీర్‌కు ఈ వారం ప్రత్యేకమైనది. 1997 మార్చ్ 21న సంగ్రామ్‌పోరా నరమేధంలో ఏడుగురు పండిట్లను కాల్చి చంపారు. 2000 మార్చ్ 20న చిత్తిసింఘ్‌పుర నరమేధంలో 36 మంది సిక్కులను కాల్చిచంపారు. 2003 మార్చ్ 23న నంది మార్గ్ నరమేధంలో 24 మంది పండిట్లను కాల్చి చంపారు. 1990 మార్చ్ 23న చడూరా ఎమ్మెల్యే మీర్ ముస్తఫానూ, కవి నాయకుడు అబ్దుల్ సత్తార్ రంజూర్‌ను కాల్చి చంపారు. వాళ్లందరి ఆత్మలకు శాంతి కలగాలి!

- అహ్మద్ అలీ ఫయాజ్, జర్నలిస్ట్

కడుపులోకి రంగులా?



ఒక్క రోజు జరుపుకొనే హోలీలోనే చర్మం పాడు కాకుండా జనాలు హెర్బల్ రంగులు కొంటారు. కానీ 365 రోజులు కడుపులోకి వెళ్లే రంగుల గురించి ఆలోచించరా? దారుణ ప్రభావాన్ని కలిగించే కొన్ని ఫుడ్ కలర్స్‌ను ప్రపంచంలో కొన్నిచోట్ల నిషేధించారు. ఇండియాలో మాత్రం వాటిని అనుమతిస్తున్నారు.

- రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

తిరుగుబాటు హోలీ



రెండు సంస్కృతుల మేళనంలోని అందం. బలూచిస్తాన్ (పాకిస్తాన్)లో బలూచీ నృత్యం 'దోచపీ' చేస్తూ హోలీ జరుపు కొన్నారు (వీడియో షేర్ చేశారు). 'నేను రెబెల్‌ను, నేను బలూచీ ఫ్రీడమ్ ఫైటర్‌ను' అని పాట! హిందూ అన్నాచెల్లెళ్లకు హోలీ శుభాకాంక్షలు.

- ఫాజిలా బలూచ్, యాక్టివిస్ట్

మళ్లీ బలపడేనా?



పశ్చిమాసియా గందరగోళంగా ఉంది. చాలామంది ఐసిస్ జిహాదీలు అఫ్గానిస్తాన్‌కు తరలారు. తాలిబన్ పష్తూన్ ప్రభుత్వం మీద తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లోని నిర్దిష్ట జాతులు కోపంగా ఉన్నాయని కథనాలు! ఆఫ్రికాలో కొన్ని భాగాలు 'స్టేట్‌లెస్'గా ఉన్నాయి. ఐసిస్ పునరుద్ధరణ అవకాశాలు కనబడుతున్నాయి.

- స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

చట్టసభల వైఫల్యం కొనసాగుతోంది

కమ్యూనిస్టు విప్లవ యోధుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన శాసనసభ సభ్యత్వానికి 1969 మార్చి నెలలో రాజీనామా చేస్తూ సంచలనాత్మకమైన ఉపన్యాసాన్ని అసెంబ్లీలో ఇచ్చారు. ఆయన ఉపన్యాసం ఇచ్చి ఇప్పటికి 55 ఏళ్లు పూర్తయినాయి. ఆయన ఆనాడు ఉపన్యాసంలో చెప్పిన విషయాలన్నీ నేటికీ అక్షర సత్యాలే.

దళారీ పాలక వర్గాలు దేశాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతున్నారని చెప్తూ కామ్రేడ్ నాగిరెడ్డి గణాంకాలతో వివరించారు. దేశంలో పెరిగి పోతున్న విదేశీ అప్పుల గురించి క్లుప్తీకరించారు. ఈ సందర్భంగా, దేశాభివృద్ధికంటే రక్షణ చర్యలకే ప్రాధాన్యతనిస్తూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని నివారించే చర్యలను అసెంబ్లీ, పార్లమెంటులు చేపట్టకుండా ఈ సంక్షోభ తీవ్రతను మరింతగా పెంచే విధానాలను అవలంబిస్తున్నాయని ఆయన అన్నారు. పంచవర్ష ప్రణాళికలు సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నాయనీ, దేశ సంపద విదేశాలకు తరలి పోతున్నదనీ నాగిరెడ్డి వివరించారు. దేశంలోని పాలక వర్గాల వారు భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను అనుసరిస్తున్నారని ఉదాహరణలతో వివరించారు. ప్రజల్ని విప్లవ కార్యాచరణకు కదిలించడమే నేటి తక్షణ కర్తవ్యమనీ, ప్రజలు కదిలితే తప్ప ఈ దోపిడీలు, అన్యాయాలు అరికట్టబడవని తేల్చి చెబుతూ తన ఉద్వేగభరితమైన ఉపన్యాసాన్ని ముగించారు.



తరిమెల నాగిరెడ్డి

తరిమెల నాగిరెడ్డి ఈ విషయాలు చెప్పి నేటికి ఐదున్నర దశాబ్దాలు పూర్తవుతున్నా నేడు దేశంలో భూస్వాముల, సామ్రాజ్య వాదుల, స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడీలు స్వైర విహారం చేస్తున్నాయి. విదేశీ రుణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలను పాలకులు పరిష్కరించటంలో పూర్తిగా వైఫల్యం చెందారు. దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభం తీవ్ర రూపం దాలుస్తున్నప్పటికీ ఈ సంక్షోభాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా పాలకులు రక్షణ చర్యలకే అత్యధిక ప్రాధాన్యత నిచ్చే విధానాలను అనుసరిస్తున్నారు. ప్రజాస్వామ్యం పేరుతో జరుగుతున్న ఎన్నికలు డబ్బు సంచుల మధ్య పోటీగా తయారై ఒక ప్రహసనంగా మారాయి. పార్లమెంటు, అసెంబ్లీలు ప్రజా సమస్యలను పరిష్కరించటంలో విఫలం చెందుతూనే ఉన్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 55 ఏళ్ళ క్రితం చెప్పిన విషయాలన్నీ నేటికీ అక్షర సత్యాలే. ప్రజల్ని విప్లవ కార్యాచరణకు కదిలించటమే నేటి తక్షణ కర్తవ్యమని ఆయన చెప్పిన మాట నేటికీ వర్తిస్తుంది.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎం-ఎల్)

ఇదెక్కడి మేధావితనం?

అభిప్రాయం



పి. విజయబాబు

గతంలో కమ్యూనిస్టులు బలంగా ఉన్న రోజుల్లో, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి!' అనే నినాదం గోడల మీద విస్తృతంగా దర్శనం ఇచ్చేది. ఆ నినాదం నిజమైందో లేదో తెలియదు కానీ, ఇప్పుడు అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి చంద్రబాబు నాయుడిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రపంచంలో ఉన్న ఒక వర్గం 'మేధావులంతా ఏకం కండి!' అనే నినాదాన్ని అందిపుచ్చుకొని వాళ్లంతా ఏకమవుతూ తమ సర్వశక్తుల్నీ ఒడ్డుతున్నారు. ఆ క్రమంలోనే తాజాగా లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అలియాస్ జేపీ హైదరాబాదు నుంచి విజయవాడ విచ్చేసి, ప్రెస్‌మీట్ పెట్టి తన మద్దతు ఎన్డీయే కూటమికే అంటూ దానికి బహు నిర్వచనాలు ప్రవచించారు. అంతటితో ఆగకుండా 'గాంధీ మహాత్ముడు, అంబేడ్కర్‌లకు కులం అంటగడతామా?' అంటూ పరోక్షంగా తను కూడా అంతటి మహాత్ముడినే అని ప్రకటించుకున్నారు. అక్కడే చంద్రబాబుతో అంటకాగడంలో అపరాధ భావం ప్రస్ఫుటమవుతోంది. ఇంకా త్రిపురనేని రామస్వామి చౌదరి, గిడుగు రామ్మూర్తి పంతులు పేర్లు కూడా ఉటంకించారు. అసలు ఆయన మాట్లాడేదానికీ, ప్రస్తుత రాజకీయాలకూ; నాటి సంఘ సంస్కర్తలూ, భాషా వేత్తలైన త్రిపురనేని, గిడుగులకు సంబంధం ఏంటో బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

ఈ జేపీ లోక్‌సత్తా పార్టీని ఎప్పుడో చుట్ట చుట్టేశారు. లోక్ సత్తా ఇకపై రాజకీయ పార్టీ కాదని ప్రకటించేశారు కూడా! అయితే, చంద్రబాబు కోసం అర్జెంటుగా మళ్లీ పార్టీని వెలుగులోకి తెచ్చారు కాబోలు!

నిజానికి ఈ పార్టీ పుట్టుక పరిశీలిస్తే, ఒక దశలో చంద్రబాబు నాయుడుతో రామోజీరావుకి తేడాలు వచ్చి, ''నేను కింగ్ మేకర్‌ని. ఎన్టీఆర్ నుంచి పీఠాన్ని అప్పజెప్పింది నేను. అటువంటిది నాకే 'మింగుడు పడకపోతే' ఎలా? మీలాంటి వాడిని జాతీయ స్థాయిలో మరొకడిని తయారుచేస్తా!'' అని ఈ జేపీని తెర మీదకు లోక్‌సత్తా పేరుతో తీసుకురావడంలో రామోజీరావు కీలక పాత్ర వహించారని అంటారు పరిశీలకులు. అందుకే కాబోలు! అప్పట్లో 'ఈనాడు'లో జేపీ వార్తలు పుంఖానుపుంఖాలుగా వచ్చేవి.



ఆ పబ్లిసిటీ ప్రభావంతో విద్యావంతులు చాలా మంది లోక్‌సత్తా పట్ల ఆకర్షితులయ్యారు. అయితే జేపీ 'హై వోల్టేజ్ యారొగెన్సీ'కి షాక్ అయి స్వల్పకాలంలోనే జారుకున్నారు. జేపీని ఒకసారి గెలిపించిన హైదరాబాద్ కుకట్‌పల్లి ప్రజలు కూడా అతడి మేధా అహంకారానికి బెదిరిపోయారు. కాగా, మల్కాజ్‌గిరిలో మైండ్ బ్లాక్ అయ్యే జవాబు ఇచ్చారు జనం. దాంతో రాజకీయాలకు దూరంగా తన మేధాతనాన్ని అప్పుడప్పుడు మాత్రమే ప్రదర్శిస్తూ రోజులు గడుపుతున్నారు జేపీ. ఎంతైనా పబ్లిసిటీకి అలవాటైన ప్రాణం కదా! పైగా తను పెద్ద లౌకికవాదినని కూడా చాటుకోవాలయ్యె! అందుకే, చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు, ఒకసారి పవన్ కల్యాణ్‌తో కలిసి 'ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ' అంటూ నాలుగు రోజులు హడావిడి చేసి మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఆ మధ్య జగన్ ప్రభుత్వంలో పథకాలను ప్రశంసించారు. ఇప్పుడు మళ్లీ 'ప్రపంచ మేధావులారా ఏకం కండి!' అన్న నినాదాన్ని అందిపుచ్చుకొని చంద్రబాబుకు మద్దతుగా ప్రకటన చేశారు. ఈ క్రమంలోనే, గాంధీ, అంబేడ్కర్, వైశ్య కులం, దళిత కులం; త్రిపురనేని రామస్వామి చౌదరి, గిడుగు రామ్మూర్తి అంటూ మోకాలికీ బోడి గుండుకీ ముడిపెడుతూ తన మేధాతనాన్ని ప్రదర్శించడానికి చాలా ప్రయాసపడ్డారు.

ప్రకటన వికటించింది. చంద్రబాబుకి వర్గ పరంగా బహిరంగ మద్దతు ఇస్తున్నాను అని ఆయన ప్రకటిస్తే ఎవరికీ పెద్ద అభ్యంతరం ఉండేది కాదు. కానీ ఏదేదో మాట్లాడేసేసి, ఆంధ్ర ప్రదేశ్‌లో ఏదో అరాచకం జరిగి పోతుందని తన భాషా ప్రావీణ్యమంతా ప్రదర్శించే సరికి, ఆయన మీద విమర్శల జడి మొదలైంది.

పాపం జేపీని చూసినప్పుడల్లా విదురుడు చెప్పిన పద్యం ఒకటి గుర్తుకు వస్తుంది. **''ధనమును, విద్యయు, వంశంబును, దుర్మతులకు మదంబు ఒనరించును / సజ్జనులైన వారికి అణకువయును, వినయము ఇవియే తెచ్చును ఉర్వీ నాథా!''** అంటాడు. ధనం, విద్య, ఉత్తమ కులంలో పుట్టాననే భావన దుష్టులకు మదాన్నీ, అహంకారాన్నీ కలిగిస్తాయి. ఇవే శిష్టులకు అణకువ, వినయం కలిగిస్తాయి అని విదురుడు ధృతరాష్ట్రుడికి బోధిస్తాడు. ఈ పద్యం చదివితే జేపీ ఏ బాపతు మేధావో చెప్పనవసరం లేదనుకుంటాను. జనానికి ఏమి కావాలో అది చెప్పాలి. లేదంటే నేల విడిచి సాము చేసినట్టు ఉంటుంది. జనం ఏమైనా 'జేపీలా'?

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

నమ్మకం ముఖ్యం

ఓ ఆశ్రమంలో విద్య నభ్యసిస్తున్న పిల్లల్లో ఒకరికి గురువుగారి పట్ల బొత్తిగా నమ్మకం లేకుండా పోయింది. దీంతో అతడు చదువులో వెనకబడిపోయాడు. ఈ విషయాన్ని గురువుగారు గ్రహించి అదను కోసం వేచి చూస్తున్నారు. ఒకరోజు గురువుగారు శిష్యులందరితో కలసి అడవిలో ప్రయాణిస్తుండగా... ఒక తండ్రి తన ముగ్గురు పిల్లలతో వెళ్తుండడాన్ని చూశారు. చిన్నవాడిని తండ్రి తన భుజం మీద కూర్చోపెట్టుకోగా, రెండోవాడు తండ్రి చేయి పట్టుకుని నడుస్తున్నాడు. వారి వెనుక పెద్ద పిల్లాడు నడుస్తున్నాడు.



జ్యోతిర్మయం

గురువుగారు తమ శిష్యులను ఆ తండ్రీ-పిల్లలను గమనించి వారేమి గ్రహించారో చెప్పమన్నారు. తండ్రి భుజాల మీద కూర్చున్న చిన్నపిల్లాడు పువ్వులు, పక్షులను చూస్తూ ఆనందంగా ఆస్వాదిస్తున్నాడు. తండ్రి చేయి పట్టుకుని నడుస్తున్న రెండో పిల్లాడు దారిలో కనిపించినవన్నీ చూస్తున్నాడు తప్ప అతనిలో పెద్దగా స్పందన లేదు. ఇక వారి వెనుక నడుస్తున్న పెద్ద పిల్లాడు వేటినీ చూసి ఆస్వాదించడం లేదు. అతడి కళ్లలో ఏదో భయం కూడా కనిపిస్తోంది.

అయితే అందరూ చెప్పిన జవాబేమిటంటే తండ్రి భుజం మీదున్న చిన్న పిల్లాడిలా సంతోషంగా ఉండాలని. ఎవరిలా ఉండకూడదు అనడానికి తండ్రి వెనుక మెల్లగా నడుస్తూ భయపడుతున్న వాడిని పేర్కొన్నారు.

శిష్యుల మాటలన్నీ విన్న గురువుగారు, 'ఎవరైతే దేవుని మీద పూర్తి నమ్మకం ఉంచి భారం వేస్తారో వారికే కైవల్యం ప్రాప్తిస్తుంది. అలాగే శిష్యులనేవారు తమ గురువుగారి బోధనలపై పూర్తి విశ్వాసం ఉంచినప్పుడే వారు చదువులోనూ, ఆ తర్వాత జీవితంలోనూ పైకి వచ్చి తండ్రి భుజంపై ఉన్న చిన్న పిల్లవాడిలా ఆనందంగా ఉంటారు. గురువుగారి పట్ల నమ్మకం లేనివారు తండ్రి వెనుక భయం భయంగా నడుస్తున్న పెద్దపిల్లాడిలా ఉంటార'ని అన్నారు.

దీంతో గురువుగారి పట్ల విశ్వాసం లేని శిష్యుడికి జ్ఞానోదయం అయ్యింది. ఆ క్షణమే అతను తనను క్షమించమని గురుదేవుని పాదాలకు నమస్కరించాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.33 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** హస్త ప.12.28 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.9.13 నుండి 10.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.27 నుండి 9.15 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.03, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

టీడీపీ నేత లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలి

- సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాకు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: అడుగడుగునా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో టీడీపీ రంగు, గుర్తు, లోకేశ్ ఫొటోలతో ఉన్న తోపుడు బండ్లను ఎన్నికల నిబంధనలను అతిక్రమించి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్న పోలీసులను లోకేశ్ బెదిరిస్తున్నారని.. వారిని భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. తమ ఫిర్యాదులను పరిశీలించి వెంటనే లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనాను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.నారాయణమూర్తి, నాయకులు కొమ్మసాని శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీజేపీ పోటీ చేస్తున్న ఆరు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన అనంతరం మంగళవారం బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరుగనుంది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, ఢిల్లీలో జాతీయ పార్టీ కార్యాలయ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న అరుణ్‌సింగ్, ఏపీ ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. రాష్ట్ర పదాధికారులు, లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జులు, పోటీ చేస్తున్న అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొననున్నట్లు పార్టీ మీడియా విభాగం ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో మందకృష్ణ మాదిగ మర్యాద పూర్వకంగా కలిశారు.

బీజేపీలో టీడీపీ బద్వేలు ఇన్‌చార్జి బొజ్జ చేరిక

కడప (కోటిరెడ్డి సర్కిల్): వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోషన్న సోమవారం బీజేపీలో చేరారు. బీజేపీ కార్యాలయంలో ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొజ్జ రోషన్న మాట్లాడుతూ నరేంద్రమోదీ సారథ్యంలో పనిచేయాలని బీజేపీలో చేరానన్నారు.

బీఎస్పీ రెండో జాబితా విడుదల

తిరుపతి కల్చరల్: రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను బహుజన సమాజ్ పార్టీ సోమవారం ప్రకటించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో 55 మంది అభ్యర్థులతో కూడిన జాబితా విడుదల చేశారు. వీరిలో 50 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, ఐదుగురు ఎంపీ అభ్యర్థులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనుల సామాజిక సాధికారతే లక్ష్యంగా రానున్న ఎన్నికల్లో బీఎస్పీ రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాల్లో పోటీకి సిద్ధమైనట్లు తెలిపారు. ఇప్పటికే తమ పార్టీ 50 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సన్నాహక సభలు నిర్వహించి బహుజనులను చైతన్యం చేసే దిశగా ముందుకు వెళుతామన్నారు.

తెలంగాణ

బీజాపూర్ జిల్లాలో దారుణం

- పట్టపగలే ముగ్గురిని నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సోమవారం దారుణం చోటుచేసుకుంది. మావోయిస్టులుగా భావిస్తున్నవారు ముగ్గురిపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బాసగూడలో హోలీ వేడుకలు జరుపుకున్న యువకులు సమీపంలోని నదిలో స్నానానికి వెళ్లారు. ఈ సమయంలో సాధారణ దుస్తుల్లో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు.. మిడియం చంద్రయ్య, బండారి అశోక్, కారం రమేశ్‌పై కత్తులు, గొడ్డళ్లతో దాడికి దిగారు. దాడిలో చంద్రయ్య, అశోక్ తీవ్రంగా గాయపడి ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న రమేశ్‌ను బాసగూడలో ప్రథమ చికిత్స అనంతరం బీజాపూర్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం సభ్యులే ఘటనకు పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.



మాల, మాదిగల మధ్య చిచ్చుకు చంద్రబాబు కుట్రలు

- ఎన్నికలు వచ్చాయంటే మంద కృష్ణకు పండగే!
- మంద కృష్ణపై దళితుల మండిపాటు

అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టే యత్నం



సాక్షి, అమరావతి/భీమవరం/తాడేపల్లిరూరల్/నెహ్రూనగర్/కడప కార్పొరేషన్: ఎన్నికలు వచ్చాయంటే చాలు అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేలా చంద్రబాబు కుట్రలు చేస్తారని మాల మహానాడు(పీవీ రావు) జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు మండిపడ్డారు. ఇద్దరి మధ్య చిచ్చు పెట్టేందుకు మంద కృష్ణ మాదిగతో వివాదాస్పద వ్యాఖ్యలు చేయిస్తారని తెలిపారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవాన్ని కొన్నేళ్లపాటు మంద కృష్ణ చంద్రబాబు పాదాల వద్ద పెట్టారని చెప్పారు. మళ్లీ ఈ మధ్య ప్రధాని మోదీ పాదాల చెంతపెట్టారని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చాయంటే మంద కృష్ణ మాదిగకు పండుగేనని, చంద్రబాబు రాజకీయాల్లో ప్యాకేజీ అనేది మొదట మంద కృష్ణతోనే ప్రారంభించారని తెలిపారు. ఏపీ రాజకీయాలతో మంద కృష్ణకు ఏం పనని, ఇన్నేళ్లపాటు ఎమ్మార్పీఎస్ పేరుతో మంద కృష్ణ వెలగబెట్టిన రాజకీయాలు తెలియని వారు ఎవరూ లేరన్నారు. 30న మంద కృష్ణమాదిగ నిర్వహించాలని చూస్తోంది.. మాదిగల సదస్సు కాదనీ, అది టీడీపీ మాయ సభ అని చెప్పారు.

'దళితులను హేళనచేసిన బాబుకు మద్దతా'



దళితులకు చంద్రబాబు బద్ధ శత్రువని, మంద కృష్ణమాదిగకు డబ్బులిచ్చి మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు దుయ్యబట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మీడియాతో మాట్లాడారు. మంద కృష్ణమాదిగ పెద్ద మొత్తంలో ప్యాకేజీ తీసుకుని మాదిగ సోదరులను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి తాకట్టుపెడుతున్నారని మండిపడ్డారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారంటూ దళితులను హేళన చేసిన చంద్రబాబుకు మద్దతివ్వడం దారుణమన్నారు. మాదిగ సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యం ఇచ్చి నందిగం సురేష్‌కు బాపట్ల ఎంపీగా సీటు ఇవ్వడంతో పాటు హోం మంత్రిగా తానేటి వనిత, మున్సిపల్ శాఖ మంత్రిగా ఆదిమూలం సురేష్‌లకు ఉన్నత పదవులు కట్టబెట్టారని గుర్తుచేశారు. తెలంగాణకు చెందిన మంద కృష్ణకు ఏపీతో సంబంధమేంటని ప్రశ్నించారు.

'సదస్సును అడ్డుకుని తీరతాం'



మంద కృష్ణ ఈ నెల 30న నిర్వహించే సదస్సును అడ్డుకుని తీరతామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు హెచ్చరించారు. అసలు ఏపీలో మాదిగ సదస్సు పెట్టడానికి నీకు ఏ అర్హత ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ కృష్ణమాదిగ నిర్వహించాలనుకున్నది మాదిగల సభ కాదని టీడీపీ ప్రాయోజిత సదస్సుగా అభివర్ణించారు. మాదిగలను ప్రతిసారీ నమ్మించి చంద్రబాబుకు తెగనమ్మడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు.

'మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్న మందకృష్ణ'



మంద కృష్ణమాదిగ మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నాడని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరు కనకారావు అన్నారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. కృష్ణమాదిగ తన వ్యక్తిగత స్వార్థం కోసం మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెట్టాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్.. 2019 ఎన్నికల్లో ఎంపీ సీటును నందిగం సురేష్‌కు కేటాయిస్తే కనీసం మద్దతు కూడా ఇవ్వలేదని, ఓ మాదిగను పార్లమెంట్‌కు పంపిస్తుంటే మద్దతివ్వలేదంటే మంద కృష్ణ స్వార్థాన్ని అర్థం చేసుకోవచ్చని అన్నారు. చంద్రబాబు తప్ప మందకృష్ణ మాదిగను ఏ రాజకీయ పార్టీ నమ్మదన్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న మంద కృష్ణమాదిగ 10 అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని చంద్రబాబును ఎందుకు కోరలేదని ప్రశ్నించారు. సీట్ల కోసం కాకుండా కాసుల కోసమే వర్గీకరణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని తన ప్రయోజనాలు కాపాడుకుంటున్నారని మండిపడ్డారు. వర్గీకరణ అంశం కేంద్రం చేతిలో ఉందని, కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుకు మద్దతు ఇచ్చారని, ఎన్నికల అనంతరం మాదిగలను పోలీసులతో కొట్టించిన ఘనత చంద్రబాబుదని అలాంటి వ్యక్తికి మందకృష్ణ మాదిగలను తాకట్టు పెట్టడం దారుణమన్నారు. సీఎం వైఎస్ జగన్ వచ్చాకే మాదిగల జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు.

'మాదిగలంతా సీఎం జగన్ వెంటే'



రాష్ట్రంలో మాదిగలంతా జగనన్నకు తోడుగా, నీడగా ఉంటారని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి గరుడాద్రి అన్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మాదిగలు, మాదిగ ఉప కులాలను గంపగుత్తగా ఒక పార్టీకి తాకట్టు పెట్టే అధికారం మంద కృష్ణకు ఎక్కడిదని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటు వేయాలని చెప్పడానికి ఆయనెవరని నిలదీశారు. మంద కృష్ణమాదిగకు మాదిగ జాతి ఇంకా గులాంగిరి చేసేందుకు సిద్ధంగా లేదన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం దళితులకు, అణగారిన ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటోందని, మాదిగలు ఈ విషయాలన్ని గుర్తించి సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

కనీసం బడిలోకి కూడా రానీయకుండా దళితులను దశాబ్దాల తరబడి చదువులకు దూరం చేశారో.. అలాంటి విద్యాశాఖకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆదిమూలపు సురేష్‌ను మంత్రిగా చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రత్యేక శ్మశాన వాటికలు ఏర్పాటు చేయడం ద్వారా తరతరాల దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడారని, సంక్షేమ పథకాలతో వారి బతుకుల్లో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌ను అణగారిన వర్గాల ఆత్మ బంధువుగా అభివర్ణించారు.

చంద్రబాబు చేసిన అవమానాలు గుర్తులేవా?

మంద కృష్ణ మాదిగపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజం

తెనాలి/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/అవనిగడ్డ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ప్రకటించటం వెనుక స్వార్థ రాజకీయం ఉందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతలు ధ్వజమెత్తారు. మంద కృష్ణ మళ్లీ చంద్రబాబు మాయలో పడ్డారని, ఇలాంటి అవకాశవాదులకు ఆశాభంగం తప్పదని లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ హెచ్చరించారు. గుంటూరు జిల్లా తెనాలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసలు ఎస్సీల వర్గీకరణ సమస్య పరిష్కారం కాకపోవటానికి చంద్రబాబును నమ్మి మంద కృష్ణ తీసుకుంటున్న నిర్ణయాలే కారణమన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపునకు



మంద కృష్ణ కృషిచేశారని అయితే.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించిన మంద కృష్ణను ఎలా అవమానించారో మాదిగ ప్రజానీకం మరచిపోలేదన్నారు. చంద్రబాబు నైజాన్ని ఎండగడుతూ రాష్ట్రంలో పర్యటించిన మంద కృష్ణను అడ్డుకుని, అరెస్టులు చేయించారని గుర్తుచేశారు. కురుక్షేత్ర సభకు అనుమతి ఇవ్వకుండా, నారావారిపల్లె నుంచి తలపెట్టిన ర్యాలీని అడ్డుకుని, సభకు వచ్చినవారిపై అక్రమ కేసులు పెట్టించినట్టు తెలిపారు. మంద కృష్ణను ఒక ఉగ్రవాదిగా, సంఘ విద్రోహశక్తిగా భావించి ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఆకాంక్షను ఉక్కుపాదంతో ఆనాడు చంద్రబాబు అణచివేశారని చెప్పారు. ఇవన్నీ మంద కృష్ణకు గుర్తులేకపోవటం సిగ్గుచేటన్నారు. మాదిగల్ని ఇంతగా అవమానించి, వర్గీకరణ పేరుతో మోసం చేస్తున్న చంద్రబాబుకు మంద కృష్ణ మళ్లీ మద్దతు పలకటం దారుణమన్నారు. ఇక అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న బీజేపీ నేటికీ చేయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాదిగలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కులమతాలకు అతీతంగా పేదలంతా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

చంద్రబాబుకు మద్దతు సిగ్గుచేటు



స్వప్రయోజనాల కోసం మాదిగలను చంద్రబాబుకి మందకృష్ణ మాదిగ తాకట్టు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఓబులేసు మండిపడ్డారు. ఎవ్వరైనా దళితుల్లో పుట్టాలని అనుకుంటారా అన్న చంద్రబాబుకు మందకృష్ణ మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్‌ను ఎందుకు గెలిపించాలో దళితులకు వివరించేందుకు శ్రీకాకుళం నుంచి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. దళితుల ప్రయోజనాల కోసం కూటమికి మద్దతు ఇచ్చానని చెబుతున్న మందకృష్ణ.. గతంలో కూడా ఇలాగే మద్దతు ఇచ్చినప్పటికీ వర్గీకరణ ప్రక్రియ ఎందుకు జరగలేదో చెప్పాలని ప్రశ్నించారు.

చంద్రబాబు మోసగాడని చెప్పావుకదా!



మాదిగ ద్రోహి చంద్రబాబుకి ఎలా మద్దతు ఇస్తావని ఓ ప్రకటనలో మంద కృష్ణమాదిగను వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేశ్ ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబుకి మద్దతు ఇచ్చిన మంద కృష్ణ.. ఆ తరువాత చంద్రబాబు పెద్ద మోసగాడని చెప్పారని, 2019 ఎన్నికల్లో యూటర్న్ తీసుకుని నోటాకి ఓటేయాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. మంద కృష్ణ స్వార్థ ప్రయోజనాల కోసం తీసుకునే నిర్ణయాల వల్ల మాదిగలు రాజకీయ సమాధి అవుతున్నారని చెప్పారు. ఏనాడూ ఎన్నికల్లో పోటీచేయని మంద కృష్ణ ఎన్నికలు వచ్చినపుడల్లా ప్యాకేజీ తీసుకుని రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని రమేశ్ మండిపడ్డారు. ప్యాకేజీ కోసం దళిత ద్రోహి చంద్రబాబు, మతతత్వపార్టీ బీజేపీ, జనసేన కూటమికి మద్దతు ప్రకటించిన మంద కృష్ణ ట్రాప్‌లో మాదిగలు పడొద్దని హితవు పలికారు.

వైఎస్సార్‌సీపీ వాళ్ల మక్కెలు విరగ్గొట్టిస్తా

- కుప్పం పర్యటనలో చంద్రబాబు వ్యాఖ్యలు
- ఏఐతో నా మేధోశక్తి పెంచుకుంటా
- కుప్పాన్ని ప్రపంచంతో అనుసంధానిస్తా
- నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలను చేస్తా


జనం లేక వెలవెలబోయిన బాబు బహిరంగ సభ

సాక్షి, తిరుపతి/కుప్పం(చిత్తూరు జిల్లా): కుప్పంలో వైఎస్సార్‌సీపీ వారి మక్కెలు విరగొట్టి కక్ష తీర్చుకుంటానని నారా చంద్రబాబునాయుడు హెచ్చరించారు. భయపడి ఇంట్లో పడుకోకండి పోలీసులు కూడా ఏమి చేయలేరంటూ ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా తిరిగి చెల్లించే బాధ్యత తీసుకుంటా అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం సోమవారం కుప్పానికి వచ్చిన చంద్రబాబు ముందుగా మహిళలతో సమావేశమయ్యారు. అనంతరం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ ఐదేళ్ల కాలంలో హింసా రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. తన మేధోశక్తిని పెంచుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వాడతానన్నారు. కుప్పాన్ని ప్రపంచంతో అనుసంధానం చేస్తానని చెప్పారు. నిరుద్యోగులను పారిశ్రామిక వేత్తలను చేస్తానని హామీల వర్షం కురిపించారు. కుప్పాన్ని తాను అభివృద్ధి చేస్తానంటే నమ్ముతారా? లేదా? అంటూ సభికులను ప్రశ్నించారు.

కేంద్ర సహకారం కోసమే పొత్తులు

కేంద్రం సహకారం అవసరమనే పొత్తులు పెట్టుకున్నామని చంద్రబాబు చెప్పారు. అధికారంలోకి వస్తే పింఛను రూ. 4 వేలు చేసి ఇంటికే వచ్చి ఇచ్చేలా చూస్తానన్నారు. పంచాయతీలకు నిధులిచ్చే విషయంలో 'భరత్ అనే నేను' సినిమా డైలాగ్‌ను చదివి వినిపించారు. కుప్పానికి నీళ్లు తీసుకువచ్చే బాధ్యత తనదేనన్నారు. తనను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడలపై పలు ఆరోపణలు చేశారు.

జనంలేక సభ వెలవెల

కుప్పంలో చంద్రబాబు నిర్వహించిన సభ జనం లేక వెలవెలబోయింది. నాలుగు మండలాల నుంచి జనసమీకరణ చేపట్టినా, ఒక్కో మహిళకు రూ.300, పురుషుడికి రూ.500 చొప్పున ఇచ్చినా ఎవరూ సభకు రావడానికి ఇష్టపడలేదు. ఇరుకుప్రాంతంలో సభ పెట్టి జనం ఎక్కువ వచ్చారని చూపడానికి వేసిన వ్యూహం బెడిసికొట్టింది. చంద్రబాబు ప్రసంగం, హామీలు ప్రజలను ఏమాత్రం ఆకట్టుకోలేదు. కుప్పంను ఆదర్శంగా మారుస్తా, పారిశ్రామిక వాడ నిర్మిస్తా, పంటలు ఎగుమతికి ఎయిర్ పోర్టు నిర్మిస్తా.. వంటి హామీలు వినీ వినీ విసిగిపోయామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలపై తిరగబడాలని, తొక్కుకుంటూ పోవాలంటూ ఎంత రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా జనం ఆసక్తి చూపలేదు. చంద్రబాబు ప్రసంగిస్తుండగానే జనం తిరుగుముఖం పట్టారు. ప్రసంగం ముగిసేసరికి సభ మొత్తం ఖాళీ అయిపోయింది. సభకు వచ్చి తిరిగి మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న రామకుప్పం మండలం, ఆనిగానూరుకు చెందిన నాగభూషణం, చంద్రప్పలను కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు.

వలంటీర్లు జిహాదీ టెర్రరిస్టులు

టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

- వలంటీర్లను స్లీపర్ సెల్స్‌లా సీఎం జగన్ తయారు చేశారు
- సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలపై వలంటీర్ల మండిపాటు


శ్రీకాళహస్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వలంటీర్ల నిరసన

శ్రీకాళహస్తి: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లపై శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారు. కరోనా వంటి విపత్కర సమయంలో ధైర్యంగా సేవలు అందించారన్న విషయం కూడా మర్చిపోయి వారిని జిహాదీ తీవ్రవాదులు, టెర్రరిస్టులతో పోల్చారు. ఓ మీడియా ఇంటర్వ్యూలో సుధీర్‌రెడ్డి సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. వలంటీర్లు జిహాదీ తీవ్రవాదులు, బాంబులు పెట్టే టెర్రరిస్టులు, స్లీపర్ సెల్స్ అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. వలంటీర్లను జగన్‌మోహన్‌రెడ్డి తెలివిగా ఏర్పాటు చేశారన్నారు. వారికిచ్చిన విధులు వారు నిర్వహించడం లేదన్నారు. డేటా చౌర్యం చేసి ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఒక వ్యక్తి ఎవరితో తిరుగుతాడు. ఏ పార్టీతో ఉంటాడు. అతని కూతురు ఎక్కడ ఉంది. కొడుకు ఏం చేస్తుంటాడు. వాడు మంచివాడా కాదా లాంటి వివరాలు వలంటీర్లు సేకరిస్తున్నారని చెప్పారు. ఈ డేటా దగ్గరపెట్టుకుని జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో గెలిచిన తరువాత ఓటు వేయనివారిపై కక్ష సాధిస్తారని అన్నారు. స్లీపర్ సెల్స్‌లా వలంటీర్లను జగన్ తయారు చేశారని, టెర్రరిస్టులే ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటారని చెప్పారు. ఇలాంటి వ్యవస్థను ఎన్నికల కోసం ఏర్పాటు చేశారని విమర్శించారు. అయితే ఆ వ్యవస్థను తాను తప్పు పట్టడం లేదని, కొందరు మాత్రమే అలా ఉన్నారని అన్నారు. ఎన్నికల కోసం ఇష్టారాజ్యంగా ఆ వ్యవస్థను వాడుతున్నారని చెప్పారు. ఇదే సమయంలో పోలీసుల వ్యవస్థపైనా తీవ్ర విమర్శలు చేశారు.

వలంటీర్ల ఆగ్రహం

బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలపై వలంటీర్లు సోమవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నోటికి నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం సుధీర్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. తాము సేవకులమని ప్రజలకు సేవ చేసేందుకే ఇంతకాలం పనిచేశామని చెప్పారు. కరోనాలో ప్రజలందరికీ మందులు, ఇతర సామగ్రిని ఇళ్లకు చేర్చామని తెలిపారు. కరోనా సమయంలో సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌లో దాక్కున్నారని ఎద్దేవా చేశారు. వలంటీర్లను టెర్రరిస్టులు అంటూ వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. ప్రజలే అతనికి బుద్ధి చెబుతారని అన్నారు.

వలంటీర్లంటే వణుకెందుకు పవన్!

- రఘురామకృష్ణరాజు దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లంటే పవన్‌కు వణుకెందుకని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రశ్నించారు. ప్రభుత్వ, ప్రజల మధ్య అనుసంధానకర్తలుగా వలంటీర్ల వ్యవస్థ ఉందన్నారు. వారిపై పవన్ ఇష్టానుసారంగా నోరుపారేసుకోవటం మంచిది కాదన్నారు. సోమవారం తాడేపల్లిలో మీడియాతో కొరముట్ల మాట్లాడుతూ.. కరోనా సమయంలో వలంటీర్లే ప్రజల ప్రాణాలను కాపాడగలిగారన్నారు. దేశ వ్యాప్తంగా అందరూ వలంటీర్లను కొనియాడిన విషయం పవన్ మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. నిజంగా పవన్ రాజకీయ నాయకుడైతే రాజకీయ పార్టీ నేతలతో రాజకీయాలు చేయాలని తెలిపారు.

రఘురామకృష్ణకు సవాల్

నరసాపురం పార్లమెంటరీ స్థానం నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తానే పోటీ చేస్తానంటూ బీరాలు పలికిన కె.రఘురామకృష్ణరాజు ఆ సీటు వేరొకరికి కేటాయించడంతో వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం సిగ్గు చేటని కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. తనకు ప్రధాని తెలుసు, అమిత్‌షా తెలుసు, నడ్డా తెలుసంటూ ప్రగల్భాలు పలికిన రఘురామ ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. 'నరసాపురం సీటు నాదే.. నా బ్యాక్ గ్రౌండ్ మీకు తెలియదు' అంటూ మిడిసిపడిన రఘురామ నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని సవాల్ చేశారు.

వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దారుణం

- శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డిపై సుమోటోగా కేసు నమోదు చేయాలి
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలకు విశేష సేవలందిస్తూ.. పలువురి మన్ననలు పొందుతుంటే.. వారిని టెర్రరిస్టులతో పోల్చడం కూటమి నేతల దుష్ట పన్నాగాలకు నిదర్శనమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. పింఛన్లు, సంక్షేమ పథకాల అమలులో అత్యుత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చిన శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిపై సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలంతా వలంటీర్లను తమ సొంత బిడ్డల్లా ఆదరిస్తుంటే టీడీపీ, జనసేన మాత్రం నక్సలైట్లు, టెర్రరిస్టుల్లా పోలుస్తూ వారిని అవమానపరచడం బాధాకరమని చెప్పారు. మగాళ్లు ఇంట్లో లేని సమయంలో తలుపులు కొడతారా, గోనె సంచులు మోసే ఉద్యోగాలా అని గతంలో చంద్రబాబు వలంటీర్లను దారుణంగా విమర్శించారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మరింత ముందుకెళ్లి వలంటీర్ల ద్వారా మహిళలు మిస్సింగ్ అయిపోతున్నారంటూ రాద్ధాంతం చేశారని మంత్రి గుర్తు చేశారు.

బాబు వెన్నులో కుప్పం వణుకు

- ఓటమి భయంతో షెడ్యూల్ విడుదల కాగానే వరుస పర్యటనలు
- గతంలో ఎప్పుడూ ఒక్క రోజుకు మించి ప్రచారం చేయని వైనం
- ప్రజల్లో మార్పును గమనించే 40 రోజులు ముందుగానే కుప్పం బాట

కుప్పం: 'ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నామినేషన్ వాళ్లే వేసుకుని.. ప్రచారం వాళ్లే చేసుకుని భారీ మెజారిటీతో కుప్పం ప్రజలు గెలిపిస్తున్నారు. నా మీద అభిమానం చూపుతున్నారు.. ఎన్ని జన్మలెత్తినా ప్రజల రుణం తీర్చుకోలేను' ఇదీ కుప్పానికి వచ్చిన ప్రతిసారీ చంద్రబాబు చేసే వ్యాఖ్యలు. సాధారణంగా గతంలో ఎన్నికల సమయంలో బాబు ఓసారి మాత్రమే వచ్చి బహిరంగ సభలో ప్రసంగించి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించి వెళ్లేవారు. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. ఓటమి భయంతో బాబు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే కుప్పంపై దృష్టి పెట్టారు. ఏకంగా ఇక్కడ రెండురోజులపాటు ప్రచారానికి సిద్ధపడ్డారు. ఆ తర్వాతా వరుస పర్యటనలకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం కుప్పంలో పర్యటించిన ఆయన మంగళవారం కూడా కుప్పం నియోజకవర్గంలోనే ఉండనున్నారు. 35 ఏళ్లుగా ఏ ఎన్నికల్లోనూ ఓ రోజుకు మించి కుప్పంలో ఉండని బాబు ఇప్పుడు ఇంకా ఎన్నికలకు 40 రోజులు ఉండగానే అక్కడ పర్యటించడంతో ప్రజలూ ఆశ్చర్యపోతున్నారు. ఓటమి భయంతో ఆయన వణుకుతున్నారని చర్చించుకుంటున్నారు.

సంక్షేమ పాలనకు జై కొడుతున్న ప్రజలు

కుప్పంలో మార్పు మొదలైంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసింది. నియోజకవర్గంలోని అర్హులందరికీ పథకాల ద్వారా రూ.1,400 కోట్లు అందించింది. దీంతోపాటు నాన్ డీబీటీ ద్వారా రూ.1,889 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంది. ఫలితంగా లబ్ధిదారులు, మహిళలు సంక్షేమ పాలనకు జై కొడుతున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన చంద్రబాబు అనుచరవర్గం డీలాపడింది. బాబులోనూ ఓటమి భయం పట్టుకుందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అందుకే 15 రోజులుగా టీడీపీ పోరం పేరుతో లోకేశ్ బెంగళూరు నుంచి 200 మందిని కుప్పంలో దింపారు. మహిళల్లో విప్లవాత్మక మార్పు వచ్చిందని, ఈసారి బాబు గెలుపు కష్టమేనని నివేదిక ఇచ్చినట్టు సమాచారం.




స్థానిక ఎన్నికలతో టీడీపీలో నైరాశ్యం

2019 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ తిరుగులేని ఆధిక్యం కనబరిచింది. జెడ్పీటీసీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో వరుస విజయాలతో దూసుకుపోయింది. దీంతో టీడీపీ కేడర్‌లో నైరాశ్యం అలుముకుంది. ఈ నేపథ్యంలోనే 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుందనే వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తోంది.

అబ్బాయి వర్సెస్ బాబాయి

పశుపతిపై చిరాగ్ పాశ్వాన్ పోటీ • హాజీపూర్‌లో ఆసక్తికర వారసత్వ పోరు


చిరాగ్

జాతీయ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన వారసత్వ పోరుకు తెర లేచింది. బిహార్లో దిగ్గజ నేత దివంగత రాం విలాస్ పాశ్వాన్ వారసత్వం కోసం ఆయన కుమారుడు చిరాగ్, సోదరుడు పశుపతి కుమార్ పారస్ మధ్య జరుగుతున్న పోరు తుది దశకు చేరుకుంది. పాశ్వాన్ ఏకంగా ఎనిమిది సార్లు ఎంపీగా నెగ్గిన హాజీపూర్ లోక్‌సభ స్థానంలో ఈసారి వారిద్దరూ నేరుగా అమీతుమీ తేల్చుకోనున్నారు...

పాశ్వాన్ల కంచుకోట

హాజీపూర్ లోక్‌సభ స్థానంతో పాశ్వాన్‌లది విడదీయరాని బంధం. లోక్ జనశక్తి పార్టీ వ్యవస్థాపకుడు రాం విలాస్ పాశ్వాన్ 1977 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా అక్కడ విజయం సాధించారు. మధ్యలో 1984, 2009 మినహా మరో ఏడుసార్లు హాజీపూర్ నుంచే నెగ్గారు. అనారోగ్య కారణాలతో పాశ్వాన్ రాజ్యసభకు వెళ్లడంతో తమ్ముడు పశుపతి 2019లో తొలిసారి హాజీపూర్ నుంచి పోటీ చేసి నెగ్గారు. చిరాగ్ 2014తో పాటు 2019లోనూ జముయ్ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గారు. 2020లో పాశ్వాన్ మృతి చిరాగ్, పశుపతి మధ్య వారసత్వ పోరుకు దారితీసింది. పాశ్వాన్ వారసుడిని తానేనని పశుపతి ప్రకటించుకోవడంతో ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తానని చిరాగ్ హెచ్చరించారు. పశుపతి మిగతా నలుగురు ఎల్జేపీ ఎంపీలతో కలిసి తిరుగుబావుటా ఎగరేయడంతో వారందరినీ పార్టీ నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. చివరికి వివాదం ఎన్నికల సంఘం వద్దకు చేరింది. ఎల్జేపీ పేరును, పార్టీ గుర్తును ఈసీ స్తంభింపజేసి పశుపతి వర్గానికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ), చిరాగ్‌కు ఎల్జేపీ (రాం విలాస్) పేర్లు కేటాయించింది. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్డీఏతో చిరాగ్ తెగదెంపులు చేసుకున్న నేపథ్యంలో పశుపతి 2021లో ఎన్డీఏలో చేరి కేంద్ర మంత్రి అయ్యారు.

చిరాగ్ ఇన్, పశుపతి ఔట్

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బిహార్లో 40 స్థానాలనూ క్లీన్‌స్వీప్ చేయడం లక్ష్యం పెట్టుకున్న బీజేపీ మరోసారి చిరాగ్‌ను చేరదీసింది. అలా మళ్లీ ఎన్డీఏలో చేరిన చిరాగ్, పొత్తులో భాగంగా తమకు కేటాయించే 5 స్థానాల్లో హాజీపూర్ ఉండాల్సిందేనని పట్టుబట్టి సాధించుకున్నారు. దాంతో పశుపతి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. దీనికి తోడు ఆర్ఎల్జేపీకి బీజేపీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంతో వారం క్రితం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. తాను హాజీపూర్ నుంచి పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు. తనతో పాటు మిగతా నలుగురు ఎంపీలు కూడా మళ్లీ బరిలో దిగి తీరతారని స్పష్టం చేశారు. బాబాయిని ఓడిస్తే పాశ్వాన్ల కంచుకోటైన హాజీపూర్ హస్తగతమవడమే గాక తండ్రి వారసత్వం పూర్తిగా తనదేనని రుజువవుతుందనే భావనతో చిరాగ్ అక్కడి నుంచి బరిలో దిగుతున్నారు.

హాజీపూర్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి దాదాపు 4 లక్షల ఓట్లున్నాయి. దీనికి తోడు 1.5 లక్షల దాకా ముస్లిం ఓట్లున్నాయి. యాదవులు, రాజ్‌పుత్‌లు, భూమిహార్లతో పాటు కుష్వాహాలు, పాశ్వాన్లు, రవిదాస్ వంటి అత్యంత వెనకబడ్డ సామాజిక వర్గాలకు కూడా చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకుంది. ఈ వర్గాలకు రాం విలాస్ పాశ్వాన్ తిరుగులేని నేతగా కొనసాగారు. 1977లో ఆయన సాధించిన 4.69 లక్షల మెజారిటీ గిన్నిస్ రికార్డుకెక్కింది! 1989లో ఏకంగా 5 లక్షల పై చిలుకు మెజారిటీ సాధించారాయన.


పశుపతి

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ బీట్

స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ పోటీ

కాంగ్రెస్ అభ్యర్థుల ఆరో జాబితా విడుదల

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ కాంగ్రెస్ పార్టీ ఒక్కో స్థానంలో అభ్యర్థుల్ని ప్రకటిస్తూనే వెళ్తోంది. తాజాగా మరో ఐదు స్థానాల్లో అభ్యర్థుల్ని ప్రకటించింది. దీంతో కలిపి పార్టీ ఇప్పటిదాకా ఆరు జాబితాలను వెల్లడించింది. తాజా జాబితా ప్రకారం రాజస్థాన్‌లోని కోటా ఎంపీ స్థానం నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పోటీగా తమ అభ్యర్థి ప్రహ్లాద్ గుంజల్‌ను కాంగ్రెస్ రంగంలోకి దింపుతోంది. అజ్మీర్ నుంచి రామ్‌చంద్ర చౌదరి, రాజ్‌సమంద్ నుంచి సుదర్శన్ రావత్, బిల్వారా నుంచి దామోదర్ గుర్జార్, తిరునల్వేలి నుంచి సి.రాబర్ట్ బ్రూస్ పోటీ చేస్తారు. బీజేపీ ఉండగా మాజీ రాజస్థాన్ మహిళా ముఖ్యమంత్రి వసుంధరా రాజేకు ప్రహ్లాద్ గుంజల్ నమ్మిన బంటుగా ఉండేవారు. గత గురువారమే కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఈయనకు సీటు దక్కడం విశేషం. నార్త్ కోటా నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. తాజా జాబితాతో కలుపుకుని కాంగ్రెస్ ఇప్పటిదాకా 190 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

నాగౌర్ నుంచి బరిలో బేనివాల్

జైపూర్: ప్రతిపక్ష ఇండియా కూటమి తరఫున రాజస్తాన్‌లోని నాగౌర్ లోక్‌సభ స్థానం నుంచి రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ)కి చెందిన హనుమాన్ బేనివాల్ పోటీ చేయనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇక్కడ గెలిచిన బేనివాల్ గత డిసెంబర్‌లో ఎమ్మెల్యేగా నెగ్గడంతో ఈ సీటు ఖాళీ అయ్యింది. ఇప్పుడక్కడ బీజేపీకి చెందిన జ్యోతి మిర్ధాతో బేనివాల్ తలపడనున్నారు. ఇద్దరూ జాట్ నేతలే. గతంలో బీజేపీ మిత్రపక్షంగా ఉన్న ఆర్ఎల్‌పీ 2020 డిసెంబర్‌లో రైతు సంఘాల ఆందోళన నేపథ్యంలో ఎన్డీఏతో తెగదెంపులు చేసుకుంది.

'మోదీ అంటే చెంపలు వాయించాలి'

బెంగళూరు: మోదీ, మోదీ..అంటూ నినదించే యువకులు, విద్యార్థుల చెంపలు వాయించాలంటూ కర్ణాటక మంత్రి శివరాజ్ తంగడగి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''ఒక్క అభివృద్ధి పని కూడా చేయని బీజేపీ నేతలకు ఓట్లడిగేందుకు సిగ్గుండాలి. ఉద్యోగాలడిగితే పకోడీలు అమ్ముకోమంటున్నారు'' అన్నారు. ఆయనపై బీజేపీ మండిపడింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని, ప్రచారానికి దూరంగా ఉంచాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

బీజేపీ గూటికి గాలి జనార్దన్ రెడ్డి

సాక్షి, బెంగళూరు: కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి సోమవారం తిరిగి బీజేపీ గూటికి చేరుకున్నారు. తన కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష (కేఆర్‌పీపీ) పార్టీని బీజేపీలో విలీనం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ఆయనకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

ప్రధానిపై వ్యాఖ్యలు..తమిళ మంత్రిపై కేసు

చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యల ఉదంతంలో తమిళనాడు మత్స్య శాఖ మంత్రి అనితా ఆర్.రాధాకృష్ణన్‌పై కేసు నమోదైంది. ఈ నెల 22న డీఎంకే సమావేశంలో మోదీపై మంత్రి అభ్యంతకరంగా మాట్లాడారని బీజేపీ ఫిర్యాదు చేసింది. మంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

నేడు ప్రధాని నివాసం వద్ద ఆప్ ఘెరావ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా మంగళవారం మోదీ నివాసాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ దిగ్బంధించనుంది. అరెస్ట్ అక్రమమంటూ శనివారం నుంచి ఆప్ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుండటం తెలిసిందే. మంగళవారం ప్రధాని నివాస దిగ్బంధంలో ఇండియా కూటమి పార్టీల నేతలు కూడా పాల్గొంటారని ఆప్ నేతలు ప్రకటించారు.

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ



- ఐరాస భద్రతా మండలి తీర్మానం
- అనుకూలంగా ఓటేసిన రష్యా, చైనా సహా 14 దేశాలు
- ఓటింగ్‌లో పాల్గొనని అమెరికా

ఐక్యరాజ్యసమితి: ఇజ్రాయెల్–హమాస్ మధ్య వివాదం మొదలైన అయిదు నెలల తర్వాత సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత రంజాన్ మాసంలో గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని సంబంధిత వర్గాలను కోరుతూ ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది. 15 సభ్యదేశాలతో కూడిన మండలిలోని 10 తాత్కాలిక సభ్యదేశాలు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. రష్యా, చైనా సహా 14 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఎవరూ వ్యతిరేకించనప్పటికీ శాశ్వత సభ్య దేశం అమెరికా ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. 'గాజా విషయంలో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న తీర్మానాన్ని భద్రతా మండలి ఆమోదించింది. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, బేషరతుగా బందీలందరినీ విడుదల చేయాలని కోరింది' అని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ 'ఎక్స్'లో తెలిపారు. అలాగే, గాజాలో చిక్కుకున్న పాలస్తీనియన్ల వైద్య, ఇతర మానవతా అవసరాలను పరిష్కరించాలని, నిర్బంధించిన వారందరికీ అంతర్జాతీయ చట్టాల ప్రకారం కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత వర్గాలపై ఉందని తీర్మానం పేర్కొంది. 'ఈ తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందే. వైఫల్యం క్షమించరానిది' అంటూ అని గుటెరస్ వ్యాఖ్యానించారు. మండలి తీర్మానంపై ఇజ్రాయెల్ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ఐరాస హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ ల్యూయిస్ పేర్కొన్నారు. పాలస్తీనా ప్రజల ఆకలిచావులను ఆపేందుకు మానవతా సాయం అందించేందుకు వీలు కల్పించాలని, చట్ట విరుద్ధ దాడులను ఆపాలని ఇజ్రాయెల్‌ను కోరారు.

అమెరికా పర్యటనను రద్దు చేసుకున్న నెతన్యాహు

ఐరాస తీర్మానానికి నిరసనగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఉన్నత స్థాయి బృందంతో తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీకి సహకారం నిలిపివేయాలని కూడా ఇజ్రాయెల్ నిర్ణయించింది. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు చేయడం, ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ తీవ్రస్థాయి యుద్ధంతో విరుచుకుపడుతుండటం తెలిసిందే.

వాట్సాప్‌లో త్వరలో ఏఐ ఇమేజ్ ఎడిటర్!

వాషింగ్టన్: కృత్రిమ మేధ (ఏఐ) అందుబాటులోకి వచ్చాక దానిని విరివిగా వాడేందుకు జనం ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. తాము వాడే యాప్‌లలో ఏఐ ఉంటే దాని సాయంతో సరదా సరదా ప్రయోగాలు చేస్తుంటారు. దీంతో ఫొటోలు, ఇమేజ్‌లను ఎడిట్ చేసే ఏఐ ఆధారిత ఫీచర్ త్వరలో ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్‌లో అందుబుటులోకి వచ్చే అవకాశ ముంది. బీటా వెర్షన్ వినియోగదారులకు మొదట దీనిని వాడే అవకాశం ఇవ్వొచ్చని 'వెబ్‌బేటాఇన్ఫో' తన కథనంలో పేర్కొంది.

ఆ ఫీచర్ అందుబాటులోకి వస్తే..

యాప్‌లోని ఆప్షన్లను తమ అభిరుచికి అనుగుణంగా వాడుకుంటున్న యూజర్లు.. ఈ కొత్త ఫీచర్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇది అంబుబాటులోకి వస్తే ఇమేజ్‌ను తమకు నచ్చినట్లుగా ఎడిట్ చేసుకోవచ్చు. ఇమేజ్ సైజు, బ్యాక్‌గ్రౌండ్‌లను మార్చుకోవచ్చు. ఆండ్రాయిడ్ 2.24.7.13 వెర్షన్‌ను అప్‌డేట్ చేసుకున్న వాళ్లకు ఏఐ ఇమేజ్ ఎడిటర్ ఫీచర్ ప్రాథమిక కోడ్‌ను అందుబాటులోకి తేవచ్చు. బేటా ప్రోగ్రామ్‌లో భాగస్వాములైన టెస్టర్లనే తొలుత దీనిని వాడేందుకు అనుమతిస్తారు. సెర్చ్ బార్‌లో టైప్‌చేసి నేరుగా ఏఐ సర్వీస్‌తోనే చాటింగ్ చేసి కావాల్సిన ఫలితాలు పొందే ఫీచర్‌పైనా వాట్సాప్ కసరత్తు చేస్తోంది. వాయిస్ నోట్ వచ్చే సందేశాలనూ ఓపెన్ చేయకుండానే టెక్ట్స్ రూపంలో చదవగలిగేలా మరో ఫీచర్‌ను యూజర్లకు అందివ్వాలని వాట్సాప్ భావిస్తోంది.

ఆ నినాదాలను త్యజించే దమ్ము సంఘ్ పరివార్‌కు ఉందా?

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సవాల్



మలప్పురం(కేరళ): స్వాతంత్రోద్యమ వేళ దేశాన్ని ఒక తాటి మీదకు తెచ్చిన జాతీయస్థాయి నినాదాలు పురుడుపోసుకోవడంలో ముస్లింల పాత్ర కూడా ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. సంఘ్ పరివార్ శ్రేణుల్లో ఎప్పుడూ ప్రతిధ్వనించే రెండు నినాదాలను వాస్తవానికి ముస్లింలు తొలిసారిగా ఎలుగెత్తి చాటారని విజయన్ అన్నారు. వివాదాస్పద పౌరసత్వ(సవరణ)చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) నేతృత్వంలో నాలుగురోజులుగా జరుగుతున్న ర్యాలీలో విజయన్ పాల్గొని ప్రసంగించారు. ముస్లింల జనాభా ఎక్కువగా ఉండే మలప్పురం జిల్లాలోనే ఈ సభ జరగడం గమనార్హం. ''ముస్లిం పాలకులు, సాంస్కృతిక సారథులు, ముస్లింలు ఉన్నతాధికారులు ఎందరో దేశ చరిత్ర, స్వతంత్ర సంగ్రామంలో పాలుపంచుకున్నారు. వీటిపై ఏమాత్రం అవగాహన లేని సంఘ పరివార్ నేతలు ఇక్కడికొచ్చి భారత్ మాతాకీ జై అని నినదించాలని డిమాండ్లుచేస్తున్నారు. వాస్తవానికి భారత్ మాతాకీ జై, జైహింద్ అని నినదించింది ముస్లింలని సంఘ పరివార్‌కు తెలీదనుకుంటా. తెలిస్తే ఆ నినాదాలను ఇవ్వడం సంఘ్ పరివార్ మానుకుంటుందా? అజీముల్లా ఖాన్ భారత్ మాతాకీ జై అంటే, అబిద్ హసన్ అనే భారత దూత 'జై హింద్' అని నినదించారు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తనయుడు దారా షికోహ్ సంస్కృతంలో ఉన్న 50 ఉపనిషత్తులను పర్షియన్‌లోకి తర్జుమాచేశారు. అలా భారతీయ రచనలు విశ్వవ్యాప్తమయ్యేలా తన వంతు కృషిచేశారు. ఇవేం తెలియని సంఘ్ నేతలు భారత్‌లోని ముస్లింలను పాకిస్తాన్‌కు పంపేయాలని మొండిపట్టు పడుతుంటారు. సీఏఏతో ముస్లింలను రెండో శ్రేణి పౌరులుగా మార్చాలని మోదీ సర్కార్ కుట్ర పన్నింది. వీటిని కేరళ పౌరులు సహించరు'' అన్నారు. సీఏఏ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయంపై కాంగ్రెస్‌కు పెద్దగా ఆసక్తి లేదని ఆరోపించారు. హిట్లర్ నియంతృత్వ పోకడల నుంచే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు పురుడుపోసుకున్నాయని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. క్రైస్తవులు, ముస్లింలు, కమ్యూనిస్టులు దేశ అంతర్గత శత్రువులని ఆర్ఆర్ఎస్ సిద్ధాంతకర్తల్లో ఒకరైన ఎంఎస్ గోల్వాల్కర్ గతంలో ఒక పుస్తకంలో వ్యాఖ్యానించారని విజయన్ గుర్తుచేశారు.

ఐర్లాండ్ ప్రధానిగా సిమోన్ హారిస్

లండన్: ఐర్లాండ్ ప్రధానిగా అత్యంత పిన్న వయస్కుడైన సిమోన్ హారిస్ (37)బాధ్యతలు చేపట్టనున్నారు. భారత సంతతికి చెందిన ప్రధాని లియో వరాద్కర్ రాజీనామా చేయడం తెలిసిందే. ఆయన కేబినెట్‌లో సిమోన్ ఉన్నత విద్యా మంత్రిగా చేశారు. వరాద్కర్ 2017–2020, 2022–2024 మధ్య రెండుసార్లు ప్రధానిగా ఉన్నారు. తాను గే అని ప్రకటించుకున్న తొలి ఐర్లాండ్ ప్రధాని ఆయన. తొలిసారి ప్రధాని అయినప్పుడు ఆయనకు 38 ఏళ్లే!

జేఎన్‌యూఎస్‌యూకు దళిత ప్రెసిడెంట్

న్యూఢిల్లీ: ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్(జేఎన్‌యూఎస్‌యూ) అధ్యక్షుడిగా మొదటిసారిగా వామపక్ష సంఘాలు బలపరిచిన దళిత విద్యార్థి ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల్లో యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్ క్లీన్ స్వీప్ సాధించగా ప్రత్యర్థి ఆర్ఎస్ఎస్ అనుబంధ ఏబీవీపీ ఒక్క పోస్టూ గెలుచుకోలేకపోయింది. వామపక్ష విద్యార్థి సంఘాలు బలపరిచిన దళిత విద్యార్థి బట్టి లాల్ బైరవ 1996–97లో జేఎన్‌యూఎస్‌యూకు తొలిసారిగా ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు.

షాంపూ బాటిళ్లలో రూ.19 కోట్ల కొకైన్

ముంబై: బూట్లు, మాయిశ్చరైజర్, షాంపూ బాటిళ్లలో రూ.19.79 కోట్ల విలువైన సుమారు రెండు కిలోల బరువున్న కొకైన్ అనే డ్రగ్ పట్టుబడింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన విమానంలో సియోర్రా లియోన్ దేశానికి చెందిన ఓ మహిళ దిగింది. ఆమె లగేజీలోని బూట్లు, మాయిశ్చరైజర్ బాటిల్, షాంపూ బాటిల్ చాలా గట్టిగా బరువుగా ఉండటంతో పరిశీలించి చూడగా వాటిల్లో ఏకంగా 1,979 గ్రాముల కొకైన్ బయటపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.19.79 కోట్లని అధికారులు తెలిపారు.

మహాకాళ్ ఆలయంలో అగ్ని ప్రమాదం

ఉజ్జయిని(మధ్యప్రదేశ్): ఉజ్జయినిలో మహాకాళ్ ఆలయంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. 14 మంది అర్చకులు, వారి సహాయకులు గాయపడ్డారు. ఉదయం 5.50 సమయంలో గర్భగృహంలో భస్మహారతి ఇస్తుండగా ఘటన చోటుచేసుకుంది. సోమవారం హోలీ కావడంతో పూజల్లో భాగంగా అర్చకులు గులాల్ చల్లారు. ఆ పౌడర్ హారతి పళ్లెంలోని ప్రమిదపై పడటంతో మొదలైన మంటలు క్షణాల్లోనే వ్యాపించాయని కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ చెప్పారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఉజ్జయిని ఆలయంలో ఇలా జరగడం విచారకరమని ప్రధాని మోదీ అన్నారు.

భారీ ష్యూరిటీ నుంచి ట్రంప్‌కు వెసులుబాటు

న్యూయార్క్: ఆదాయం, ఆస్తుల విలువను ఎక్కువ చూపి బ్యాంకులు, బీమా సంస్థలను మోసం చేసిన కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఊరట లభించింది. సుమారు రూ.3 వేల కోట్ల భారీ మొత్తానికి బదులుగా పది రోజుల్లో రూ.1,460 కోట్ల ష్యూరిటీ బాండ్ ఇస్తే సరిపోతుందని న్యూయార్క్‌లోని అప్పీల్స్ కోర్టు సోమవారం తెలిపింది. ట్రంప్ ఈ మొత్తం చెల్లిస్తే ఆస్తుల్ని సీజ్ చేసే ప్రక్రియ నిలిచిపోతుందని స్పష్టం చేసింది. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ ఆస్తుల సీజ్‌కు సిద్ధమవుతున్న తరుణంలోనే ఈ తీర్పు రావడం గమనార్హం. రూ.3 వేల కోట్ల ష్యూరిటీ బాండ్‌ను తీసుకురావడం అసాధ్యమంటూ ట్రంప్ లాయర్లు గత వారం అప్పీల్స్ కోర్టుకు విన్నవించుకున్నారు.

రెండు రష్యా నౌకలు ధ్వంసం

కీవ్: క్రిమియా సమీపంలోని నల్ల సముద్ర జలాల్లో రష్యాకు చెందిన రెండు నౌకలను ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. బలగాలు, యుద్ధ పరికరాలను చేరవేయడానికి వాడుతున్నట్టు వాడుతున్నట్లు తెలిపింది. రష్యా నౌకలపై దాడులను ఉక్రెయిన్‌కు చారిత్రక సందర్భంగా బ్రిటన్ రక్షణ మంత్రి గ్రాంట్ షాప్స్ అభివర్ణించారు. రష్యా నౌకాదళం ఇక్కడ 1783 నుంచే పనిచేస్తున్నప్పటికీ నల్ల సముద్ర జలాల్లో ఇకపై స్వేచ్ఛగా తిరగలేవని ఆయన అన్నారు.

వివాదాస్పదులకు మొండిచేయి

టికెట్ల కేటాయింపులో బీజేపీ కఠిన వైఖరి • ప్రజ్ఞా, బిదురి, హెగ్డే తదితరులకు నో చాన్స్

నోటిని అదుపులో పెట్టుకోకపోతే ఏం జరుగుతుందో బీజేపీ సిట్టింగ్ ఎంపీలకు బాగా తెలిసొస్తోంది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సొంతంగా 370, ఎన్డీఏకు 400 పై చిలుకు లోక్‌సభ స్థానాలను కమలనాథులు లక్ష్యంగా పెట్టుకోవడం తెలిసిందే. ఆ క్రమంలో ప్రతి లోక్‌సభ స్థానాన్నీ బీజేపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. 'టార్గెట్ 400' లక్ష్యసాధనకు అడ్డొస్తారనుకుంటే సొంత పార్టీ నేతలను కూడా క్షమించడం లేదు. ఆ క్రమంలో ఎంతటి సీనియర్లనైనా సరే, సింపుల్‌గా పక్కన పెట్టేస్తోంది. దాని ఫలితమే... వివాదాస్పదులుగా పేరుబడ్డ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, రమేశ్ బిదురి, అనంత్‌కుమార్ హెగ్డే వంటి సిట్టింగ్ ఎంపీలకు ఈసారి టికెట్ల నిరాకరణ!

– సాక్షి, నేషనల్ డెస్క్

రమేశ్ బిదురి



ఈ సౌత్ ఢిల్లీ సిట్టింగ్ ఎంపీ ఏకంగా పార్లమెంటులోనే అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు సృష్టించారు. నిండు సభలో బీఎస్పీ ఎంపీ డానిష్ అలీని బిదురి అసభ్య పదజాలంతో దూషించడం పెను దుమారానికి దారి తీసింది. ఆయన్ను సస్పెండ్ చేయాల్సిందేనంటూ విపక్షాలు హోరెత్తించాయి. దాంతో రెండుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన బిదురికి టికెట్ నిరాకరించింది.

అనంత్‌కుమార్ హెగ్డే



కర్ణాటకలో సీనియర్ బీజేపీ నేత. ఆరుసార్లు లోక్‌సభ సభ్యుడు. కేంద్ర మంత్రిగానూ చేశారు. రాజ్యాంగంలో చాలా అంశాలను మార్చాల్సి ఉందని, అందుకు బీజేపీకి ప్రజలు 400కు పైగా సీట్లు కట్టబెట్టాలని ఎన్నికల వేళ ఆయన చేసిన వ్యాఖ్యలు మంటలు రేపాయి. విపక్షాలన్నీ వాటిని అందిపుచ్చుకుని బీజేపీని దుయ్యబట్టాయి. హెగ్డే వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని బీజేపీ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. దాంతో ఆయన నాలుగుసార్లు వరుసగా నెగ్గిన ఉత్తర కన్నడ స్థానాన్ని మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డేకు కేటాయించింది.

పర్వేష్ సాహిబ్‌సింగ్



ముస్లిం చిరు వ్యాపారులను పూర్తిగా బాయ్‌కాట్ చేయాలంటూ ఏకంగా ఢిల్లీలోనే బహిరంగ సభలో పిలుపునిచ్చి కాక రేపారు. సభికులతోనూ నినాదాలు చేయించారు. దాంతో పశ్చిమ ఢిల్లీ సిట్టింగ్ బీజేపీ ఎంపీ ఆయనకు కూడా ఈసారి టికెట్ గల్లంతైంది. వీరేగాక ఇతరేతర కారణాలతో ఈసారి చాలా మంది సీనియర్లు, సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ టికెట్లు నిరాకరించింది.

ప్రజ్ఞాసింగ్ ఠాకూర్



మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత దిగ్విజయ్‌సింగ్‌ను 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 3.5 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో మట్టికరిపించిన చరిత్ర ఆమెది. . కాకపోతే మంటలు రేపే మాటలకు సాధ్వి పెట్టింది పేరు. నాథూరాం గాడ్సేను దేశభక్తునిగా అభివర్ణించినా, ముంబై ఉగ్ర దాడుల్లో అమరుడైన పోలీసు అధికారి హేమంత్ కర్కరేకు తన శాపమే తగిలిందంటూ అభ్యంతకర వ్యాఖ్యలు చేసి ఈసీ నుంచి షోకాజ్ నోటీసు అందుకున్నా ఆమెకే చెల్లింది. 195 మందితో బీజేపీ విడుదల చేసిన తొలి విడత జాబితాలో ప్రజ్ఞకు మొండిచేయి చూపారు. తాను పలు సందర్భాల్లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ఇందుకు కారణమని ఆమే స్వయంగా అభిప్రాయపడ్డారు.

బాండ్లను డ్రాప్ బాక్స్‌లో పడేశారు.. ఎవరిచ్చారో తెలీదు: టీఎంసీ


కునాల్ ఘోష్

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల పథకం ద్వారా వందల కోట్ల విరాళాలను అందుకున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తమ దాతలు ఎవరో తెలీయదని చెప్పొకొచ్చింది. ప్రభుత్వ ప్రాజెక్టులు, కాంట్రాక్టులను సంపాదించిన కంపెనీలే ఆయా అధికార పార్టీలకు వందల కోట్ల ముడుపులను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ముట్టజెప్పాయన్న ఆరోపణల నడుమ తృణమూల్ కాంగ్రెస్ స్పందించడం విశేషం. టీఎంసీకొచ్చిన బాండ్లపై పశ్చిమబెంగాల్‌లో సోమవారం ఒక పత్రికా సమావేశంలో ఆ పార్టీ నేత కునాల్ ఘోష్ మాట్లాడారు. ''మా పార్టీకి ఎవరు విరాళంగా ఇచ్చారో మాకు తెలీదు. ఎంత పెద్ద మొత్తాలను ఇచ్చిందీ తెలీదు. అసలు ఈ బాండ్ల పథకాన్ని తెచ్చిందే బీజేపీ. రాజకీయ పార్టీలకు నిర్వహణ వ్యయాలను ప్రభుత్వాలే భరించాలని 1990దశకం నుంచీ మమతా బెనర్జీ మొత్తుకుంటూనే ఉన్నారు. వేలకోట్ల నల్లధన ప్రవాహానికి అడ్డుకట్ట పడాలని ఆమె కాంక్షించారు. అయినా సరే ఎవరిమాటా వినకుండా బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తెచ్చింది. వేరే దారి లేక మేమూ ఆ పథకం నిబంధనలను పాటించాం. మాకు ఎన్ని బాండ్లు ఇచ్చారో, ఎవరిచ్చారో తెలీదు. సాధారణంగా పార్టీ ఆఫీస్ బయట ఒక డ్రాప్‌బాక్స్ ఉంటుంది. అందులోనే ఈ బాండ్లు ఎవరో పెట్టి వెళ్లారు. ఆ బాండ్లపై దాతల పేర్లు ఉండవు. కేవలం ఆల్ఫా–న్యూమరిక్ నంబర్ ఉంటుంది. దాత పేరు, వివరాలు బీజేపీకైతే తెలుస్తాయి. ఎందుకంటే వాళ్లే కేంద్రంలో అధికారంలో ఉన్నారు. సీబీఐ, ఈడీని తమ చెప్పుచేతల్లో ఉంచుకుని వాటి ద్వారా బెదిరించి మరీ విరాళాల వసూళ్ల పర్వాన్ని బీజేపీ యథేచ్ఛగా కొనసాగించింది. బాండ్ల ద్వారా మేం అందుకున్న మొత్తాలను టీఎంసీ అధికారిక బ్యాంక్ ఖాతాల్లోనే జమచేశాం'' అని కునాల్ ఘోష్ చెప్పారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ఎలక్టోరల్ బాండ్ల గణాంకాల ప్రకారం తృణమూల్ కాంగ్రెస్‌కు 10 మంది అతిపెద్ద విరాళాల దాతల నుంచే ఏకంగా రూ.1,198 కోట్లు వచ్చాయి. ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ సంస్థ ఒక్కటే టీఎంసీకి రూ.542 కోట్లు విరాళంగా ఇచ్చింది. సుప్రీంకోర్టు సూచించిన కాలపరిమితిలో ఎస్‌బీఐ నుంచి దాదాపు 1,300 సంస్థలు/వ్యక్తులు రూ.12,000 కోట్లకుపైగా విలువైన బాండ్లను కొనుగోలుచేసి 23 రాజకీయపార్టీలకు తమకు నచ్చిన మొత్తాలను విడివిడిగా విరాళంగా ఇవ్వడం తెల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ బాండ్ల వివరాలన్నింటినీ ఎన్నికల సంఘానికి అందజేసింది.

సొంత గోల్ఫ్ క్లబ్‌లో అవార్డులు... ట్రంప్‌పై బైడెన్ విసుర్లు



వాషింగ్టన్: సొంత గోల్ఫ్ క్లబ్‌లో అవార్డులు సాధించానన్న డొనాల్డ్ ట్రంప్ ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ సరదాగా స్పందించారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ట్రంప్‌కు సొంత 'ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ క్లబ్' ఉంది. అందులో తాజాగా అవార్డుల గోల్ఫ్ ప్రదానం జరిగింది. తనకు 'ది క్లబ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ', 'ది సీనియర్ క్లబ్ మెంబర్‌షిప్ ట్రోఫీ'లు వచ్చాయంటూ సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్ చేశారు. దీనిపై బైడెన్ వ్యంగ్యంగా స్పందించారు. ''అబ్బో! ఎంతటి ఘనతో! అభినందనలు'' అంటూ 'ఎక్స్'లో ఆయన పెట్టిన పోస్ట్‌కు ఏకంగా 1.3 కోట్ల వ్యూస్ వచ్చాయి. ''మీ అజమాయిషీలో లేని ఏదైనా గోల్ఫ్ క్లబ్‌లో ట్రోఫీ గెల్చుకొస్తే చెప్పవయ్యా ట్రంపూ'' అంటూ మాజీ స్పోర్ట్స్ కాలమిస్ట్ రిక్ రేలీ కూడా చురకలు వేశారు. ట్రంప్‌కు ఇలాంటివి కొత్త కాదు. తనకు పలు అవార్డులు వచ్చాయని, పలు సంస్థలు ప్రతిష్టాత్మక పురస్కారాలు ప్రదానం చేశాయని గతంలోనూ పలుమార్లు చెప్పుకున్నారు.

లండన్‌లో రోడ్డు ప్రమాదం.. భారతీయ విద్యార్థిని దుర్మరణం

గతంలో నీతిఆయోగ్ ప్రాజెక్టులో పనిచేసిన చేష్టా కొచ్చర్



లండన్: లండన్‌లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో భారత్‌కు చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని ప్రాణాలు కోల్పోయారు. 33 ఏళ్ల చేష్టా కొచ్చర్ ప్రస్తుతం లండన్‌లోని ప్రతిష్టాత్మక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో బిహేవియరల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. మార్చి 19వ తేదీన లండన్‌లో క్లెర్కెన్‌వెల్ రోడ్డులో వర్సిటీ నుంచి ఇంటికి సైకిల్‌పై తిరుగుపయనమైన ఈమెను ఒక చెత్త ట్రక్కు ఢీకొనడంతో చనిపోయారు. ''ప్రమాద ఘటనాస్థలి నుంచి చెత్త ట్రక్కు డ్రైవర్ పారిపోలేదు. పోలీసు దర్యాప్తునకు సహకరించారు. ఇంకా ఎలాంటి అరెస్టులు చేయలేదు. అసలేం జరిగిందన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రత్యక్ష సాక్షులుంటే సహకరించండి' అని పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేష్టా కొచ్చర్ మరణ వార్తను ఆమె తండ్రి, సెల్యూలార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ వెల్లడించంతో సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. గతంలో తమ సంస్థలో పనిచేయడంతో నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ సైతం స్పందించారు. 'నీతి ఆయోగ్‌లోని లైఫ్‌స్టైల్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్ ప్రాజెక్టులో చేష్టా పనిచేశారు. జీవితంపై ఎంతో స్పష్టత ఉన్న ప్రతిభావంతురాలు, ధైర్యవంతురాలు. చాలా ముందే అందరికీ వీడ్కోలు పలికి వెళ్లిపోయారు' అని అమితాబ్ తన సంతాప సందేశంలో వ్యాఖ్యానించారు. నేషనల్ బిహేవియరల్ ఇన్‌సైట్స్ యూనిట్ ఆఫ్ ఇండియాలో చేష్టా దాదాపు రెండేళ్లు పనిచేశారు.

బరేలీలో పుట్టి అమెరికాలో చదివి..

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో చేష్టా జన్మించారు. తండ్రి సైన్యాధికారి కావడంతో ఢిల్లీసహా దేశంలోని పలు సైనిక పాఠశాల్లో విద్యనభ్యసించారు. అశోకా యూనివర్సిటీ, ఢిల్లీ వర్సిటీలో చదువుకున్నారు. తర్వాత అమెరికా లోని షికాగోలో పీజీ పూర్తిచేశారు. పెన్సిల్వేనియా వర్సిటీలోనూ చదువుకున్నారు. బిహేవియరల్ స్ట్రాటజిస్ట్‌గా పేరొందారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, పొలిటికల్ సైన్సెస్‌లో పూర్తి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాక గత ఏడాది సెప్టెంబర్‌లో అక్కడ చేరారు.

చిల్లి గవ్వలేదు

తిరువళ్లూరు: బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన న్యాయవాది తమిళ్‌మధి తన వద్ద ఎన్నికల ఖర్చులకు గాను రూ.20 వేలు తప్ప మరే ఆస్తులు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 16 గ్రాముల బంగారు నగలు, రెండు బ్యాంకుల్లో కలిపి రూ.1500 నగదు మాత్రమే ఉన్నట్టు వివరించారు.



బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వస్తున్న తమిళ్‌మధి

నామినేషన్ల జాతర

రాష్ట్రంలోని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలుకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పోటెత్తారు. ఆయా కార్యాలయ పరిసరాలు పార్టీల కేడర్లతో జాతరను తలపించేలా కిక్కిరిశాయి. భారీ ఊరేగింపులతో రాజకీయ ఉద్దండులు తరలి వచ్చి నామినేషన్లు సమర్పించారు. అన్నాడీఎంకే అభ్యర్థులందరూ ఒకే సమయంలో నామినేషన్లు దాఖలు చేశారు. మెజారిటీ శాతం డీఎంకే, బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను అధికారులకు అందజేశారు.

- కిటకిటలాడిన ఎన్నికల కార్యాలయాలు
- అన్నాడీఎంకే నామినేషన్లు అన్నీ దాఖలు
- మెజారిటీ శాతం డీఎంకే, బీజేపీ అభ్యర్థులు కూడా సమర్పణ
- ఒకే రోజు 123 దాఖలు
- ఆసక్తికర పరిణామాలు
- పరస్పరం అభ్యర్థులు ఆల్ ది బెస్ట్
- ఉత్తర చెన్నైలో ఉద్రిక్తత



దక్షిణ చెన్నైలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందరరాజన్



దక్షిణ చెన్నైలో నామినేషన్ దాఖలు చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి జయవర్ధన్

సాక్షి, చెన్నై : పుదుచ్చేరితోపాటు రాష్ట్రంలోని 40 లోక్‌సభ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికల నిమిత్తం నామినేషన్ల పర్వం ఈ నెల 20వ తేదీ ప్రారంభమైన విషయం తెలిసిందే. తమిళనాడులోని 39 స్థానాలకు తొలి 3 రోజులు 78 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 95 శాతం నామినేషన్లు స్వతంత్ర అభ్యర్థులే. నామినేషన్ల దాఖలుకు మంగళ, బుధ వారాలు మాత్రమే సమయం ఉంది. దీంతో సోమవారం మంచి ముహూర్తం సైతం ఉండడంతో అభ్యర్థులందరూ ఒకేసారి నామినేషన్ల దాఖలుకు రిటర్నింగ్ కార్యాలయాల వైపు పోటెత్తారు.

ఊరేగింపుల హోరు

డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటములకు చెందిన అభ్యర్థులు, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులు తమ తమ ప్రాంతాల నుంచి ఊరేగింపుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద ఉదయాన్నే పోటెత్తారు. ఆయా కార్యాలయాల్లోకి అభ్యర్థులతోపాటు నలుగురిని మాత్రమే పోలీసులు అనుమతించారు. కార్యాలయాల వెలుపల భారీ భద్రతను పోలీసులు, పారా మిలటరీ బృందాలు కల్పించాయి. ఎన్నికలకు సంబంధించిన ప్రమాణ పత్రాలు, ఇతర డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్లను ఆయా లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అభ్యర్థులు అందజేశారు. అన్నాడీఎంకే అభ్యర్థులు అందరూ ఒకే సమయంలో నామినేషన్లు దాఖలు చేశారు. డీఎంకే, బీజేపీ ఇతర పార్టీలకు చెందిన మెజారిటీ శాతం అభ్యర్థులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. అభ్యర్థుల వెంట మంత్రులు, మాజీ మంత్రులు పలువురు రిటర్నింగ్ కార్యాలయాలకు వెళ్లారు. పలు చోట్ల ఒకే సమయంలో రాజకీయ పార్టీలతో పాటుగా స్వతంత్ర అభ్యర్థులు ఆయా కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. దీంతో ముందుగా వచ్చిన వారికి టోకెన్లను అందజేశారు. దీని ఆధారంగా అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ డిపాజిట్‌గా రూ.10 నాణెం, రూ.5 నాణాలతో చిల్లర్ల మూటను ఎన్నికల అధికారులకు సమర్పించారు. సోమవారం ఒక్క రోజు123 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మొత్తం ఇప్పటి వరకు 201 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మహిళా అభ్యర్థులు 17 మంది ఉన్నారు. పుదుచ్చేరిలో బీజేపీ అభ్యర్థిగా ఆ రాష్ట్ర హోం మంత్రి నమశ్శివాయం నామినేషన్ వేశారు.

నామినేషన్లు వేసిన ప్రముఖులు

చెన్నై దక్షిణం నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందరరాజన్, డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండియన్, అన్నాడీఎంకే అభ్యర్థి జయవర్ధన్ నామినేషన్లు దాఖలు చేశారు. తిరునల్వేలిలో బీజేపీ అభ్యర్థి నయనార్ నాగేంద్రన్, వేలూరులో బీజేపీ అభ్యర్థి, పుదియ నీది కట్చి నేత ఏసీ షణ్ముగం, డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్, శివగంగైలో కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ కార్తీ పి.చిదంబరం, తిరుచ్చిలో ఎండీఎంకే నేత వైగో వారసుడు దురై వయ్యాపురి, రామనాథపురంలో డీఎంకే కూటమి ఐయూఎంఎల్ అభ్యర్థి నవాజ్ ఖని, బీజేపీ కూటమిలో మాజీ సీఎం పన్నీరు సెల్వం, ధర్మపురిలో తన భర్త అన్బుమణి, పార్టీ నేత జీకే మణితో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి పీఎంకే అభ్యర్థిగా సౌమ్య అన్బుమణి రాందాసు నామినేషన్లు సమర్పించారు. నీలగిరిలో కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ బీజేపీ అభ్యర్థిగా, మదురైలో సీపీఎం అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ వెంకటేషన్, సేలంలో డీఎంకే అభ్యర్థిగా మాజీ మంత్రి సెల్వగణపతి, విరుదునగర్‌లో బీజేపీ అభ్యర్థి రాధికా శరత్‌కుమార్, డీఎండీకే అభ్యర్థి విజయప్రభాకరన్, కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్ ఠాకూర్, కృష్ణగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి గోపినాథ్, విల్లుపురంలో వీసీకే ప్రధాన కార్యదర్శి రవికుమార్‌లు ఊరేగింపుగా కూటమి పార్టీల నేతలతో కలిసి రిటర్నింగ్ కార్యాలయాలకు వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు.

ఉత్తర చెన్నై, నీలగిరిలలో రగడ

నామినేషన్ల దాఖలు సమయంలో ఉత్తర చెన్నైలో డీఎంకే, అన్నాడీఎంకే మధ్య, నీలగిరిలో బీజేపీ, అన్నాడీఎంకే మధ్య రగడ చోటు చేసుకుంది. నీలగిరిలో బీజేపీ అభ్యర్థి ఎల్‌మురుగన్, అన్నాడీఎంకే అభ్యర్థి లోకేష్ తమిళ్ సెల్వన్ ఒకే సమయంలో భారీ ఊరేగింపుగా ఎన్నికల అధికారి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా ఎల్.మురుగన్‌ను అధికారులు లోనికి అనుమతించడం వివాదానికి దారి తీసింది. పోలీసులపై అన్నాడీఎంకే వర్గాలు తిరగబడ్డాయి. ఎస్పీ వాహనంపై దాడి చేయడంతో పోలీసులు లాఠీలకు పని పెట్టి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అన్నాడీఎంకే తీరుకు నిరసనగా నీలగిరిలో బీజేపీ అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలో అభ్యర్థి ఎల్.మురుగన్, మద్దతు దారులు ఆందోళనకు దిగారు. ఉత్తర చెన్నైలో అన్నాడీఎంకే, డీఎంకే మధ్య పెద్ద సమరమే నడిచింది. మాజీ మంత్రి జయకుమార్‌తో కలిసి అన్నాడీఎంకే అభ్యర్థి రాయపురం మనో, మంత్రి శేఖర్‌బాబుతో కలిసి డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాస్వామి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి ఒకే సమయంలో వచ్చారు. ఎవరు ముందుగా నామినేషన్ దాఖలు చేయాలన్న అంశం వివాదానికి దారి తీసింది. డీఎంకే వర్గాలు దూసుకెళ్లడంతో, తామేమి తక్కువ తిన్నామా అన్నట్టు అన్నా



ఉత్తర చెన్నైలో వివాదం - పంచాయతీ



కన్యాకుమారిలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి పొన్ రాధాకృష్ణన్



విరుదునగర్‌లో ఊరేగింపుగా నామినేషన్ దాఖలుకు వస్తున్న డీఎండీకే అభ్యర్థి విజయ ప్రభాకరన్



సేలంలో నామినేషన్ దాఖలు చేస్తున్న డీఎంకే అభ్యర్థి సెల్వ గణపతి

డీఎంకే వర్గాలు ఎన్నికల అధికారి ఛాంబర్‌లోకి దూసుకెళ్లాయి. దీంతో గంటన్నర పాటుగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఆగింది. ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో భారీ ఎత్తున బలగాలను మోహరించారు. డీఎంకే, అన్నాడీఎంకే పంచాయతీకి తోడుగా బీజేపీ అభ్యర్థి సైతం తన ఆగ్రహాన్ని ప్రదర్శించడంతో చివరకు వ్యవహారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు వద్దకు చేరింది. ఎవరు ముందు కార్యాలయానికి వచ్చి టోకెన్లు పొందారో వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. దీంతో ముందుగా టోకెన్ పొందిన అన్నాడీఎంకే అభ్యర్థి నామినేషన్‌ను స్వీకరించారు. ఆ తర్వాత డీఎంకే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు.

ఆసక్తికర సన్నివేశాలు

నామినేషన్ల దాఖలు సమయంలో కొన్ని చోట్ల ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దక్షిణ చెన్నైలో నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందరరాజన్, డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండియన్‌లు ఒకర్ని మరొకరు పలకరించుకుంటూ ఆల్‌ది బెస్ట్ చెప్పుకున్నారు. అలాగే ఆలింగనం చేసుకుంటూ పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అనంతరం మీడియాతో తమిళిసై మట్లాడుతూ ప్రధాని మోదీనే మళ్లీ పీఎం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. దక్షిణ చెన్నై నియోజకవర్గ ప్రజలు బాధ్యత కలిగిన వారు అని, మంచి పార్లమెంటేరియన్ కోసం ఎదురు చూస్తున్నట్టు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న ఎంపీ ప్రజలకు అందుబాటులో ఉండరని తమిళచ్చిపై విమర్శలు చేశారు. తాను అందుబాటులో ఉంటానని, ప్రజలలో ఉండేందుకు గవర్నర్ పదవిని కూడా త్యాగం చేసినట్టు పేర్కొన్నారు. విరుదు నగర్‌లో నామి



దక్షిణ చెన్నైలో బీజేపీ - తమిళిసై సౌందరరాజన్, డీఎంకే - తమిళచ్చి తంగపాండియన్ ఆలింగనం

నేషన్ దాఖలు చేసి మాజీ మంత్రి కేటీ రాజేంద్ర బాలాజీతో కలిసి డీఎండీకే అభ్యర్థి , దివంగత నేత విజయకాంత్ వారసుడు విజయ ప్రభాకరన్ బయటకు వచ్చారు. ఈ సమయంలో బీజేపీ నేత, సినీ నటుడు శరత్‌కుమార్, ఆయన సతీమణి, నటి, బీజేపీ అభ్యర్థి రాధికా శరత్‌కుమార్ ఎదురుపడ్డారు. హాయ్ విజయ్ అన్న పలకరింపుతో విజయ ప్రభాకరన్‌కు శరత్‌కుమార్ ఆల్ ది బెస్ట్ చెబుతూ భుజం తట్టి వెళ్లారు. అదే సమయంలో తన ప్రత్యర్థిగా ఉన్న రాధికా శరత్‌కుమార్ వద్ద విజయ ప్రభాకరన్ ఆశీర్వచనం తీసుకునే విధంగా అణుకువగా మెలగుతూ కదిలాడు. ఈ సందర్భంగా మీడియాతో రాధికా శరత్‌కుమార్ మాట్లాడుతూ విజయకాంత్ కుమారుడు తనకు కూడా కుమారుడిలాంటి వాడేనని పేర్కొన్నారు. రామనాథపురంలో ఐయూఎంఎల్ అభ్యర్థి నవాజ్ ఖని, బీజేపీ కూటమిలో పోటీ చేస్తున్న మాజీ సీఎం పన్నీరు సెల్వం పరస్పరం పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. కన్యాకుమారిలో నామినేషన్ వేయడానికి బీజేపీ అభ్యర్థి పొన్ రాధాకృష్ణన్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకునే లోపు రాహుకాలం వచ్చి పడింది. దీంతో గంటన్నరకు పైగా ఆయన ఆ కార్యాలయం ఆవరణలో కూర్చున్నారు. రాహుకాలం సమయం వెళ్లినానంతరం నామినేషన్ దాఖలు చేశారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా స్టాలిన్ ప్రచారం



సాక్షి, చెన్నై: కన్యాకుమారి, తిరునల్వేలి లోక్‌సభ, విలవన్ కోడ్ అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా సోమవారం సీఎం స్టాలిన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాంగునేరిలో జరిగిన బహిరంగ సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ దివంగత నేత వసంతకుమార్ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ వసంత్ ప్రజాసేవలో రాణిస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకే కన్యాకుమారి నుంచి మరోసారి ఆయన్ని గెలిపించాలని కోరారు. ఇటీవల కాలంగా ప్రధాని నరేంద్ర మోదీ కన్యాకుమారి, తిరునల్వేలికి పదే పదే వచ్చి వెళ్లారని గుర్తు చేశారు. తమిళ ప్రజల మీద ప్రేమ ఒలకబోస్తున్నట్టు నటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కనీసం ఇక్కడ వరద బాధితులను ఓదార్చిన పాపాన పోలేదని మండిపడ్డారు. తీవ్ర వరదలను ఎదుర్కొన్న ప్రజలకు కనీసం ఓదార్పు, సాయం అన్నది లేక పోగా, బాధితులను ఆదుకునేందుకు నిధులను కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర నిధులతో ప్రజలను ఆదుకున్నామని, త్వరితగతిన సాధారణ పరిస్థితులు తీసుకొచ్చామని తెలిపారు. వరద విలయం సమయంలో కనిపించకుండాపోయిన బీజేపీ నాయకులు ఇప్పుడు ఓట్ల కోసం మీ వద్దకు వస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పేలా ఓటర్లు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించాలని పిలుపునిచ్చారు. తిరునల్వేలిలో పోటీ చేస్తున్న రాబర్ట్ రూస్, ఉప ఎన్నికల రూపంలో విలవన్ కోడ్‌లో పోటీ చేస్తున్న తారగై టక్కర్‌ను గెలిపించాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందన్నారు. వీరి గెలుపులోనే దేశ ప్రధాని ఎవరన్నది తేలుతుందని, ఇందు కోసం ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు.

మోదీ పాలనను అంతం చేయాలి

- అన్నామలై డిపాజిట్ కోల్పోయేలా చేయాలి
- మాజీ న్యాయమూర్తి హరిపరంధామన్ వ్యాఖ్య



హరిపరంధామన్

కొరుక్కుపేట: మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని మాజీ న్యాయమూర్తి హరిపరంధామన్ కోయంబత్తూరులో మాట్లాడారు. తమిళనాడులో 19న లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయని, డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీతో సహా పలు పార్టీల పొత్తులు పొత్తులు పెట్టుకున్నాయి. నాయకులు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. కోయంబత్తూరు పార్లమెంటరీ డీఎంకే అభ్యర్థి గణపతి రాజ్‌కుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైలు విడివిడిగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో కోయంబత్తూరులో తమిళనాడు ప్రజావేదిక సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితుడిగా హరిపరంధామన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశానికి మోదీ చేసిందేమీ లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. కోయంబత్తూరు విషయానికి వస్తే అన్నామలైని డిపాజిట్లు లేకుండా ఓడించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. సెమినార్‌లో ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణన్ పాల్గొన్నారు.

తపాలా ఓట్లను లెక్కించాల్సిందే


- హైకోర్టు ఆదేశాలు
- కృష్ణగిరి అసెంబ్లీ ఫలితాల్లో ట్విస్ట్



సాక్షి, చెన్నై : కృష్ణగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో నిరాకరణకు గురైన 605 తపాలా ఓట్లను మళ్లీ లెక్కించాల్సిందేనని మద్రాసు హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2012 అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణగిరి నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే అభ్యర్థిగా అశోక్‌కుమార్, డీఎంకే అభ్యర్థిగా సెంగుట్టువన్ పోటీ చేశారు. ఇందులో అశోక్‌కుమార్ 794 ఓట్లతో గెలిచారు. అయితే, ఈ గెలుపును వ్యతిరేకిస్తూ డీఎంకే అభ్యర్థి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికల్లో ఆది నుంచి అవకతవకలు జరిగాయని, తపాల ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ పిటిషన్ విచారణను నిలుపుదల చేయాలని అశోక్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. సెంగుట్టువన్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి ఆషా విచారిస్తూ వచ్చారు. వాదనల అనంతరం సోమవారం న్యాయమూర్తి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితాల లెక్కింపు సమయంలో నిరాకరణకు గురైన 605 తపాలా ఓట్లను మళ్లీ లెక్కించాల్సిందేనని ఆదేశించారు. ఈ ఓట్ల లెక్కింపు హైకోర్టు రిజిస్ట్రార్ నియమించి, ఓ అధికారి పర్యవేక్షణలో, ఎన్నికల కమిషన్‌కు చెందిన మరో ఇద్దరు అధికారుల పర్యవేక్షణలో జరగాలని ఆదేశించారు.

ఆ రెండు పార్టీలకు ఖరారుకాని చిహ్నం!

- వివాదం.. ఎన్నికల కమిషన్‌పై పార్టీల ఆగ్రహం
- బీజేపీ కూటమి అభ్యర్థులకే తొలి ప్రాధాన్యత
- వీసీకే, ఎండీఎంకే విమర్శ
- చిహ్నం మార్పునకు సీమాన్ డిమాండ్



మట్టి కుండ, బొంగరం

సాక్షి, చెన్నై : వీసీకే, ఎండీఎంకేలకు చిహ్నం ఖరారు కాలేదని, కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్య ప్రదసాహూ స్పష్టం చేశారు. రాష్ట్రంలో నామినేషన్ల పర్వం వేగం పుంజుకోవడంతో ఆయా నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియను చెన్నై నుంచి సాహూ పరిశీలించారు. అలాగే, ఎన్నికల ఏర్పాట్లు, వాహన తనిఖీలు ముమ్మరంపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో భాగంగా సోమవారం నామక్కల్‌లో ఓ వాహనంలో రూ.15 కోట్ల విలువగల బంగారం పట్టుబడింది. ఎలాంటి రికార్డులు లేక పోవడంతో వాటిని సీజ్ చేశారు. చెన్నై అడయార్‌లో ఓ వృద్ధురాలు అత్యవసర పని నిమిత్తం రూ.1.50 లక్షలను తీసుకెళుతుండగా అధికారులు సీజ్ చేశారు. ఆమె ఆవేదన వర్ణనాతీతం. ఊటీ పర్యటనకు వచ్చిన పంజాబీ మహిళ వద్ద ఉన్న రూ.60 వేలు నగదును ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. దీంతో ఆ మహిళ తన పిల్లలో పాటుగా కన్నీటి పర్యంతం అవుతూ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. చెన్నై అమింజికరైలో ఓ యువకుడి నుంచి రూ.80 వేలు సీజ్ చేశారు. తిరుచ్చిలో చెన్నైకు చెందిన పారిశ్రామికవేత్త వద్ద రూ. 2 లక్షలు సీజ్ చేశారు. అలాగే, చెన్నై పాడి - మదురవాయిల్ మార్గంలో అధికారులు ఓ కంటైనర్‌ను సీజ్ చేశారు. ఇందులో రూ.కోట్ల నగదు ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. గట్టి భద్రత నడుమ ఈ లారీని అక్కడి ఓ పాఠశాల మైదానానికి తీసుకెళ్లారు. ఇందులో తనిఖీలు చేయగా, బీజేపీకి చెందిన చిహ్నాలు, టోపీలు, టీ షర్టులు ఉండడంతో వాటిని సీజ్ చేశారు.

చిహ్నాల వివాదం

వీసీకే మట్టి కుండ, ఎండీఎంకే బొంగరం చిహ్నంతో గతంలో పోటీ చేస్తూ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సారి కూడా ఈ చిహ్నాల కోసం ఆ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశాయి. న్యాయ పోరాటం సైతం చేస్తున్నాయి. నామినేషన్ల గడువు మరో రోజుతో ముగియనున్నప్పటికీ, తమకు ఇంతవరకు ఆ చిహ్నాలు కేటాయించక పోవడంపై ఆ పార్టీలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. బీజేపీ కూటమిలోని పార్టీలకు మాత్రం స్వతంత్ర చిహ్నాలు ఇప్పటికే కేటాయించారని, తమకు మాత్రం జాప్యం చేస్తున్నారని ఆ పార్టీల నేతలు ఎన్నికల కమిషన్‌పై మండిపడుతున్నాయి. ఇందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి సత్యప్రద సాహూ వివరణ ఇచ్చారు. ఈ రెండు చిహ్నాల కేటాయింపు విషయమై ఇంతవరకు కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి సమాచారం లేదన్నారు. అదే సమయంలో తమకు కేటాయించిన మైక్ చిహ్నాన్ని మార్చాలని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. మర పడవ లేదా, సెయిలింగ్ పడవ చిహ్నాల్లో ఏదో ఒకటి కేటాయించాలని విన్నవించారు.

కారు.. ఇల్లు లేని అభ్యర్థి



డీఎండీకే అభ్యర్థి నల్లతంబి

తిరువళ్లూరు: అన్నాడీఎంకే కూటమి తరపున డీఎండీకే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లతంబి తన ఆస్తులను అఫిడవిట్‌లో పొందుపరిచారు. తన భార్య పేరిట రూ.పది వేలు, తనతో పాటు ఇద్దరు పిల్లల వద్ద రూ.6 వేలు మాత్రమే ఉన్నట్టు వివరించారు. తనకు ఇల్లు, కారు లేదన్న ఆయన, రెండు ద్విచక్ర వాహనాలను ఈఎంఐ ద్వారా కొనుగోలు చేసినట్టు చూపించారు. వీటి విలువ సుమారు రెండు లక్షలు, కాగా భార్య జమున పేరిట 80 గ్రాముల బంగారు నగలతో పాటు రూ.6 లక్షల విలువ చేసే స్థలం మాత్రమే ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపించారు. మొత్తానికి రూ. లక్షల విలువ చేసే ఆస్తులు, రూ.3.02 లక్షల అప్పు ఉన్నట్టు వివరించారు. కాగా 2011వ సంవత్సరంలో ఎగ్మోర్ ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు పని చేసిన నల్లతంబికి కారు, ఇల్లు లేదని, తనకు రూ.30 వేల పింఛన్ మాత్రమే వస్తుందన్నారు.

బీజేపీ అభ్యర్థి ఆస్తులు రూ.2.50 కోట్లు



పొన్‌బాలగణపతి

తిరువళ్లూరు: బీజేపీ అభ్యర్థి పొన్‌బాలగణపతి తన ఆస్తులు రూ.2.50 కోట్లుగా ఎన్నికల అఫడవిట్‌లో పొందుపరిచారు. పొన్‌బాలగణపతికి భార్య మీనాక్షి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మీనాక్షి తిరువళ్లూరు జిల్లా అదనపు ఎస్పీగా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయనకు చరస్థిరాస్తులు సుమారు రూ.1.50 కోట్లు, భార్య పేరిట 1,980 గ్రాముల బంగారు నగలతోపాటు సుమారు రూ.కోటి విలువ చేసే ఆస్తులు ఉన్నట్టు అఫడవిట్‌లో చూపించారు. కారు, ద్విచక్ర వాహనం, వ్యవసాయ భూమి ఉంది. తిరువళ్లూరు, శ్రీ పెరంబదూరు, పరమకుడి, చెన్నైలో ఇంటి స్థలం ఉన్నట్టు చూపించారు. రూ.9 లక్షల మేరకు బ్యాంకుల్లో అప్పు ఉంది.

పన్నీరు అప్పీలు

- పళణికి నోటీసు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే రెండాకుల చిహ్నం, లెటర్ ప్యాడ్, జెండా వాడకంపై మాజీ సీఎం పన్నీరు సెల్వం అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. సింగిల్ బెంచ్ తీర్పును వ్యతిరేకిస్తూ పన్నీరు దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు ద్విసభ్య బెంచ్ సోమవారం నిరాకరించింది. అన్నాడీఎంకే కైవసం కోసం మాజీ సీఎంలు పళణి స్వామి, పన్నీరు సెల్వం మధ్య పెద్ద సమరమే జరుగుతోన్న విషయం తెలిసిందే. న్యాయపోరాటంలో కోర్టు తీర్పులు, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో పళణి స్వామికి అనుకూలంగా మారాయి. దీంతో అన్నాడీఎంకేను పళణి స్వామి పూర్తిగా తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. అదే సమయంలో పార్టీ నుంచి తొలగించినా అన్నాడీఎంకే పేరు, లెటర్ ప్యాడ్, చిహ్నం, జెండాను పన్నీరు సెల్వం ఉపయోగించడాన్ని తీవ్రంగా పరిగణించిన పళణి స్వామి కోర్టును ఆశ్రయించారు. వీటి వాడకంపై నిషేధం విధిస్తూ పన్నీరుకు తొలుత సింగిల్ బెంచ్ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. తదుపరి ద్విసభ్య బెంచ్‌లో, ఆ తదుపరి సుప్రీం కోర్టులో పన్నీరుకు ఈ వ్యవహారంలో చుక్కెదురైంది. చివరకు బంతి సింగిల్ జడ్జి సతీష్‌కుమార్ బెంచ్‌లోకి వచ్చి పడింది. గత వారం తుది తీర్పు వెలువడింది. అన్నాడీఎంకే పేరు, జెండా, చిహ్నం , లెటర్ ప్యాడ్‌ను పన్నీరు సెల్వం శాశ్వతంగా ఉపయోగించేందుకు వీలు లేదని సింగిల్ బెంచ్ తీర్పు చెప్పింది. దీనిని వ్యతిరేకిస్తూ పన్నీరు సెల్వం సోమవారం అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో సింగిల్ బెంచ్ తీర్పునకు స్టే విధించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయ స్థానం స్టే ఇవ్వబోమని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌కు వివరణ ఇవ్వాలని పళణి స్వామికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా వేశారు. ఇంతలోపు ఎన్నికలు ముగియనుండడంతో పన్నీరుకు ఈ వ్యవహారంలో మిగిలింది నిరాశే.

హోలీ.. జాలీ

రాష్ట్రంలో సోమవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్ద అన్న తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఉత్తరాదివాసులు అధికంగా ఉన్న ఉత్తర చెన్నైలో అయితే హోలీ సంబరాలు మిన్నంటాయి.

- ఆనందోత్సాహాలతో పండుగ
- రంగులు చల్లుకుంటూ సంబరాలు

సాక్షి, చెన్నై : దేశంలో హోలీ పర్వదినాన్ని కొన్ని చోట్ల ఆదివారం, మరి కొన్ని చోట్ల సోమవారం నిర్వహించారు. తమిళనాట సోమవారం ఉదయం నుంచి హోలీ వేడుక మిన్నంటాయి. యువతీ, యువకులు, చిన్న పెద్ద అన్న తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఉత్తరాది యువకులు అత్యధికంగా చదువుకుంటున్న కళాశాలల్లో అయితే వేడుకలుమిన్నంటాయి. మిత్రులకు రంగులు పూస్తూ, ఆనంద తాండవం చేశారు. కొన్ని చోట్ల నీళ్లల్లో రంగుల్ని కలిపి చల్లడం, స్ప్రే చేస్తూ ఉరుకలు తీశారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో హోలీ సంబరాలు ఘనంగా జరగ్గా, చెన్నైలో మరింతగా వేడుకగా సాగాయి. ఉత్తరాది వాసులు అత్యధికంగా ఉండే ఉత్తర చెన్నైలో అయితే సంబరాలు అంబరాన్నంటాయి. తమ తమ ప్రాంతాల్లో కుటుంబాలు, బంధుమిత్రులతో కలిసి రంగుల చల్లుకుంటూ ఆనంద తాండవం చేశారు. షావుకారు పేటలో వీధులన్నీ రంగులతో తడిసి ముద్దయ్యాయి. యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ సంబరాల్లో మునిగారు. విదేశీయులు సైతం తరలి వచ్చిరంగుల్ని చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. మింట్, తండయార్ పేట, కొరుక్కుపేట, పెరియ మేడు పరిసరాల్లో ఉత్తరాదివాసులు హోలీ రంగులు చల్లుకోవడమే కాదు, ఆట పాటలతో హోరెత్తించారు. కెమెరాలతో ఫొటోలు తీసుకుంటూ, సెల్ఫీలతో సందడి చేశారు. కొందరు తమకు నచ్చిన వాళ్లను వెంటాడి మరీ రంగులతో ముంచెత్తారు. మరికొన్ని చోట్ల కులమతాలకు అతీతంగా యువకులు తమ మిత్రులతో కలిసి రంగుల్లో మునిగి తేలారు. ఇక చెన్నై శివారుల్లోని కళాశాలల్లో విద్యార్థులు సందడి వాతావరణంలో హోలీ సంబరాల్లో మునిగితేలారు.







చెన్నైలో హోలీ సంబరాల కోలాహలం

క్లుప్తంగా

ఎంపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వంపై కేసు

కొరుక్కుపేట: సిట్టింగ్ ఎంపీ, డీఎంకే ఎంపీ అభ్యర్థి దయానిధి మారన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ సెంట్రల్ చెన్నై ఎంపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వంపై సెక్షన్ 2, 3 కింద పులియంతోపు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చెన్నైలోని పులియంతోపు కేఎల్‌పీలోని అడుక్కుమాడిలో నివశిస్తున్న ఉత్తర రాష్ట్ర ప్రజలకు బీజేపీ సెంట్రల్ చెన్నై అభ్యర్థి వినోజ్ పి.సెల్వం ఎన్నికల ప్రచారం చేశారు. దీనికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలతో మాట్లాడిన ఆయన.. 'ఇక్కడి వారికి 500 రూపాయలు ఇస్తే నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తారు' అని దురుసుగా మాట్లాడారు. అలాగే ఎంపీ దయానిధి మారన్ పైనా అనుచిత వ్యాఖ్యాలు చేయడంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇది సోషల్ మీడియాలోను హల్‌చల్ చేసింది. తదనంతరం 72వ వార్డు డీఎంకే సభ్యుడు న్యాయవాది శరవణన్ తిరువికా నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారికి బీజేపీ అభ్యర్థి వినోజ్ పి సెల్వం ప్రసంగానికి సంబంధించిన వీడియో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై తగు విచారణ చేపట్టాలని పులియంతోపు పోలీసులకు సూచించారు. దీంతో ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వినోజ్ పి.సెల్వంపై పులియంతోపు పోలీసులు 3 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ముగిసిన ఎగ్జిబిషన్

తిరువొత్తియూరు: తమిళనాడు ప్రభుత్వం తరపున ఏటా పర్యాటక, వృత్తి సంబంధిత ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం 48వ పర్యాటక ఎగ్జిబిషన్ చెన్నై ఐలాండ్ గ్రౌండ్లో గత జనవరి 12వ తేదీ ప్రారంభమైంది. తమిళనాడు పర్యాటక అభివృద్ధి మండలి ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌ను 51 హాలులో ఏర్పాటు చేశారు. ఈ హాలులో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, చేతి వృత్తుల వారు తయారు చేసిన వస్తువులు తదితర 32కు పైగా క్రీడా సాధనాలు, క్రీడా వస్తువులు ఆధునిక వస్తువులను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సంగీత కార్యక్రమాలు ఒక పక్కన నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో 70 రోజులు జరిగిన ఈ ఎగ్జిబిషన్‌ను 5.86 లక్షల మంది సందర్శించారు. వీరిలో 4,91,361 మంది పెద్దలు కాగా, 94,636 మంది చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు ప్రారంభం

సాక్షి, చెన్నై: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. మగళవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. పుదుచ్చేరితోపాటుగా రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షను 12వేలకు పైగా ఉన్న పాఠశాలలకు చెందిన 9 లక్షల 10 వేల మంది విద్యార్థులు రాయడానికి సిద్ధంగా ఉన్నారు. 4107 కేంద్రాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటలకు వరకు పరీక్షలు జరుగుతాయి. తొలి రోజు లాంగ్వేజ్, 28వ తేదీన ఆంగ్లం, ఏప్రిల్ ఒకటో తేదీన గణితం, ఏప్రిల్ 4వ తేదీన ఆప్షనల్ లాంగ్వేజ్, ఏప్రిల్ 6వ తేదీన సైన్స్, 8వ తేదీన సోషియల్ సైన్స్ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు మధ్య ఒకటి రెండు రోజులు విరామం ఉండడం విద్యార్థులకు కలిసి వచ్చే అంశం. ప్రస్తుతం ఎన్నికల వేళ కావడంతో అభ్యర్థుల ప్రచారాలు హోరెత్తే సమయంలో పబ్లిక్ పరీక్ష జరగనున్నది. దీంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లుపై దృష్టి పెట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి ఎన్నికల ప్రచారాలు, సభలు నిర్వహించేందుకు వీలు లేదన్న ఆదేశాలు ఇప్పటికే జారీ అయ్యాయి.



పరీక్ష జరిగే సమయంలో ఆయా కేంద్రాలవైపుగా ప్రచారాలకు అనుమతి లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాలలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక ఈ పరీక్షల కోసం విద్యా శాఖ సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను మంజూరు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తీవ్ర కట్టుబాట్లు విధించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా విద్యార్థులపై నిఘా ఉంచేందుకు 3100 సిట్టింగ్ స్క్వాడ్‌లు, మరో మూడు వేల మందితో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించారు. 46 వేల మంది ఉపాధ్యాయులు పరీక్షల విధులకు హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటల్లోపు ఆయా కేంద్రాల వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. తనిఖీలు అనంతరం 9.30 గంటలకు ఆయా పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులల్లో పరీక్షలపై భయాన్ని పోగొట్టే విధంగా ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల నిర్వహణకు సైతం ఏర్పాట్లు చేశారు. పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి ఆందోళన, భయం అన్నది లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

లోక్‌సభ సమరంలో అక్కాతమ్ముడు

- వేర్వేరు పార్టీలు... వేర్వేరు స్థానాల్లో పోటీ

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికలలో అక్కాతమ్ముడు పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరూ వేర్వురు పార్టీల అభ్యర్థులుగా వేర్వేరు నియోజకవర్గాలలో పోటీ చేస్తున్నారు. ఒకరేమో డీఎంకే కూటమిలోని జాతీయ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి కాగా, మరొకరు జాతీయ పార్టీ బీజేపీ కూటమిలోని పీఎంకే అభ్యర్థి కావడం గమనార్హం.

ధర్మపురి లోక్ సభ సీటను పీఎంకేకు బీజేపీ అప్పగించిన విషయం తెలిసిందే. తొలుత ఈ స్థానానికి అభ్యర్థిగా అరసాంగరాన్ని ప్రకటించారు. ఇక్కడ పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి పోటీ చేస్తారని అందరూ ఎదురు చూశారు. ఆయనే పోటీ చేయాలన్న నినాదం మిన్నంటడంతో అభ్యర్థిని మార్చేశారు. అన్బుమణికి బదులుగా ఆయన సతీమణి సౌమ్య అన్బుమణి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. అదే సమయంలో సౌమ్య అన్బుమణి సోదరుడు విష్ణుప్రసాద్ సైతం లోక్‌సభ ఎన్నికలలో కడలూరు నుంచి పోటీ చేస్తుండడంతో అందరి దృష్టి ఈ అక్కాతమ్ముడిపై పడింది.



సౌమ్య



విష్ణు ప్రసాద్

ఇదీ బంధుత్వం

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ అధ్యక్షుడు కృష్ణస్వామి కుమార్తె సౌమ్య, కుమారుడు విష్ణుప్రసాద్. పీఎంకే అధినేత రాందాసు తనయుడు అన్బుమణికి గతంలో కుమార్తె సౌమ్యను ఇచ్చి కృష్ణస్వామి వివాహం చేశారు. దీంతో భర్త అడుగు జాడలలో పీఎంకే బలోపేతం కోసం సౌమ్య, తండ్రికి వారసుడిగా కాంగ్రెస్ రాజకీయాలలో విష్ణు ప్రసాద్ రాణిస్తూ వస్తున్నారు. ఇప్పటికే విష్ణు ప్రసాద్ రాజకీయాలలో తన అక్క కన్నా సీనియర్. గతంలో ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా కూడా ఉన్నారు. కడలూరు నుంచి మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు.

అదే సమయంలో అనూహ్యంగా అన్బుమణి సతీమణి సౌమ్య సైతం ఈసారి ధర్మపురి నుంచి పీఎంకే అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు వేర్వేరు పార్టీలతో ఎన్నికల కదనరంగంలో ఉండడంతో గెలిచేదెవరో అన్న ఉత్కంఠ తప్పడం లేదు. అక్కకు పోటీగా ధర్మపురిలో డీఎంకే అభ్యర్థి మణి, తమ్ముడికి పోటీగా కడలూరులో పీఎంకే అభ్యర్థి సినీ దర్శకుడు తంగర్ బచ్చన్ ఉండడం గమనార్హం.

వంద శాతం పోలింగ్‌పై అవగాహన



శ్రీపెరంబదూరులో వంద శాతం పోలింగ్‌పై అవగాహన ర్యాలీ

కాంచీపురం(పళ్లిపట్టు): వంద శాతం పోలింగ్‌కు సంబంధించి కాంచీపురం జిల్లా యంత్రాంగం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీపెరంబదూరులో ఆర్డీఓ శరవణకన్నన్ ఆధ్వర్యంలో సిప్కాట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వంద శాతం పోలింగ్‌కు సంబంధించి సోమవారం అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడంపై కరపత్రాలు పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగానికి సంబంధించి అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వయం సహాయక మహిళా బృందాల ద్వారా వంద శాతం పోలింగ్‌కు సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల ప్రకటనలు, పోస్టర్లు తొలగింపు

అన్నానగర్: వచ్చే నెల 19న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల తేదీ ప్రకటనతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, ఎన్నికలకు సంబంధించిన ఫొటోలు, పోస్టర్లను తొలగించడానికి భారత ఎన్నికల సంఘం నిర్దిష్ట సమయాన్ని ప్రకటించింది. దాని ఆధారంగా ప్రభుత్వ రంగ భవనాలు, ప్రభుత్వ స్థలాలు, ప్రైవేట్ భవనాల గోడలపై అతికించిన పోస్టర్లు, పెయింటింగ్‌లు, జెండాలను నిర్ణీత గడువులోగా తొలగించాలని ఎన్నికల అధికారులు ఆదేశించింది. ఇలా చెన్నై జిల్లాలో మూడు పార్లమెంట్ నియోజకవర్గాలలో ప్రభుత్వ భవనాలు, పబ్లిక్ వాల్ పెయింటింగ్స్ 61,694 ఉండగా, 12,063 పోస్టర్లు, 540 బ్యానర్లు, 1138 ఇతర పోస్టర్లు అంటూ మొత్తం 75 వేల 435 ఎన్నికల పోస్టర్లను, ప్రకటనలను తొలగించారు. అదేవిధంగా ప్రైవేట్ ఆస్తి వాల్ పెయింటింగ్స్ 5 వేల 616 కాగా, 7 వేల 13 పోస్టర్‌లు, 578 బ్యానర్‌లు, 956 ఇతరాలు కలిపి మొత్తం 14,163 ఎన్నికల ప్రకటనలు, ఎన్నికల సిబ్బంది పోస్టర్లను ధ్వంసం చేశారు. ప్రభుత్వం, ప్రైవేట్ భవనాలుగా ఇప్పటి వరకు 89 వేలు 598 ఎన్నికల ప్రకటనలు, పోస్టర్ల తొలగించినట్లు చెన్నై కార్పొరేషన్ వెల్లడించింది.

రాష్ట్రంలో మండుతున్న ఎండలు

- మరో 4రోజుల్లో 5 డిగ్రీలు పెంపు
- వాతావరణ కేంద్రం హెచ్చరిక



కొరుక్కుపేట: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. భానుడి ప్రతాపంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఈక్రమంలో రానున్న 4 రోజులపాటు ఉష్ణోగ్రత క్రమంగా 5 డిగ్రీలు వరకు పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తమిళనాడులో వేసవి కాలం ప్రారంభం కావడంతో రాష్ట్రంతోపాటు పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లో వేడి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వేడి తీవ్రతతో పగటిపూట ప్రజలు బయటకు వెళ్లలేని స్థాయిలో వేడి పెరిగింది. ఇళ్లలో ఏసీ లేకుండా జీవించడం అసాధ్యంగా మారింది. మరో 4 రోజులపాటు వేడిమి తట్టుకోలేనంతగా ఉధృతంగా పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. గత 24 గంటల్లో తమిళనాడులో పలుచోట్ల వర్షాలు కురిశాయి. పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లో పొడి వాతావ రణం నెలకొంది. ప్రత్యేకంగా చెన్నై జోనల్ వాతావరణ కేంద్రం ప్రకారం సేలంలో గరిష్ట ఉష్ణోగ్రత 101.6 ఫారన్‌హీట్‌గా నమోదైంది. ఇదిలా ఉండగా సోమ వారం నుంచి ఈ నెల 30 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో ఈ నెల 28వ తేదీ వరకు, రాష్ట్రంలో ఒకటిరెండు చోట్ల గరిష్ట ఉష్ణోగ్రత వచ్చే 4 రోజులపాటు క్రమంగా 5 డిగ్రీల సెల్సియస్ పెరగవచ్చు. అధిక ఉష్ణో గ్రత, అధిక తేమ ఉన్నప్పుడు, ఒకటి, రెండు చోట్ల అసౌకర్యం ఏర్పడవచ్చని కూడా తెలియజేసింది.

మళ్లీ కలుస్తున్నారా?



నటుడు ధనుష్, ఇళయరాజా, కమలహాసన్

తమిళసినిమా: సినిమా రంగంలో ఏదైనా జరగవచ్చు. భారతీయ సినిమాకు నటుడు కమలహాసన్, రజనీకాంత్ రెండు మూల స్తంభాలు అని ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అలాంటి ఈ లెజెండ్రీ నటులు ఆరంభంలో పలు చిత్రాల్లో కలిసి నటించిన విషయం విదితమే. వాటిలో 90 శాతానికి పైగా ప్రేక్షకులను మెప్పించి, వసూళ్ల వర్షం కురిపించినవే. కమలహాసన్, రజనీకాంత్ చివరిగా స్క్రీన్ షేర్ చేసుకున్న చిత్రం తిల్లు ముల్లు. 1981లో విడుదలైన ఈ చిత్రంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటించగా కమలహాసన్ క్యామియో పాత్రలో మెరిశారు. అదే విధంగా పలు హిందీ చిత్రాల్లోనూ కలిసి నటించారు. సుమారు 40 ఏళ్ల తరువాత వీరిద్దరూ ఒక చిత్రంలో నటించబోతున్నట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే వీరు హీరోలుగా మాత్రం కాదు. ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా జీవిత చరిత్ర చిత్రంగా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇందులో ఇళయరాజా పాత్రను నటుడు ధనుష్ పోషిస్తున్నారు. దీనికి కెప్టెన్ మిల్లర్ చిత్రం ఫేమ్ అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, పరిచయ కార్యక్రయం ఇటవల చెన్నైలో జరిగింది కూడా. ఇక అసలు విషయం ఏమిటంటే ఈ క్రేజీ చిత్రంలో నటుడు కమలహాసన్, రజనీకాంత్ అతిథి పాత్రల్లో మెరవబోతున్నారన్నది తాజా సమాచారం. ఇళయరాజాకు కమలహాసన్, రజనీకాంత్‌లతో మంచి స్నేహ సంబంధాలు ఉన్న విషయం తెలిసిందే. వీరి నటించిన పలు చిత్రాలకు ఇళయరాజా సంగీతాన్ని అందించారు. 1980, 90 ప్రాంతాల్లో వీరి కాంబినేషన్‌లో పలు సూపర్‌హిట్ పాటలు రూపొందాయి. కాగా ఇళయరాజా బయోపిక్‌లో అతిథి పాత్రలో నటించడానికి కమలహాసన్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇక రజనీకాంత్ కూడా నటించడానికి నో చెప్పరనే భావన వ్యక్తం అవుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాలంటే మరి కొద్ది రోజులు ఆగాల్సిందే.

కోలీవుడ్ టాక్స్

వరుస కడుతున్న జీవీ చిత్రాలు



డియర్ చిత్రంలో జీవీ, ఐశ్వర్యరాజేశ్

తమిళసినిమా: జీవీ ప్రకాశ్‌కుమార్ సినిమానే శ్వాసగా జీవిస్తున్నారా అని అనిపించకమానదు. ఒక పక్క సంగీత దర్శకుడిగా భారీ చిత్రాలు చేస్తున్న ఈయన మరో పక్క కథానాయకుడిగానూ వరుసగా చిత్రాలు చేస్తున్నారు. ఈయన కథానాయకుడిగా నటించిన రెబల్ చిత్రం గత శుక్రవారం తెరపైకి వచ్చింది. ఏప్రిల్ 4వ తేదీన కల్వన్ చిత్రం విడుదల కానుంది. జీవీ ప్రకాశ్‌కుమార్ హీరోగా నటించిన ఇందులో నటి ఇవానా హీరోయిన్‌గా నటించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా ప్రధాన పాత్రను పోషించిన ఈ చిత్రాన్ని యాక్సెస్ ఫిలిం ఫ్యాక్టరీ పతాకంపై ఢిల్లీబాబు నిర్మించారు. పీవీ శంకర్ దర్శకత్వం వహించిన కల్వన్ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తదుపరి జీవీ నటించిన మరో చిత్రం డియర్. సేతువుమ్ ఆయిరం పెన్ చిత్రం ఫేమ్ ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నటి ఐశ్వర్య రాజేశ్ నాయకిగా నటించారు. వీరిద్దరూ కలిసి నటించిన తొలి చిత్రం ఇది అన్నది గమనార్హం. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం పలు ఆసక్తికరమైన అంశాలతో రూపొందింది. ముఖ్యంగా భార్య గురక కారణంగా భర్త పడే అవస్థలతో డియర్ చిత్రం ఉంటుందని సమాచారం. ఈ చిత్రం ఏప్రిల్ 11వ తేదీన తెరపైకి రానుంది. ఇలా జీవీ ప్రకాశ్‌కుమార్ నటించిన చిత్రాలు తెరపైకి రానుండడంతో ఆయన అభిమానులు ఖుషీ అవుతున్నారు.

దర్శకుడిగా ఛాయాగ్రాహకుడు



ఛాయాగ్రహకుడు ఓం ప్రకాశ్, నటుడు ధనుష్

తమిళసినిమా: సినిమా చాలా పాఠాలు నేర్పుతుంది. అందులో మంచి ఉంటుంది, చెడూ ఉంటుంది. ఇక సినిమా ద్వారా చాలా నేర్చుకున్నవారూ ఉన్నారు. అలాంటి వారిలో ఛాయాగ్రహకుడు ఓం ప్రకాశ్ ఒకరు. ఈయన తమిళంలో కళవాణి, నాణయం, అనేగన్, మారి, నీదానే ఎన్ పొన్‌వసంతం, తిరుచిత్రఫలం తదితర చిత్రాలకు ఛాయాగ్రహకుడిగా పని చేశారు. తమిళ చిత్ర పరిశ్రమలో ప్రముఖ ఛాయాగ్రహకుడిగా రాణిస్తున్న ఈయన తెలుగు, హిందీ, మలయాళం భాషా చిత్రాలకు ఛాయాగ్రహకుడిగా పని చేశారు. ఛాయాగ్రహకుడిగా 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఈయన సుమారు 500 చిత్రాలకు పని చేశారు. తాజాగా ఓం ప్రకాశ్ మెగాఫోన్ పట్టడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈయన నటుడు ధనుష్ కథానాయకుడిగా ఒక చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నారని సమాచారం. మరో విశేషం ఏమిటంటే దీనికి నటుడు ధనుషే కథను సిద్ధం చేస్తున్నట్లు, ఆయనే తన వండర్‌బార్ ఫిలింస్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పూర్తి వివరాలతో త్వరలో వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం తన 50వ చిత్రాన్ని పూర్తి చేసిన ధనుష్ తన సోదరి కొడుకును హీరోగా పరిచయం చేస్తూ నిలావుక్కు ఎన్ ఎన్‌మేల్ కోపం అనే చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తూ కీలక పాత్రలో నటిస్తున్నారు. అదే విధంగా సంగీత దర్శకుడు ఇళయరాజా బయోపిక్‌లో నటించడానికి సిద్ధం అవుతున్నారు. వీటి తరువాత ఓం ప్రకాశ్ దర్శకత్వంలో చిత్రాన్ని చేసే అవకాశం ఉంది.

జీనీ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల





జీనీ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్



నటి కల్యాణి ప్రియదర్శన్

తమిళసినిమా: పొన్నియన్ సెల్వన్ చిత్రం తరువాత జయం రవి కథానాయకుడిగా నటించిన చిత్రాలేవీ ఆశించిన విజయాలు సాధించలేదు. దీంతో ఈయనకు అర్జెంట్‌గా ఒక హిట్ అవసరం. దాన్ని జీనీ చిత్రం తీరుస్తుందని భావించవచ్చు. జయాపజయాలకు అతీతంగా చిత్రాలను చేసుకుంటూ పోతున్న నటుడు జయంరవి. ఈయన తాజాగా నటిస్తున్న చిత్రం జీనీ. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేశ్ నిర్మిస్తున్న భారీ చిత్రం ఇది. ఈ చిత్రం ద్వారా అర్జునన్ అనే నవ దర్శకుడు పరిచయం అవుతున్నారు. ఈయన దర్శకుడు మిష్కిన్ శిష్యుడన్నది గమనార్హం. జయం రవికి ఇది 35వ చిత్రం అవుతుంది. ఇందులో ఆయనకు జంటగా నటి కల్యాణి ప్రియదర్శన్, కృతిశెట్టి, వామిక దీపక్ నాయికలుగా నటిస్తున్నారు. ఏఆర్ రెహ్మాన్ సంగీతాన్ని, మహేశ్ ముత్తుస్వామి ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జయంరవి ఆలీబాబా భూతం తరహాలో ఉన్నారు. ఆయన చుట్టూ బంగారు నాణేలు, డబ్బు నోట్లు, తెగిన చైన్లు, తినుబండారాలు ఉండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు నిర్మాతల వర్గం పేర్కొంది. దీని తరువాత జయం రవి తనీ ఒరువన్-2, అధర్వ తదితర చిత్రాల్లో నటించనున్నారు.

గ్లామర్‌కు గ్రీన్ సిగ్నల్?



ప్రియాంక మోహన్

తమిళసినిమా: గ్లామర్ లేనిదే సినిమా లేదు అని చెప్పవచ్చు. ఇక చాలా మంది ఈతరం హీరోయిన్లు గ్లామర్‌ను నమ్ముకునే గడిపేస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. నటనకు అవకాశం ఉన్న పాత్రలకే తమ ప్రాధాన్యం అంటుంటారు. అయితే నటించేది మాత్రం గ్లామరస్ పాత్రల్లోనే. తాజాగా నటి ప్రియాంక మోహన్ కూడా ఇదే బాట పట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కన్నడ భామ మాతృభాషలో ఒకటి రెండు చిత్రాలు చేసిన తరువాత టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అక్కడ నాని సరసన నానీస్ గ్యాంగ్ లీడర్ చిత్రంలో నటించింది. అందులోనూ పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సంపాదించుకుంది. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోవడంతో ఈ అమ్మడిని అక్కడ పట్టించుకోలేదు. దీంతో కోలీవుడ్‌పై దృష్టి సారించింది. ఇక్కడ శివకార్తికేయన్‌కు జంటగా డాక్టర్ చిత్రంలో నటించే అవకాశం వరించింది. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించడంతోపాటు ప్రియాంక మోహన్‌కు గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ చిత్రం హిట్‌తో శివకార్తికేయన్‌తో మరోసారి డాన్ చిత్రంలో రొమాన్స్ చేసే అవకాశం వరించింది. ఈ చిత్రం సూపర్‌హిట్ అయ్యింది. అలా పాపులరైన ప్రియాంక మోహన్‌కు స్టార్ నటుడు సూర్యతో జతకట్టే అవకాశం వచ్చింది. ఆయనతో ఎదర్కుమ్ తుణిందవన్ చిత్రంలో నటించింది. ఆ చిత్రం పెద్దగా ఆడలేదు. విశేషం ఏమిటంటే ఈ చిత్రాలన్నింటిలోనూ ఈ అమ్మడు హోమ్లీ పాత్రల్లోనే కనిపించింది. దీంతో అలాంటి ఇమేజ్‌కు పరిమితమైంది. అలాంటిది ఇటీవల ధనుష్ సరసన నటించిన కెప్టెన్ మిల్లర్ చిత్రంలో ఒక సామాజిక బాధ్యత కలిగిన పాత్రలో నటించి పేరు తెచ్చుకుంది. తాజాగా రెండు తమిళ చిత్రాలు, ఒక తెలుగు చిత్రం ఈ బ్యూటీ చేతిలో ఉన్నాయి. వాటిలో ఒకటి జయం రవికి జంటగా నటిస్తున్న బ్రదర్ చిత్రం. మరొకటి డాన్స్ మాస్టర్ నెల్సన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తోంది. ఇకపోతే చాలా గ్యాప్ తరువాత తెలుగులో పవన్‌కల్యాణ్‌తో జత కట్టే అవకాశాన్ని పొందినట్లు సమాచారం. కాగా ఇప్పటి వరకూ ఒక లెక్క, ఇకపై ఒక లెక్క అన్నట్లుగా ప్రియాంక మోహన్ గ్లామర్ గోదాలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ప్రత్యేకంగా ఫొటో షూట్ చేసుకుని దిగిన గ్లామరస్ ఫొటోలను సామాజిక మాధ్యమాలకు విడుదల చేస్తోంది. అలా తాజాగా బెడ్ రూమ్‌లో ఫొటో షూట్ చేసుకున్న గ్లామరస్ చిత్రాలను సామాజిక మాధ్యమాలకు విడుదల చేసింది. అవి ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇవి గ్లామర్ పాత్రలకు గ్రీన్ సిగ్నలా అంటూ నెటిజన్లు ప్రశ్నలు గుప్పిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే ఇప్పుడు చాలా మంది హీరోయిన్లు తమ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్లను పెంచుకోవడానికి ఇలాంటి గ్లామరస్ ఫొటోలను పోస్ట్ చేస్తున్నారు. వీటి వల్ల కూడా ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. నటి ప్రియాంక మోహన్ గ్లామరస్ ఫొటో లకు ఇది కూడా ఒక కారణం అయ్యింటుందనేది ట్రోల్ అవుతోంది.

క్లుప్తంగా

ఊపిరాడక ముగ్గురు భక్తులు మృతి

అన్నానగర్: వెల్లింగిరి పర్వతం ఎక్కుతుండగా ఆదివారం రాత్రి ఊపిరాడక ముగ్గురు భక్తులు మృతి చెందారు. కోయంబత్తూరు సమీపంలోని పుండి వెల్లింగిరి కొండ దర్శనానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చి శివుడిని దర్శించుకుంటారు. ఈ క్రమంలో పంగుణి ఉత్తరం సందర్భంగా ఆదివారం రాత్రి కొండ ఎక్కిన సేలంకి చెందిన త్యాగరాజన్(35) సోమవారం ఉదయం ఊపిరాడక మృతి చెందాడు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన సుబ్బారావు(40), తేనికి చెందిన పాండియన్(40) స్పృహ తప్పి కింద పడ్డారు. అంబులెన్స్‌లో సిద్ధంగా ఉన్న వైద్యుడు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బాలుడిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: తేని జిల్లా, ఆండిపట్టి సమీపంలోని తెప్పంబట్టి ఇందిరా కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలుడు అదే ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని మాయ మాటలతో చనువుగా ఉంటూ వచ్చాడు. బాలిక 7వ తరగతి చదువుతోంది. బాలిక ఆరోగ్యం దెబ్బతింది. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో కుమార్తెను చికిత్స నిమిత్తం తేని కె.వి లక్కు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెను పరీక్షించినప్పుడు ఆమె 6 నెలల గర్భవతి అని తెలిసింది. అనంతరం విచారణలో బాలుడు తనపై అత్యాచారం చేశాడని బాలిక చెప్పింది. దిగ్భ్రాంతి చెందిన బాలిక తల్లి ఆండిపట్టి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై పోక్సో చట్టం కింద ఇన్‌స్పెక్టర్ శరవణకుమార్ కేసు నమోదు చేసి, జువైనల్ హోంకు తరలించారు.

మహిళా పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: తూత్తుక్కుడి స్పిక్‌నగర్‌కు చెందిన హరిప్రియ(28) ఈమె తూత్తుక్కుడి సాయుధ దళంలో పోలీసు అధికారిగా పనిచేస్తుంది. ఆమెకి అప్పటికే వివాహమై విడాకులు కాగా, 6 నెలల క్రితం విలాత్తికులం సమీపంలోని వెంబర్‌కు చెందిన ధోనీ జెనిత్‌తో రెండో వివాహం చేసుకుంది. ఆ తర్వాత వారు తూత్తుకుడిలోని 3వ మైలు ప్రాంతంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ పోలీస్ క్వార్టర్స్‌లో నివశించేవారు. గత ఏడాది మదురైలో జరిగిన మహిళా కమాండో శిక్షణ శిబిరంలో హరిప్రియకు, మరో పోలీసుకు మధ్య ఎఫైర్ ఉందని, ఈ విషయమై కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో హరిప్రియ సోమవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు హరిప్రియ ఆత్మహత్యకు గల కారణాలపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

రాయపురంలో ఐఫోన్లు స్వాధీనం

అన్నానగర్: చెన్నైలోని రాయపురంలోని ఏఆర్‌డీ ఫ్లెట్లైవర్ సమీపంలో సోమవారం వేకువజామున ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అరుణ్ కెన్నెడీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనంతరం అటుగా వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేశారు. ఆ ఆటోలో వచ్చిన యువకుడి వద్ద 2 అట్టపెట్టెలు ఉన్నాయి. దానిని వేరుగా తీసుకున్నప్పుడు, అక్కడ ఐఫోన్లు ఉన్నాయి. విచారణలో అతడు తిరుచ్చి జిల్లాకు చెందిన అజాన్(30) అని తేలింది. పారిమునలోని బర్మా బజార్ దుకాణాల్లో ఐఫోన్లను విక్రయించేందుకు రాయపురంలోని బంధువుల ఇంటికి వచ్చానని చెప్పాడు. కానీ అతని వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో అతని వద్ద నుంచి రూ.18 లక్షల విలువైన 12 ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పాత ఇనుప దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

అన్నానగర్: చెన్నై సమీపం మాధవరంలోని కేపీ గార్డెన్ పోస్ట్ బాక్స్ ప్రాంతానికి చెందిన బాలదదాయుధపాణి(50) కొడుంగైయూర్ రుక్కంచేరి హైవేపై ఓ పాత ఇనుప దుకాణం నడుపుతున్నాడు. పాత ఇనుము, ప్లాస్టిక్ ఉత్పత్తులను కొని, విక్రయిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఈ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనిపై సమాచారం అందుకున్న సెంపియం, ఎస్.ఎం.నగర్, వ్యాసర్‌పాడి అగ్నిమాపక కేంద్రాల నుంచి 3 అగ్నిమాపక వాహనాల్లో 20 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గంటల తరబడి పని చేసి మంటలను ఆర్పారు. అయితే మంటల్లో షాపులోని లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని తెలుస్తోంది. కొడుంగయూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్పుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

అన్నానగర్: తిరుప్పత్తూరు జిల్లా పుంగపట్టునాడు సమీపంలోని పోలూరు గ్రామానికి చెందిన గోపి(22), అరుణగిరి (23) వీరిద్దరూ స్నేహితులు. రాత్రి సమయంలో అక్కడ ఉన్న అడవికి వెళ్లి తుపాకులతో అడవి జంతువులను, పక్షులను వేటాడుతున్నట్లు తెలుస్తుంది. ఈ స్థితిలో ఆదివారం రాత్రి ఇద్దరూ వేటకు వెళ్లేముందు తమ రివాల్వర్‌లో బుల్లెట్లు నింపారు. అప్పుడు అనుకోకుండా నాటు తుపాకి ట్రిగ్గర్ నొక్కినప్పుడు, బారెల్ నుండి షెల్ వచ్చేసింది. ఇందులో గోపి, అరుణగిరిలకు బుల్లెట్లు తగలగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన చుట్టుపక్కల వారు ఇద్దరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి తీవ్ర చికిత్స అందిస్తున్నారు.

మురుగన్ ఆలయంలో పంగుణి ఉత్సవం



తిరుత్తణి కొండ ఆలయంలో కావళ్లతో భక్తుల సందడి



అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తజనం



ఉత్సవర్లకు పాలాభిషేకం

- నెమలి కావళ్లు, పాలబిందెలతో భక్తుల మొక్కులు
- ఉత్సవర్లకు అభిషేక ఆరాధన

తిరుత్తణి: పంగుణి ఉత్సవం సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం సందడి నెలకొంది. భక్తులు నెమలి కావళ్లు, పాల బిందెలతో కొండకు చేరుకుని స్వామివారి అభిషేక పూజల్లో పాల్గొని, మొక్కులు చెల్లించారు. తమిళ మాసం పంగుణి నెలలో సాక్షాత్తు మురుగన్ దేవసేన, పార్వతి పరమేశ్వరుడు, సీతారాముల కల్యాణోత్సవాలు జరిగినట్లు, ఈ కాలంలో స్వామి వారిని దర్శించుకుంటే శుభం జరుగుతుందనే నమ్మకంతో తిరుత్తణి ఆలయంలో పంగుణి ఉత్సవం వేడుకగా నిర్వహించడం పరిపాటి. వేకువజామున మూలవర్లకు అభిషేక ఆరాధన పూజలు చేపట్టారు. చెన్నై పరిసర ప్రాంతాల నుంచి భక్తులు బృందాలుగా తిరుత్తణి కొండ ఆలయం చేరుకున్నారు. చెన్నై మన్నడి తిరుత్తణి మురుగన్ పాదయాత్ర బృందం అధ్యక్షుడు చిన్నకరుప్పన్ నేతృత్వంలో 250 పాల బిందెలు, 90 నెమలి కావళ్లతో కొండ ఆలయ మెట్ల మార్గంలో కొండ పైకి చేరుకుని కావడి మండపంలో ఉత్సవమూర్తికి పాలు, పెరుగు, తాటిబెల్లం, పంచామృతం సహా వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేక ఆరాధన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హరోంహర నామస్మరణతో స్వామిని దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా కొండపైకి భారీ సంఖ్యలో చేరుకున్న భక్తులు మూడు గంటల పాటు క్యూలైన్‌లలో వేచివుండి స్వామి దర్శనం చేసుకుని, తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ఆలయ చైర్మన్ శ్రీధరన్, ట్రస్టు బోర్డు సభ్యులు సురేష్‌బాబు, నాగన్, ఉషారవి, మోహనన్ తదితరుల బృందం వేడుకల ఏర్పాట్లు చేపట్టారు.

క్రికెట్ ఆడుతూ వ్యక్తి మృతి

అన్నానగర్: చెన్నైలోని మైలాపూర్‌కు చెందిన కార్తీక్ (30) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి కార్తీక్ ఎప్పటిలాగే పనికి వెళ్లాడు. సోమవారం ఉదయం పని ముగించుకుని సోమంగళం సమీపంలోని తార్కాస్ ప్రాంతంలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లాడు. రాత్రంతా నిద్రపట్టక, ఎండలో క్రికెట్ ఆడిన కార్తీక్ ఒక్కసారిగా స్పృహతప్పి పడ్డాడు. వెంటనే అతడి స్నేహితులు ఆటోలో తాంబరంలోని ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. కార్తీక్‌ని వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో అతడి స్నేహితులు షాక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న సోమంగళం పోలీసులు కార్తీక్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మహిళ..

అన్నానగర్: చెన్నైలోని కీల్పాక్కం, పుల్లాపురం ప్రాంతానికి చెందిన సెంథిల్ కుమార్ భార్య రేణుక(58) అన్నానగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో క్లీనర్‌గా పనిచేస్తోంది. ఈమె ఆదివారం చేత్‌పట్టు రైల్వే స్టేషన్ సమీపంలోని కుమారుడి ఇంటికి బయల్దేరింది. మార్గం మధ్యలో ఎగ్మూర్ వద్ద రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించింది. అప్పుడు ఎగ్మూర్ నుంచి సెంగోట్టై వెళ్తున్న సిలంబు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో రేణుక అదే స్థలంలో మృతి చెందింది. ఎగ్మూర్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాన్ని స్వాధీనం చేసుకోండి

బంధువులను మందలించిన న్యాయమూర్తి

కొరుక్కుపేట: పోలీసుల దాడిలో చనిపోయిన ఆటో డ్రైవర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అంత్యక్రియలు నిర్వహించాలని మధురై హైకోర్టు మధురై బ్రాంచ్ జడ్జి తెలిపారు. ఈ నెల 8వ తేదీన థెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ సమీపంలోని ఉత్తర పుత్తూరుకు చెందిన ఆటో డ్రైవర్ మురుగన్ అచ్చంపట్టి భక్తులను ఎక్కించుకుని ఆలయానికి తీసుకెళ్లాడు. ముప్పిడారియమ్మన్ గుడి సమీపంలోకి రాగానే ఆ ప్రాంతంలో ఆటోను వ్యాన్ ఢీకొట్టింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయిన మురుగన్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మురుగన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసుల దాడి వల్లనే మురుగన్ మృతి చెందాడని ఆరోపిస్తూ మృతదేహాన్ని స్వాధీనం చేసుకునేందుకు బంధువులు నిరాకరించి ఉత్తర పుత్తూరులో నిరసన కొనసాగించారు. ఈ కేసులో మార్చి 9న ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించనున్నారు. అయితే ఇప్పటి వరకు శవపరీక్ష నివేదికను కుటుంబీకులకు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో రకరకాల అనుమానాలు తలెత్తుతున్నాయి. వారి సంబంధిత వైద్యుల సమక్షంలో శారీరక పరీక్ష చేయించుకోవాలి. పోలీసుల దాడికి గురైన మురుగన్ కుటుంబానికి తగిన సాయం అందించాలని, సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని, చదువు ఖర్చులను ప్రభుత్వమే భరించాలని మురుగన్ భార్య మధురై డిమాండ్ చేశారు. కోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ముందు విచారణకు వచ్చింది. మురుగన్ మృతికి సంబంధించి ఇప్పటి వరకు 45 మంది సాక్షులను విచారించామని ప్రభుత్వం తరపున హాజరైన అదనపు చీఫ్ అడ్వకేట్ వీర కథిరవన్ తెలిపారు. విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.మృతుడి భార్య మీనా కోర్టుకు హాజరై వ్యక్తిగతంగా న్యాయమూర్తికి వాంగ్మూలం ఇచ్చింది. మరో ముగ్గురు సాక్షులను న్యాయమూర్తి విచారించారు. సోమవారం సాయంత్రం 4 గంటల్లోపు మృతుని మృతదేహాన్ని బంధువులు స్వీకరించి అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశిస్తూ.. ఈ కేసుకు సంబంధించిన వివరణాత్మక ఉత్తర్వులను విడుదల చేస్తామని పేర్కొంటూ వాయిదా వేశారు.

నెల రోజుల చిన్నారి హత్య

తిరువొత్తియూరు: రెడ్ హిల్స్ సమీపంలోని విజయనల్లూరు విజయ గార్డెన్ ప్రాంతానికి చెందిన రమేష్ పెయింటర్. ఇతని భార్య సత్య ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరికి ఒక నెల మగ బిడ్డ ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రమేష్ పాడినల్లూర్‌లో ఉన్న అంకాళ పరమేశ్వరి ఆలయానికి వెళ్లాడు. ఈ క్రమంలో సత్య మాత్రమే ఇంటిలో ఉన్నారు. ఈ క్రమంలో హఠాత్తుగా మగ బిడ్డ కనబడలేదని ఆమె అరిచింది. బంధువులు రమేష్‌కు సమాచారం అందించారు. రమేష్ అక్కడకు చేరుకుని బిడ్డ కోసం అన్ని చోట్ల వెతికారు ఈ క్రమంలో ఆదివారం రాత్రి అదృశ్యమైన బిడ్డ ఇంటికి సమీపంలో ఉన్న బావిలో శవంగా తేలుతున్నాడు. ఇది చూసి దిగ్భ్రాంతి చెందారు. దీని గురించి చోళవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, పోలీసులు అక్కడ చేరుకొని బిడ్డను శవ పరీక్ష కోసం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రి తరలించారు. దీనికి సంబంధించి సత్యా వద్ద పోలీసులు విచారణ చేయగా బిడ్డను బావిలోకి విసిరి హత్య చేసినట్లు ఒప్పుకుంది. దీంతో సత్యను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె ఎందుకు బిడ్డను హత్య చేసింది అనే కారణాలు తెలియరాలేదు. కుటుంబ సమస్యల కారణమా లేదా మరి ఏదైనా కారణమా అనే కోణంతో విచారణ చేస్తున్నారు.

యువకుడి హత్య

అన్నానగర్: కుమారి జిల్లా కొట్టారం సమీపంలోని అగస్తీశ్వరం ఇలందైయడి ఉడాల్ ప్రాంతానికి చెందిన ధనేష్(28) అగస్తీశ్వరం ప్రాంతానికి చెందిన రఘుబాలన్ (24) భువియూర్ శివాలయం వీధికి చెందిన దివాకర్(29) ముగ్గురూ స్నేహితులు. ఆదివారం సాయంత్రం వడుకనపట్టి ప్రాంతంలో ముగ్గురు కలిసి మద్యం తాగారు. అప్పుడు వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన రఘుబాలన్, దివాకర్ ఇద్దరూ కలిసి ధనేష్‌పై దాడి చేశారు. ఆపై ఆ ప్రాంతంలో పడి ఉన్న రాయితో కొట్టడంతో రక్తపు మడుగులో సంఘటన స్థలంలోనే ధనేష్ మృతి చెందాడు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు రఘుబాలన్, దివాకర్‌లను అరెస్ట్ చేశారు.

బహుమతి ప్రదానం



సెయింట్ జోసెఫ్స్ గార్డెన్ స్కూల్ ఆవరణలో సోమవారం క్రీడోత్సవాలు జరిగాయి. పిల్లలకు, విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలకు నిర్వాహకులు జెస్సీ ప్రియ, శశి శేఖర్‌లు బహుమతులను ప్రదానం చేశారు. - సాక్షి, చెన్నై

తుదిదశకు రాజగోపురం నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీధరన్

తిరుత్తణి: పదిహేనేళ్లపాటు సాగిన తిరుత్తణి ఆలయ రాజగోపుర పనులు తుది దశకు చేరుకోవడంతో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి రాజగోపురం లేని లోటును తీర్చే విధంగా గత 2009లో అప్పటి డీఎంకే ప్రభుత్వం రూ.3.60 కోట్లు నిధులు కేటాయించి 9 అంతస్తుల రాజగోపురం పనులు ప్రారంభమయ్యాయి. తరువాత పదేళ్లపాటు అన్నాడీఎంకే ప్రభుత్వంలో రాజగోపురం పనులు నత్తనడకన సాగాయి. రాజగోపురం పనులు పూర్తి చేసి గోపురంలో శిలలు పొందుపరిచి రంగులు దిద్దారు. అయితే రాజగోపురానికి ముఖద్వారం, కొండ మాడ వీధులతో కలిపి మెట్లు ప్రారంభానికి వీలుగా హిందు దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు ఆదేశించారు. దీంతో ఉభయదారుల నుంచి గ్రానైట్ రాళ్లు 132 టన్నుల బరువుతో గోపురం ద్వారం పనులు చేపట్టారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ శ్రీధరన్, జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టు బోర్డు సభ్యులు సురేష్‌బాబు, నాగన్, ఉషారవి, మోహనన్ తదితరుల బృందం రాజగోపురంలో తుదిఘట్టం పనులు తనిఖీ చేసి, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీధరన్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా భక్తుల ఎదురుచూపులు నెరవేరనున్నాయని తెలిపారు. రాజగోపురంలో ప్రధానమైన ముఖద్వారానికి సంబంధించి 132 టన్నుల బరువైన గ్రానెట్ రాళ్లతో నిర్మిస్తున్నారని తెలిపారు. అందులో నెమలి, వేల్ కళాత్మకంగా శిల్పులతో చెక్కబడి పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు.

తమ్ముడిని గడ్డపారతో కొట్టి చంపిన అన్న

అన్నానగర్: నాగై సమీపంలో ఆస్తి వివాదంలో తమ్ముడిని గడ్డపారతో కొట్టి చంపిన అన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. నాగై జిల్లా కీళయూర్ సమీపం ఈరనూర్ కట్టలైమాతకోవిల్ వీధికి చెందిన ఆరోగ్యస్వామి(54) తమ్ముడు సంధీయగురు(45) మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ స్థితిలో సోమవారం పట్టణంలో జరిగిన ఓ అంతిమయాత్రలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వివాదం ముగియడంతో తమ్ముడు సంధియగురుపై ఆరోగ్యసామి గడ్డపారతో దాడి చేశాడు. అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నాగై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆరోగ్యస్వామిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఆస్తి తగాదాల కారణంగా తమ్ముడిని అన్న కొట్టి చంపడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

మళ్లీ మోదీ... కావాలి మోదీ



సెంగోల్ (రాజదండం)కు పూజలు చేస్తున్న హిందూ మక్కల్ కట్చి, తమిళిసై తదితరులు

కొరుక్కుపేట: బీజేపీ కూటమికి మద్దతుగా హిందూ మక్కల్ కచ్చి ప్రచారం చేయనుందని ఆ పార్టీ అధ్యక్షుడు అర్జున్ సంపత్ ప్రకటించారు. రాబోయే పార్లమెంట్, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో «మళ్లీ మోడీ.. కావాలి మోడీ» అనే నినాదంతో ఎన్నికల్లో రికార్డు సృష్టించబోతున్న భారత ప్రధాని నరేంద్ర మోడీకి హిందూ మక్కల్ కచ్చి బేషరత్‌గా మద్దతు ఇస్తుందన్నారు. తమిళ నాడు భారతీయ జనతా పార్టీ, జాతీయ ప్రజాస్వామ్య కూటమి రాష్ట్ర నిర్వాహకులతో కలిసి వెళ్లి.. ఆ పార్టీల నేతలు, కూటమి పార్టీల అభ్యర్థులతో సమావేశమై మద్దతు తెలుపుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. తమిళనాడు వ్యాప్తంగా నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ పార్టీల అభ్యర్థులకు హిందూ మక్కల్ కచ్చి తరపున ప్రచార వాహనం ద్వారా మద్దతు ఇస్తామని ప్రకటించడానికి సంతోషిస్తున్నామని, అయితే ఓ ద్రవిడ మోడల్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రచారం చేయడానికి మేము ఇక్కడకు వచ్చామన్నారు. తమిళనాడు మహిళల కన్నీళ్లు తుడవడం కోసం ఉజ్వల ప్రాజెక్టు కింద లక్షలాది మంది మహిళలకు ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్లు, స్టవ్‌లు, సిలిండర్లు అందించారన్నారు. కిసాన్ సమ్మాన్ పథకం కింద తమిళనాడులోని లక్షలాది మంది రైతులకు ప్రతి 4 నెలలకొకసారి రైతుల బ్యాంకు ఖాతాలో సంవత్సరానికి రూ.6 వేలు నేరుగా జమ అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థులు, కూటమి అభ్యర్థులతో కలసి సెంగోల్ పూజలను నిర్వహించారు.

29 నుంచి ఏప్రిల్ 1 వరకు బ్యాంకులకు సెలవు

- సేవలకు అంతరాయం

కొరుక్కుపేట: జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు వరుసగా 4 రోజులు మూసి వేయబడతాయి. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఈనెల 29వ తేదీ బ్యాంకులకు సెలవు. మరుసటి రోజు శనివారం బ్యాంకు అకౌంట్స్ నిమిత్తం సెలవు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖాతాలు ఆదివారం 31న పరిశీలిస్తారు. వార్షిక ఖాతాలు సెలవు రోజున మూసివేయబడతాయి. కాబట్టి ఈ సంవత్సరం చాలా బ్యాంకులు మూసి వేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఖాతాలు ఉన్న బ్యాంకులు మాత్రమే పని చేస్తాయి. ఏప్రిల్ 1న సంవత్సరాంతపు ఖాతాలను పూర్తి చేయడానికి ప్రజలకు బ్యాంకు సేవలు ఉండవు. అయితే బ్యాంకులు తెరిచి ఉంటాయి. బ్యాంకులు వరుసగా 4 రోజులపాటు సామాన్య ప్రజలకు సేవలు అందించలేకపోతున్నాయి. సంవత్సరాంతపు ముగింపు రోజు ఉద్యోగుల సెలవుల కారణంగా బ్యాంకులు పనిచేయవు. దీంతో దేశవ్యాప్తంగా బ్యాంకులు నిరంతరం మూసివేయడం వల్ల నగదు చెక్కు లావాదేవీలు తీవ్రంగా ప్రభావితం అవుతుందని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటాచలం చెప్పారు అందువల్ల రానున్న రోజుల్లో వరుస సెలవుల కారణంగా బ్యాంకింగ్ సేవలు ప్రభావితం కావచ్చు. నగదు, చెక్కుల లావాదేవీలు నిలిపివేయబడతాయి. చిన్న వ్యాపారాల నుండి పెద్ద సంస్థల వరకు, డబ్బు డిపాజిట్ చేయడం, విత్‌డ్రా చేయడం వంటి కార్యకలాపాలు ప్రభావితమవుతాయి. ఏటీఎం కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేస్తాయి. డబ్బు అయిపోయిన వెంటనే జమ చేసేలా సదుపాయం కల్పించారన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల పరిచయం



కాంగ్రెస్ అభ్యర్థులతో సెల్వ పెరుంతొగై

- సీఎం స్టాలిన్ ఆశీస్సులు

సాక్షి, చెన్నై : లోక్ సభ ఎన్నికలలో పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థులను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై పార్టీ వర్గాలకు పరిచయం చేశారు. డీఎంకే కూటమిలో రాష్ట్రంలో కాంగ్రెస్ 9 చోట్ల పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో 7 స్థానాలకు తొలుత అభ్యర్థులను ప్రకటించారు. ఈ అభ్యర్థుల వివరాలను సత్యమూర్తి భవన్‌లో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై మీడియాకు అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. అభ్యర్థులను పరిచయం చేశారు. అనంతరం అభ్యర్థులు సత్యమూర్తి భవన్ నుంచి డీఎంకే కార్యాలయం అన్నా అరివాలయంకు వెళ్లారు. అక్కడ డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ఆశీస్సులను అభ్యర్థులు అందుకున్నారు. ఈ సందర్భంగా సెల్వ పెరుంతొగై మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి త్వరలో తమ నేత రాహుల్‌గాంధీ రాష్ట్రానికి రానున్నారని తెలిపారు. ఆయన పర్యటన అన్ని నియోజకవర్గాలను కలిపే విధంగా బహిరంగ సభలు, రోడ్ షోల రూపంలో ఉంటాయని వివరించారు. సిట్టింగ్ ఎంపీలు, ఎంపీ అభ్యర్థులు జ్యోతిమణి, విజయ వసంత్ తదితరులు ఉన్నారు. తిరునల్వేలి కాంగ్రెస్ అభ్యర్థిగా రాబర్ట్ రూస్‌ను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. విలవన్ కోడు అసెంబ్లీ ఉప ఎన్నికలో తారగై పోటీ చేస్తారని తెలిపారు.

మూడు నామినేషన్‌లు దాఖలు





నామినేషన్ దాఖలు చేస్తున్న డీఎండీకే అభ్యర్థి నల్లతంబి, బీజేపీ అభ్యర్థి బాలగణపతి నామినేషన్



వేలూరులో బీజేపీ అభ్యర్థి ఎషీ షణ్ముగం నామినేషన్

తిరువళ్లూరు: తిరువళ్లూరు పార్లమెంట్ రిజర్వ్‌డ్ స్థానానికి సోమవారం ఒకరోజే మూడు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా ప్రధాన పార్టీలు బలప్రదర్శనతో పట్టణంలో సందడి నెలకొనగా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. తిరువళ్లూరు పార్లమెంట్ స్థానానికి ఏప్రిల్ 19వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ గత 16న విడుదల కాగా 20వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే నామినేషన్ ప్రారంభమైనప్పటికీ నాలుగు రోజులుగా ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ క్రమంలో అన్నాడీఎంకే కూటమి నుంచి డీఎండీకే అభ్యర్థిగా నల్లతంబి, డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ శశికాంత్ సెంథిల్, బీజేపీ అభ్యర్థిగా పొన్ బాలగణపతి, బీఎస్పీ అభ్యర్థిగా తమిళ్‌మధి తదితరులను అభ్యర్థులుగా ఆయా పార్టీలు ప్రకటించాయి. నామినేషన్ వేయడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్న క్రమంలో సోమవారం ఉదయం డీఎండీకే అభ్యర్థి నల్లతంబి తన కూటమి నేతలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంజీఆర్ విగ్రహానికి, విజయకాంత్, జయలలిత చిత్రపటానికి నివాళులర్పించిన నల్లతంబి మద్దతుదారులతో కలిసి తిరువళ్లూరు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రభుశంకర్‌కు తన నామినేషన్‌ను సమర్పించారు. అభ్యర్థితో పాటు డీఎండీకే సీనియర్ నేత సుదీష్, మాజీ మంత్రులు అన్నాడీఎంకే నేతలు రమణ, మాధవరం మూర్తి, అబ్దుల్‌రహీం, మాజీ ఎమ్మెల్యే బలరామన్, డీఎండీకే జిల్లా కన్వీనర్ కృష్ణమూర్తితోపాటు పలువురు హాజరయ్యారు. అలాగే బీజేపీ అభ్యర్థి పొన్ బాలగణపతి సైతం తన మద్దతుదారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కామరాజర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వద్ద ముగిసింది. అనంతరం అభ్యర్థి తన రెండు సెట్ల నామినేషన్లను కలెక్టర్‌కు సమర్పించారు. బీజేపీ అభ్యర్థి వెంట పార్టీ నేతలు లోకనాథన్, పీఎంకే నుంచి కేస్ శేఖర్, ఏఎంఎంకే నేత మాజీ ఎమ్మెల్యే ఏలుమలై, జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌కుమార్, పార్టీ నేతలు కరుణాకరన్, ఆర్యశ్రీనివాసన్, పార్టీ నేతలు బాలాజీ పన్నీర్ సెల్వం, రాజ్‌కుమార్‌తో పాటు పలువురు ఉన్నారు. కాగా బీఎస్పీ అభ్యర్థిగా న్యాయవాది తమిళ్‌మధి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కాగా నామినేషన్ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. పార్టీ అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే లోపలికి అనుమతించారు.

వేలూరులో నామినేషన్ల దాఖలు

వేలూరు: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీలు కలెక్టరేట్‌లో సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 20న ప్రారంభమైన నామినేషన్‌లు దాఖలు 27వ తేదీ వరకు సాగుతుంది. ఇదిలాఉండగా సోమవారం మధ్యాహ్నంలోపు పౌర్ణమి ఉండడంతో ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒకే సమయంలో నామినేషన్‌లు వేసేందుకు వేలూరు గ్రీన్ సర్కిల్ నుంచి ఊరేగింపుగా కార్యకర్తలతో వచ్చారు. దీంతో కలెక్టరేట్ రోడ్డు కార్యకర్తలతో స్తంభించిపోయింది. కలెక్టరేట్ ఎదుట డీఎంకే, బీజేపీ, అన్నాడీఎంకే కార్యకర్తలు ఒక్కసారిగా రావడంతో పోలీసులు అదుపు చేయలేకపోయారు. కార్యకర్తలు నిబంధనలకు విరుద్ధంగా అడ్డంగా ఏర్పాటు చేసిన ట్రెంచ్‌లను ఎక్కి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కాస్త తోపులాట చోటుచేసుకుంది. అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు వచ్చిన వాహనాలను సైతం పోలీసులు వంద మీటర్ల దూరంలో నిలిపి వేయడంతో కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం మూడు వాహనాలను మాత్రమే లోనికి అనుమతించారు. వేలూరు పార్లమెంట్ స్థానానికి డీఎంకే ఆధ్వర్యంలో సీనియర్ మంత్రి దురై మురుగన్ తనయుడు కదీర్ ఆనంద్, అన్నాడీఎంకే అభ్యర్థిగా డాక్టర్ పశుపతి, బీజేపీ అభ్యర్థిగా ఎషీ షణ్ముగంలో నామినేషన్‌లు దాఖలు చేశారు. ఆ సమయంలో వేలూరు పార్లమెంట్ స్థానంలో అధికంగా ముస్లిం మైనారిటీలు ఉండడంతో తామంటే తాము విజయం సాధిస్తామని ఎవరి ధీమాను వారు వ్యక్తం చేశారు.

ఖైదీ పరార్

తిరువొత్తియూరు: ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖైదీ పరారయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కళ్లకురిచ్చి జిల్లా త్యాగదుర్గం ప్రాంతానికి చెందిన వ్యక్తి వినాయకమూర్తి. ఇతనికి విల్లుపురం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మార్చి 4వ తేదీ నుంచి కడలూరు సెంట్రల్ జైలులో ఉంచారు. ఈ స్థితిలో 22వ తేదీన ఆకస్మాత్తుగా ఛాతీలో నొప్పి వచ్చిందని వినాయకమూర్తిని చికిత్స నిమిత్తం కడలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వినాయకమూర్తి అక్కడ చికిత్స పొందుతూ అదృశ్యమయ్యాడు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అతడు పారిపోయినట్లు తేలింది. కడలూరు పుదునగర్ పోలీసులు ఖైదీ కోసం గాలిస్తున్నారు.

నలుగురి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై ఓటేరిలో గంజాయి విక్రయించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పులియంతోపు అసిస్టెంట్ కమిషనర్ రాజాకు అందిన సమాచారం మేరకు ఆదివారం ఓట్టేరి పార్కులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరిని పోలీసులు విచారించారు. వారిలో నలుగురి వద్ద చిన్నచిన్న పార్శిళ్లలో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. దీంతో ఒట్టేరి ప్రాంతానికి చెందిన విఘ్నేష్ కుమార్(23), శశికుమార్ (27), కిషోర్ (24), శామ్యూల్(20)ను అరెస్టు చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి, ఒట్టేరి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు తేలింది. నలుగురిపై కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

డబ్బున్నోళ్లకే కూటమి సీట్లు
ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్



రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేసే వారిని గుర్తించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇస్తే.. ప్రతిపక్షాల కూటమి ధనవంతులకు మాత్రమే సీట్లు ఇచ్చి కమర్షియల్ పాలిటిక్స్ నడుపుతున్నదని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మండపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి కమర్షియల్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు.

కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీతను ఓడించాలి
- ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర



సాక్షి, పాడేరు: బోగస్ ఎస్టీ అయిన కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీతను ఓడించేందుకు పార్టీలకతీతంగా గిరిజనులంతా కృషి చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర పిలుపునిచ్చారు. కుల వివాదం ఎదుర్కొంటున్న కొత్తపల్లి గీతకు అరకు ఎంపీ నియోజకవర్గ టికెట్ ఇవ్వడంపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు సోమ వారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.42కోట్లు టోకరా వేసి ఆర్థిక నేరం కింద జైలుకు వెళ్లిన గీతకు అరకు ఎంపీ టికెట్ కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌కుమార్‌కు లేఖలు రాసినట్టు ఆయన తెలిపారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిని ఓడించకపోతే చట్టసభల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం లేకుండా మరిన్ని కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తారని ఆవేదన వ్యక్తంచేశారు.

త్వరలో భవిష్యత్ కార్యాచరణ
ఎంపీ జీవీఎల్ నరసింహారావు



సాక్షి, విశాఖపట్నం: కొన్నేళ్లుగా విశాఖ లోక్‌సభ స్థానాన్ని ఆశిస్తున్న రాజ్యసభ బీజేపీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు ఆ పార్టీ ఝలక్ ఇచ్చింది. ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న జీవీఎల్ రెండేళ్ల క్రితం విశాఖలో సొంతంగా ఇంటిని కూడా కొనుగోలు చేశారు. స్థానికంగా సంక్రాంతి సంబరాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ.. విశాఖ లోక్‌సభ స్థానాన్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బంధువు శ్రీభరత్‌కు కేటాయించేలా చూశారు. ఈ పరిణామంతో జీవీఎల్ షాక్ తిన్నారు. అప్పటినుంచి ఆయన మౌనంగా ఉండిపోయారు. తాజాగా జీవీఎల్ సోమవారం వీడియో సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. 'నాలుగు రోజులుగా విశాఖ నుంచి శ్రేయోభిలాషులు, వివిధ సంఘాల వారు ఫోన్‌చేసి విశాఖ సమస్యల పరిష్కారానికి కృషి చేసినా నాకు అవకాశం రానందుకు బాధపడుతున్నారు. విశాఖ అభివృద్ధికి మూడేళ్లు సేవ చేసినందుకు సంతోషిస్తున్నాను. ప్రజలకు మంచి జరగాలని నేను చేసిన సేవ వృథా అవుతుందని అనుకోవద్దు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేసిన సేవ కాదది. త్వరలో విశాఖ వచ్చి భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తాను. విశాఖ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను. బీజేపీ పటిష్టానికి పాటుపడతాను' అని పేర్కొన్నారు. కాగా.. బీజేపీ పటిష్టానికి కృషి చేస్తానని చెప్పిన జీవీఎల్ రాష్ట్రంలో కూటమి గెలుపు కోసం పాటు పడతానని పేర్కొనలేదు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునివ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.

మహిళకు మకుటం





బొత్స ఝాన్సీలక్ష్మి పార్లమెంట్ (బీసీ)
గుడూరి ఉమాబాల పార్లమెంట్ (బీసీ)
చెట్టి తనూజారాణి పార్లమెంట్ (ఎస్టీ)
జోలదరాసి శాంతి పార్లమెంట్ (బీసీ)
వంగా గీత పిఠాపురం (ఓసీ)
టి.నారాయణ దీపిక హిందూపురం (బీసీ)
వి.కళావతి పాలకొండ (ఎస్టీ)
పి.పుష్పశ్రీవాణి కురుపాం (ఎస్టీ)
ఎస్.ధనలక్ష్మి రంపచోడవరం(ఎస్టీ)
తానేటి వనిత గోపాలపురం (ఎస్సీ)
పిరియా విజయ ఇచ్ఛాపురం (బీసీ)
రెడ్డి శాంతి పాతపట్నం (బీసీ)
తెల్లం రాజ్యలక్ష్మి పోలవరం (ఎస్టీ)
కంగాటి శ్రీదేవి పత్తికొండ (ఓసీ)
బుట్టా రేణుక ఎమ్మిగనూరు(బీసీ)
మురుగుడు లావణ్య మంగళగిరి (బీసీ)
కేవీ ఉషశ్రీచరణ్ పెనుకొండ (బీసీ)
మేకతోటి సుచరిత తాడికొండ (ఎస్సీ)



కళత్తూరు కృపాలక్ష్మి గంగాధర నెల్లూరు(ఎస్సీ)
షేక్ నూరి ఫాతిమా గుంటూరుతూర్పు(ముస్లిం)
డా. దాసరి సుధ బద్వేల్ (ఎస్సీ)
ఆర్కే రోజా నగరి (ఓసీ)
విడదల రజిని గుంటూరు పశ్చిమ(బీసీ)

సీఎం జగన్ పాలనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతతో అడుగులు

మహిళలకు గత ఎన్నికలకు మించి సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళను నిర్ణయాత్మక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అన్నిటా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పుడు సీట్ల కేటాయింపుల్లోనూ పెద్దపీట వేశారు. దేశంలో తొలిసారిగా దిశ బిల్లు తీసుకొచ్చారు. నవ రత్నాల ద్వారా అమలు చేస్తున్న ప్రతి పథకం మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిందే. ఐదేళ్లుగా అందిస్తున్న తోడ్పాటుతో మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతను సాధించారు. గత ఎన్నికల్లో మహిళలకు 19 ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించగా ఇప్పుడు 24కు పెంచారు. ప్రధాన విపక్ష అభ్యర్థులపై వైఎస్సార్‌సీపీ నుంచి మహిళలనే పోటీకి దించారు. మంగళగిరి నుంచి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌పై బీసీ మహిళ మురుగుడు లావణ్యకు పోటీ చేసే అవకాశం కల్పించారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేకున్నా సీఎం జగన్ ఆమెకు టికెట్ ఇచ్చారు. పిఠాపురం నుంచి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై వైఎస్సార్‌సీపీ నుంచి వంగా గీతను పోటీకి దించారు. హిందూపురం నుంచి నందమూరి బాలకృష్ణపై వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ మహిళ టి.నారాయణ దీపికను బరిలోకి దించారు. విశాఖ ఎంపీ సీటుకు గత ఎన్నికల్లో ఓసీ అభ్యర్థులే పోటీ చేయగా సీఎం జగన్ చరిత్రను తిరగరాస్తూ బీసీ మహిళ బొత్స ఝాన్సీలక్ష్మికి వైఎస్సార్‌సీపీ టికెట్ ఇచ్చారు. చాలాకాలంగా నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి కోటీశ్వరులే పోటీలో నిలవగా సీఎం జగన్ సాధారణ కార్యకర్త, బీసీ మహిళ గూడూరి ఉమాబాలను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఎమ్మిగనూరులో టీడీపీ అగ్రవర్ణాలకు టికెట్ ఇవ్వగా బీసీ మహిళ బుట్టా రేణుక వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్నారు.

మహిళా నేతలకు టికెట్లు..

వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ పరిధిలో ఎంపీ అభ్యర్థిగా తనూజారాణి, అసెంబ్లీ అభ్యర్థులుగా వి.కళావతి(పాలకొండ), పుష్పశ్రీవాణి (కురుపాం), ఎస్ ధనలక్ష్మి(రంపచోడవరం), విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి, కాకినాడ పార్లమెంట్ పరిధిలో పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థిగా వంగా గీత పోటీ చేస్తున్నారు. రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని తానేటి వనిత(గోపాలపురం), శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఇచ్ఛాపురం నుంచి పిరియా విజయ, పాతపట్నం నుంచి రెడ్డి శాంతి, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పోలవరం నుంచి తెల్లం రాజ్యలక్ష్మి బరిలో ఉన్నారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని కంగాటి శ్రీదేవి(పత్తికొండ), బుట్టా రేణుక (ఎమ్మిగనూరు), హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా జోలదరాసి శాంతి, హిందూపురం, పెనుగొండ అసెంబ్లీ స్థానాల నుంచి టి.నారాయణ దీపిక, కేవీ ఉషశ్రీచరణ్, గుంటూరు పార్లమెంట్ పరిధిలోని తాడికొండ, మంగళగిరి, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు అసెంబ్లీ స్థానాల నుంచి మేకతోటి సుచరిత, మురుగుడు లావణ్య, విడదల రజని, షేక్ నూరి ఫాతిమా, కడప పార్లమెంట్ పరిధిలోని బద్వేలు అసెంబ్లీ స్థానం నుంచి డాక్టర్ దాసరి సుధ, చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని నగరి, గంగాధర నెల్లూరు అసెంబ్లీ స్థానాల నుంచి ఆర్కే రోజా, కళత్తూరు కృపాలక్ష్మిలు పోటీ చేస్తున్నారు.

చరిత్రాత్మక చట్టం..

దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పదవులు, నామినేషన్ కాంట్రాక్టుల్లో 50 శాతం మహిళలకు కేటాయిస్తూ సీఎం జగన్ చట్టం చేశారు. అంతకు మించి నామినేటెడ్ పదవుల్లో 51 శాతం పదవులు మహిళలకే ఇచ్చారు. మొత్తం 1,154 డైరెక్టర్ పదవుల్లో 586 పదవులు మహిళలకే దక్కాయి. 202 మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో 102 మహిళలకే ఇచ్చారు. మొత్తంగా 1,356 రాజకీయ నియామక పదవుల్లో 688 అంటే 51 శాతం మహిళలకే దక్కడం విశేషం.

కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకూ పదవుల్లో మహిళలకు సీఎం జగన్ పెద్దపీట వేశారు. దేశ చరిత్రలో తొలిసారి హోంమంత్రిగా ఎస్సీ మహిళ మేకతోటి సుచరితను

రాజకీయ సాధికారత..

నియమించారు. శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా ముస్లిం మహిళను ఎంపిక చేశారు. మండలి చరిత్రలో ముస్లిం మహిళను డిప్యూటీ చైర్ పర్సన్‌గా నియమించడం ఇదే తొలిసారి. మంత్రివర్గంలో నలుగురు మహిళలు తానేటి వనిత, కేవీ ఉషాశ్రీ చరణ్, విడదల రజిని, ఆర్కే రోజాలకు స్థానం కల్పించారు. హోం, వైద్యారోగ్యం, మహిళా శిశుసంక్షేమం లాంటి కీలక శాఖలు వారికి అప్పగించి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించారు. రాష్ట్ర తొలి చీఫ్ సెక్రటరీగా, ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నీలం సాహ్నికి అవకాశం కల్పించారు. రాష్ట్రంలో 13 జెడ్పీ చైర్‌పర్సన్ పదవుల్లో ఏడుగురు (54 శాతం) మహిళలకు అవకాశం ఇచ్చారు. 26 జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌లలో 15 మంది (58 శాతం) మహిళలకు పదవీయోగం కల్పించారు. 12 మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పోస్టులు, 24 డిప్యూటీ మేయర్ పదవులు కలిపి మొత్తంగా 36 పదవుల్లో 18 అంటే 50 శాతం పదవులు మహిళలకే ఇచ్చారు. మొత్తం మునిసిపల్ కార్పొరేషన్లలో 671 మంది కార్పొరేటర్లు ఉంటే అతివలకే 54 శాతం అంటే 361 పదవులు దక్కాయి. 75 మునిసిపాలిటీలకు ఎన్నికలు జరిగితే 73 చోట్ల వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. వాటిలో 45 మంది అంటే 64 శాతం మహిళలే చైర్‌పర్సన్లుగా ఉన్నారు. ఈ మునిసిపాల్టీల్లోని 2,123 వార్డు మెంబర్లలో 1,161 పదవులు అంటే 55 శాతం మహిళలకే దక్కాయి. సర్పంచి పదవుల్లో 57 శాతం, ఎంపీటీసీల్లో 54 శాతం, మండలాధ్యక్షుల్లో 53 శాతం, జెడ్పీటీసీల్లో 53 శాతం మహిళలకే దక్కడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించగా వీరిలో 53 శాతం మహిళలే ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న దాదాపు 1.34 లక్షల మంది ఉద్యోగుల్లో 51 శాతం మంది మహిళలే ఉన్నారు.

ఆరు అసెంబ్లీ సీట్లపై బాబు అయోమయం

▶ మొదటి పేజీ తరువాయి
ఏమిటన్నదీ ఇప్పటికే తేలలేదు. చంద్రబాబు ఇప్పటివరకు 139 సీట్లలోనే టీడీపీ అభ్యర్థులను ప్రకటించారు. అయితే అన్ని వర్గాలు వ్యతిరేకించడంతో పి.గన్నవరం అభ్యర్థి రాజేష్‌ను పోటీ నుంచి తప్పించి ఆ స్థానాన్ని జనసేనకు ఇచ్చారు. తాజాగా అభ్యర్థిని ప్రకటించిన అనపర్తి సీటును బీజేపీకి ఇవ్వాలని చూస్తున్నారు. అయితే, అనపర్తిలో బీజేపీ పోటీపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. మిగిలిన ఆరు సీట్లలో బీజేపీకి ఏవి వెళ్తాయో తెలియదు.

'సీమ'లో సీట్ల తంటా

ప్రధానంగా రాయలసీమలో బీజేపీకి కేటాయించే సీట్లపై మల్లగుల్లాలు పడుతున్నారు. గుంతకల్లు, ఆలూరు, ఆదోని సీట్లలో బీజేపీ పోటీ చేసే స్థానంపై గందరగోళం నెలకొంది. టీడీపీలోకి ఫిరాయించిన గుమ్మనూరు జయరామ్‌కు గుంతకల్లు సీటు కేటాయిస్తామని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు దాన్ని బీజేపీతో ముడిపెట్టి పెండింగ్‌లో పెట్టారు. ఒకవేళ ఆ స్థానాన్ని బీజేపీకి ఇవ్వాల్సి వస్తే జయరామ్ సీటు గల్లంతైనట్లే. అక్కడి ఇన్‌చార్జి జితేంద్ర గౌడ్ కూడా టికెట్ కోసం పట్టుబడుతున్నారు. ఆలూరు స్థానం కూడా సీట్ల సర్దుబాటు జాబితాలో ఉంది. దీంతో అక్కడా అభ్యర్థిని ఖరారు చేయలేదు. జమ్మలమడుగు స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్లు చెబుతున్నా అదీ తేలలేదు. ఆదినారాయణరెడ్డి కోసం ఆ సీటును బీజేపీకి ఇస్తారనే ప్రచారం జరుగుతుండడంతో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, ఆయన కుటుంబానికే చెందిన భూపేష్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆ కుటుంబంలో గొడవల నేపథ్యంలో రాజంపేటను బీజేపీకి ఇస్తున్నారనే ప్రచారం మొదలైంది. దీంతో రాజంపేట టీడీపీ నేతలు బత్యాల చెంగల్రాయుడు, ఇతర నేతలు ఆందోళన చెందుతున్నారు. ఈ రెండు సీట్లలో బీజేపీకి ఏది ఇస్తారనే దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. సీట్ల సర్దుబాటు నేపథ్యంలోనే అనంతపురం అర్బన్ స్థానంలోనూ చంద్రబాబు అభ్యర్థిని ఖరారు చేయలేదు. మరోవైపు ప్రకాశం జిల్లా దర్శిలో అభ్యర్థి దొరక్క ఎవరైనా రాకపోతారా... అని ఎదురుచూస్తున్నారు.

చీపురుపల్లి, భీమిలిపై అనిశ్చితి

విజయనగరం జిల్లా చీపురుపల్లిలోనూ చంద్రబాబు అభ్యర్థిని ఖరారు చేయలేకపోతున్నారు. ఓడిపోయే చోట పోటీ చేసేందుకు సీనియర్ నేతలు గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, అక్కడి ఇన్‌చార్జి నాగార్జున ఒప్పుకోవడంలేదు. దీంతో ప్రస్తుతం టీడీపీలో చీపురుపల్లి స్థానంపై ఉన్నంత టెన్షన్ మరే స్థానంలోనూ లేదు. విశాఖ జిల్లా భీమిలి స్థానాన్ని మొదట జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జరిగినా, ఇప్పుడు అది టీడీపీకే రావడంతో అక్కడ అభ్యర్థి ఖరారుపై చంద్రబాబు ఇప్పటికీ మల్లగుల్లాలు పడుతున్నారు.

6 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులేరీ?

మరోవైపు పొత్తులో పోటీ చేయాల్సిన 17 ఎంపీ సీట్లలో ఇంకా నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో టీడీపీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం, కర్నూలు, కడప, అనంతపురం స్థానాలకు అభ్యర్థుల కోసం ఇంకా జల్లెడ పడుతూనే ఉన్నారు. విజయనగరం సీటును కళా వెంకట్రావుకు ఇవ్వడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నా, ఆయన అంగీకరించడంలేదని తెలుస్తోంది. అనంతపురం సీటు కోసం జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు పవన్ గట్టిగా పట్టుపడుతున్నా దానిపైనా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. కడప, కర్నూలు సీట్లలో అభ్యర్థుల కోసం ఇంకా వెదుకులాట కొనసాగుతోంది.

'కళా' కుటుంబంలో కుంపటి



- టీడీపీ నేత కిమిడి కళావెంకటరావు ఇంట చంద్రబాబు చిచ్చు
- పురందేశ్వరితో కలిసి ఆడిన ఆటలో పావుగా కళా
- ఎచ్చెర్లలో 'తమ' నాయకుడికి టికెట్ కోసం పురందేశ్వరి, బాబు స్కెచ్
- ఎచ్చెర్లలో వెంకటరావు పనికిరాడంటూ ముద్ర
- గంటా వద్దన్న చీపురుపల్లి టికెట్ కళాకు ఆఫర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కుటుంబంలో చంద్రబాబు చిచ్చు రగిల్చారు. సొంత పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆడుతున్న రాజకీయ ఆటలో కళా వెంకటరావు పావుగా మారారు. తూర్పు కాపు (బీసీ) సామాజికవర్గం నుంచి ఉత్తరాంధ్రలో వేగంగా ఎదిగిన ఆయన ఇప్పుడు టికెట్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన దుస్థితి. గంటా శ్రీనివాసరావు వద్దు వద్దంటున్న చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లాలని వెంకటరావుకు చంద్రబాబు ఆఫర్ ఇస్తూనే, మరోవైపు అక్కడ టీడీపీ జిల్లా అధ్యక్షుడి హోదాలో టికెట్‌పై ఆశలు పెట్టుకున్న కళా సోదరుడి కుమారుడైన కిమిడి నాగార్జున ఆశలపై నీళ్లు చల్లారు. విదేశాల్లో ఉద్యోగం వదులుకొని వచ్చి 2019 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా, మళ్లీ చీపురుపల్లిలో పార్టీని బతికించేందుకు ఐదేళ్లుగా కృషి చేస్తే తుదకు కరివేపాకులా తీసిపారేస్తున్నారంటూ నాగార్జున ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజయనగరం లోక్‌సభ ఆశ చూపించి

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కళా వెంకటరావు ఎచ్చెర్ల నియోజకవర్గాన్నే నమ్ముకున్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో టీడీపీ నుంచి గెలిచి మంత్రిగా పనిచేశారు. సహచర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ నారా లోకేశ్‌కు సన్నిహితుడిగా ఉత్తరాంధ్రలో చక్రం తిప్పారు. అయితే, ఆయన ఎచ్చెర్ల నియోజకవర్గంలో పనికిరాడంటూ టీడీపీ అధిష్టానమే ఇప్పుడు ముద్ర వేస్తోంది. ఇందుకు ఐవీఆర్ఎస్ సర్వే కారణం చూపిస్తోంది. చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అవకాశం కల్పిస్తారంటూ లీకులు ఇచ్చింది. అక్కడ వెంకటరావు సోదరుడు, ప్రస్తుత నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున టికెట్ ఆశిస్తున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు చీపురుపల్లికి వెంకటరావును పేరును తేవడంతో కిమిడి కుటుంబంలో అగ్గిరాజుకుంది. తీవ్ర అసంతృప్తికి లోనైన నాగార్జున పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నెల కిందటి వరకు నాగార్జున, మూడు రోజుల కిందటి వరకు గంటా శ్రీనివాసరావు, తాజాగా కళా వెంకటరావు.. ఇలా రోజుకో పేరును టీడీపీ అధిష్టానం తెరమీదకు తెస్తుండడంతో కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. దీన్ని చక్కదిద్దడానికి కళా వెంకటరావు పేరు విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పరిశీలిస్తున్నట్లు తాజాగా లీకులు ఇస్తున్నారు.

ఫలించిన పురందేశ్వరి స్కెచ్

నడికుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) ఇటీవలి వరకూ ఎచ్చెర్లలో గ్రామస్థాయి నాయకుడు. చంద్రబాబు సొంత సామాజికవర్గం నేత కావడంతో 2014–19 మధ్య కాస్త హవా చూపించారు. ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానంపై కన్నేసిన ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకొని, పురందేశ్వరి పంచన చేరారు. ఆమె చలువతో విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడి పదవీ దక్కించుకున్నారు. ఇక్కడ బలమైన కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన రెడ్డి పావనిని తప్పించి మరీ ఈశ్వరరావుని జిల్లా అధ్యక్షుడిని చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎచ్చెర్ల టికెట్ నేరుగా ఎన్ఈఆర్‌కు ప్రకటించకుండా నెమ్మదిగా స్కెచ్ అమలుచేశారు. తొలుత శ్రీకాకుళం అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ కోటాలో చూపించారు. అక్కడ గుండ లక్ష్మీదేవి కుటుంబం ఆందోళన చేయడంతో అది టీడీపీకే ఇచ్చేసి పొరుగున ఉన్న ఎచ్చెర్ల బీజేపీ కోటాలో వేసేశారు. తద్వారా ఎచ్చెర్ల టికెట్ తనదేనని ధీమాగా ఉన్న కిమిడి కళావెంకటరావు ఆశలపై నీళ్లు చల్లేశారు. ఇప్పుడు ఎన్ఈఆర్‌ను రంగంలోకి తెస్తున్నారు.

బాబు పితలాటకంతో నాగార్జున బలి

చంద్రబాబు, పురందేశ్వరి పెట్టిన పితలాటకంతో చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున బలవుతున్నారు. ఆయన తల్లి కిమిడి మృణాళిని 2014లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. రెండేళ్లు మంత్రిగా కూడా పనిచేశారు. ఆ సమయంలో విదేశాల్లో ఉద్యోగం చేసుకుంటున్న నాగార్జున రాజకీయాలపై ఆసక్తితో ఇక్కడకు వచ్చి టీడీపీలో చేరారు. 2019లో ఓడిపోయారు. అయినప్పటికీ నాగార్జునకు భవిష్యత్ ఉందని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. తీరా ఎన్నికలు వచ్చే సరికి నాగార్జున పనికిరాడంటూ చంద్రబాబు ముద్ర వేసేశారు.

'దేశం'లో కమలం కల్లోలం

ఇప్పటికే అనపర్తి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించిన టీడీపీ

- తాజాగా ఈ సీటు బీజేపీకని ప్రచారం.. భగ్గుమన్న టీడీపీ శ్రేణులు
- సీటు మారిస్తే ఊరుకోబోమని అధిష్టానానికి హెచ్చరిక
- పలువురు టీడీపీ నేతల రాజీనామా
- రాజీనామా పత్రాలు జోన్–2 ఇన్‌చార్జి సుజయ్ కృష్ణకు అందజేత
- అనపర్తి నుంచి పోటీకి ససేమిరా అంటున్న సోము వీర్రాజు



రాజీనామా పత్రాలు చూపుతున్న టీడీపీ నేతలు

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీలో 'కమలం' కల్లోలం రేగింది. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం దక్కించుకున్న బీజేపీ.. అనపర్తి అసెంబ్లీ సీటులోనూ పోటీ చేస్తుందన్న ప్రచారం టీడీపీ శ్రేణుల్లో అగ్గి రాజేసింది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా అనపర్తి నుంచి టీడీపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని తొలి జాబితాలోనే ప్రకటించారు. ఆయన ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. ఈ తరుణంలో అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థి బరిలోకి దిగుతారన్న ప్రచారం మొదలైంది. దీంతో టీడీపీ అధిష్టానం వైఖరికి వ్యతిరేకంగా ఆ పార్టీ కార్యకర్తలు నిరసనకు దిగారు. ఈ సీటును బీజేపీకి ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి వెళుతున్న టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం అడ్డుకున్నారు. టికెట్ ఖరారుపై చంద్రబాబు నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకూ ప్రచారానికి వెళ్లవద్దని పట్టుబట్టారు. తొలుత బిక్కవోలు మండలం కాపవరంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి చేస్తున్న ఇంటింటి ప్రచారాన్ని.. నల్లమిల్లిలో మనోజ్‌రెడ్డి ప్రచారాన్ని టీడీపీ, జనసేన నాయకులు అడ్డుకున్నారు. బిక్కవోలులో అనపర్తి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో రామకృష్ణారెడ్డి పాల్గొనకుండా అడ్డుకున్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి తన నివాసం వద్ద పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ అంశంపై వేచి చూడాలని చెప్పారు. ఇది జరిగి ఒక రోజు గడిచినా ఇప్పటివరకూ చంద్రబాబు స్పందించకపోవడంతో టీడీపీ శ్రేణులు ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశాయి. తమ రాజీనామా పత్రాలను టీడీపీ జోన్–2 ఇన్‌చార్జి సుజయ్ కృష్ణ రంగారావుకు టీడీపీ ముఖ్య నేతలు సోమవారం అందజేశారు. అనపర్తిలో బీజేపీ ఎలా గెలుస్తుందో చూస్తామంటూ సవాల్ విసిరారు. ఇదే విషయాన్ని విలేకరుల సమావేశంలోనూ చెప్పారు. గత ఎన్నికల్లో కేవలం 615 ఓట్లు సాధించిన బీజేపీకి ఈ సీటు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

సోము వీర్రాజు ససేమిరా?

అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పోటీ చేస్తారనే ప్రచారం నడుస్తోంది. ఆయన మాత్రం ఎంపీగా తప్ప అసెంబ్లీకి పోటీ చేయనని రెండు రోజుల క్రితమే తన సన్నిహితుల వద్ద స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో అనపర్తి నుంచి బరిలోకి దింపేందుకు రెడ్డి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థి కోసం బీజేపీ అన్వేషిస్తోంది.

టీడీపీ నేతలకు అన్యాయం

స్వప్రయోజనాల కోసం చంద్రబాబు జనసేన, బీజేపీతో జత కట్టడంతో ఇప్పటికే పలువురు టీడీపీ సీనియర్ నేతలకు అన్యాయం జరిగిన విషయం తెలిసిందే. జనసేన నేత దుర్గేష్‌ను నిడదవోలు పంపించి, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు తీరని ద్రోహం చేశారన్న విమర్శలు ఉన్నాయి. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానాన్ని సైతం బీజేపీకి, రాజానగరం అసెంబ్లీ సీటును జనసేనకు కట్టబెట్టి టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరి రాజకీయ భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేశారు. బాబుకంటే సీనియర్ అయిన సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిత్వం విషయంలో స్పష్టత ఇచ్చేందుకు నానా తిప్పలూ పెట్టారు. ఇప్పుడు అనపర్తి విషయంలోనూ అదే పంథా కొనసాగిస్తున్నారు.

సుగుణమ్మకు చంద్రబాబు ఝలక్

▶ మొదటి పేజీ తరువాయి
తిరుపతి టికెట్ ఆశిస్తున్నారు. తిరుపతి నుంచి జనసేన పోటీ చేయాలని ఆ పార్టీ శ్రేణులు కొంత కాలంగా పవన్‌పై ఒత్తిడి తెస్తున్నాయి. చివరకు అనూహ్యంగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరటం, ఆ వెంటనే ఆయనకు తిరుపతి టికెట్ ఇవ్వడం జరిగిపోయాయి. ఆరణి శ్రీనివాసులును టీడీపీతో పాటు జనసేన నేతలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన తమను కాదని నిన్న పార్టీలో చేరిన శ్రీనివాసులుకి సీటు కేటాయించటం ఏమిటని నిలదీశారు. ఆరణి శ్రీనివాసులు తిరుపతి వాసి కాదంటూ లోకల్, నాన్ లోకల్ వార్‌ని తెరపైకి తెచ్చారు. ఆందోళనలకు సిద్ధమయ్యారు. పరువు బజారుకు ఈడ్చొద్దని, న్యాయం చేస్తామంటూ ఇరు పార్టీల అధినేతలు స్థానిక నేతలను మభ్యపెడుతూ వచ్చారు. దీంతో సుగుణమ్మ, ఇతర టీడీపీ నేతల్లో ధీమా వచ్చింది. అయితే ఆదివారం పవన్ ప్రకటించిన జాబితాలో తిరుపతి అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు పేరు ఉండటంతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

కన్నీరు మున్నీరైన సుగుణమ్మ

ధర్మో రక్షతి రక్షితః అంటూ మారుమోగే తిరుపతిలో కూటమి అభ్యర్థి ఎంపికలో జరిగింది న్యాయమా? ధర్మమా? అని సుగుణమ్మ సోమవారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. 'జనసేన అభ్యర్థిని గెలిపించుకొని రావాలంటూ విజయవాడలో జరిగిన సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శాంతి వచనాలు పలికారు. ఆ శాంతి వచనాలకు నేను ఊరుకున్నా, పార్టీ కేడర్ ఎలా సమ్మతిస్తారు? ఈ అధర్మాన్ని నాయకులు, ప్రజలు జీర్ణించుకోలేరు. తిరుపతిలోనే టీడీపీకి అభ్యర్థులు లేరా? జనసేనలో లేరా? ఏమిటీ విపరీతం? ఎన్నో కష్టాలు పడ్డాం. రాజకీయాల్లో నా భర్తను సైతం కోల్పోయా. మాకేమీ వ్యాపారాలు లేవు. కేవలం ప్రజాసేవ కోసం మా కుటంబం రాజకీయాల్లో ఉంది. ఇలాంటి కుటుంబాన్ని పక్కన పెట్టారంటే ప్రజలే జీర్ణించుకోలేకపోతున్నారు. జనసేనకు కేటాయించినా పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్నారంటే ఆనాడు మేమూ సంతోషించాం. ఇవాళ ఎక్కడి నుంచో వచ్చిన వారికి టికెట్ ఇచ్చి గెలిపించాలంటే ఎలా? వైఎస్సార్‌సీపీ పనికిరాడని పక్కన పెట్టిన వ్యక్తి తెల్లవారి పార్టీలో చేరితే మధ్యాహ్నానికి టికెట్ ఇచ్చేశారు. ఇతని కోసం పనిచేసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావడం లేదు. దోపిడీ దొంగలను పక్కన పెట్టుకుని ఏ విధంగా ఓట్లు అడగాలి? పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, బీజేపీ వాళ్లు వచ్చి గెలిపించుకోవాల్సిందే' అని అన్నారు.

ఒకవైపు వర్షాభావం...
మరోవైపు అడుగంటిన
భూగర్భ జలాలు...
వచ్చేసిన వేసవి.
ఇంకా రెండు మూడు నెలలు
గడవాలి ఈ వేసవిలో.
నీరు ముఖ్యం.
బెంగళూరు ఇప్పటికే అనుభవిస్తోంది.
కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే
తక్కువ నీటితో బాగానే ఉండొచ్చు
అని బెంగళూరు డాక్టర్ దివ్యాశర్మ
రాసిన 'ఎక్స్' పోస్టు వైరల్ అయ్యింది.
అది అందరికీ శిరోధార్యం.
ఆమె చేసిన నీటి పొదుపు సూచనలు





అదుపు అదుపు నీటి పొదుపు

ఎక్కడ నీటి ట్యాంకర్లు కనిపించవో, ఎక్కడ స్త్రీలు కుళాయిల దగ్గర ప్లాస్టిక్ బిందెలతో తగాదాలు పడరో, ఎక్కడ పల్లెటూరి మనుషులు నెత్తిన కడవలతో మైళ్లకు మైళ్లు నడవరో, ఎక్కడ ప్రతి ఇంటిలో అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందో అదే సుభిక్షితమైన ప్రాంతం. 'ఎడతెగక పారే ఏరు' లేని ఊరిని చప్పున వదిలిపెట్టమన్నాడు సుమతీ శతకకారుడు. నీరు జీవనాధారం. నీరు నిత్యావసరం. కాని నేటికీ తాగునీళ్లు అందని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దానికి తోడు కరువు పరిస్థితి తోడైతే... వేసవి వచ్చిపడితే?

స్త్రీలదే భారం

నీటి సమస్య ఎప్పుడూ స్త్రీల సమస్య. ఇంట్లో ఉండేది స్త్రీలు, ఇంటి పనులకు నీటిని ఉపయోగించాల్సిన వారు స్త్రీలు కనుక నీటి బెంగ స్త్రీలదే. పురుషుడు తాను 'బయట సంపాదించాలి కాబట్టి' ఇంట్లో ఉండే స్త్రీ నీటి బాధలు పడాల్సిందే అనే భావజాలం ఇంకా పోలేదు. నీటి బాధల్లో చేయూతనిచ్చే పురుషులు ఉన్నా అధికశాతం స్త్రీలే ఈ బాధలు పడతారు. ఇంట్లో నీళ్లు లేకపోతే పురుషుడి చేత తిట్లు తింటారు. నీళ్ల తేవడంలో పిల్లల సాయం అందకపోతే నడుములు విరగ్గొట్టుకునేలా నీరు మోస్తారు. ప్రస్తుతం రెండు పనులు తప్పక జరగాలి.

1. నీటి సమస్య ఇంట్లో తీర్చడానికి పురుషుడు సమాన భాగస్వామ్యం వహించేలా చైతన్యపరచడం.
2. ప్రతి ఇంట్లో నీటి పొదుపు కోసం ప్రతి కుటుంబ సభ్యుడు చైతన్యవంతం కావడం.

నీరు వృథా చేయడం అంటే?

కొందరు ఉంటారు... సింక్ దగ్గర నిలబడి ట్యాప్ తిప్పి బ్రష్ చేయడం మొదలెడతారు. ఇక బ్రషింగ్ అవుతున్నంత సేపు ట్యాప్ నుంచి నీరు వృథా కావాల్సిందే. మరికొందరు బాత్‌రూమ్ ఫ్లోర్ మీద రోజుకు రెండు ఫుల్ బకెట్లు కుమ్మరిస్తారు శుభ్రత కోసం. మరికొందరు సగం బకెటు స్నానం చేసి మిగిలిన సగాన్ని వృథాగా వదిలేస్తారు. ఆ తర్వాత వచ్చిన కుటుంబ సభ్యులు ఆ నీరు స్నానానికి వాడలేక కమోడ్‌లో పారబోస్తారు. మరికొందరు టాయిలెట్ మీద కూచుని ఏమీ తోచక స్ప్రే గన్ చేత పట్టి నీటిని ప్రెస్ చేస్తూ ఆటలాడుతూ ఉంటారు. మరికొందరు రోజుకు రెండు సార్లు షవర్ తిప్పి ఆరాముగా స్నానం చేస్తారు. మరికొందరు గిన్నెలు కడుగుతున్నంత సేపు వాష్ ఏరియాలో ట్యాప్ తిప్పే ఉంచుతారు. ఇంకొందరు కిచెన్ సింక్‌లో చిన్న గ్లాస్ కడగాలన్నా ట్యాప్ తిప్పి అర బకెట్ నీళ్లు సింక్‌లో వృథాగా పోనిస్తారు. ఇక ఉతికిన బట్టలను మూడు సార్లు జాడించేవారు ఇంకొందరు. ఒక్క నీటిబొట్టు కూడా సృష్టించలేని మనకు ఇన్ని నీళ్లు వృథా చేసే హక్కు లేదు.

పొదుపే మిగులు

నీళ్లు ఎక్కువ కావాలనుకుంటే తక్కువ ఖర్చు చేయాలి. అప్పుడు తక్కువ ఉన్నా ఎక్కువ అనిపిస్తాయి. ఇప్పుడు బెంగళూరు నగరం నీటి కరువుతో ఇబ్బందులు పడుతోంది. నీరు వృథా చేసేవారికి జరిమానాలు విధిస్తున్నారు. నీరు ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో తెలుసుకుంటారు. ఈ నేపథ్యంలో అక్కడి డెర్మటాలజిస్ట్ డాక్టర్ శర్మ ఇటీవల 'ఎక్స్' (ట్విటర్)లో రాసిన పొదుపు పోస్ట్ అందరికీ నచ్చింది. 'మాకు నీళ్ల సమృద్ధి ఎప్పుడూ. కాని మేము నీటిని పొదుపుగా వాడతాము. రొటీన్‌కు ఏ భంగం కలగకుండా నీటిని పొదుపుగా వాడొచ్చు' అని పొదుపు చిట్కాలు చెప్పిందామె.

ఇవీ ఆ పొదుపు చిట్కాలు

- ➔ బాత్‌రూమ్స్‌లో షవర్స్ బంద్ చేయాలి. బకెట్‌లో పట్టుకుని స్నానం చేయాలి. షవర్‌లో చాలా నీళ్లు వృథా అవుతాయి. పైగా ఎక్కువ సేపు నీళ్లలో నానడం కూడా చర్మానికి మంచిది కాదు. కొందరు రోజుకు రెండుసార్లు స్నానం చేస్తారు. ఒక సారి స్నానం వల్ల లోటేం జరగదు.
- ➔ ట్యాప్‌లకు ఎరీటర్‌లు బిగించాలి. ట్యాప్‌లు తిప్పితే నీళ్లు భళ్లున వస్తాయి. వృథా అవుతాయి. అదే అన్ని ట్యాప్‌లకు ఎరీటర్లు (చిల్లుల పరికరం) బిగిస్తే నీళ్లు జల్లుగా పడతాయి. పొదుపు అవుతాయి. ముఖ్యంగా అంట్లు తోమేప్పుడు చాలా నీళ్లు పొదుపు అవుతాయి.
- ➔ ఆర్‌ఓల నుంచి ఫిల్టర్ సమయంలో వృథాగా పోయే నీటిని పట్టి మొక్కలకు పోయాలి. మాప్ పెట్టడానికి ఉపయోగించాలి.
- ➔ వాషింగ్ మిషన్‌ను ఒకటీ అరా బట్టల కోసం కాకుండా ఫుల్‌లోడ్‌తో ఉపయోగించాలి.
- ➔ కార్ వాషింగ్‌కు నీటిని వృథా చేయకుండా తడి బట్టతో తుడుచుకోవాలి.
- ➔ డిష్ వాషర్ ఉపయోగించడం వల్ల నీళ్ళు తక్కువ ఖర్చు అవుతాయి. అంట్లు తోమితే 60 లీటర్ల నీళ్లు కనీసం పడతాయి. డిష్ వాషర్‌లో 10 లీటర్లు సరిపోతాయి.
- ➔ ప్లంబర్‌ని పిలిచి అన్నీ లీకులను చెక్ చేయించాలి.
- ➔ పిల్లలకు నీటి విలువ తెలియచెప్పి నీళ్లు వృథా చేయకుండా చూడాలి.

ఇంటిప్స్



కాలానుగుణంగా ఆహారంలో మార్పులే కాదు ఇంటి అలంకరణ కూడా మార్చుకోవాల్సి ఉంటుంది. అప్పుడే కాలానికి తగ్గట్టు ఇంట్లో మరింత హాయిగా ఉండగలరు. తక్కువ బడ్జెట్‌లో ఈ వేసవిలో మనసుకు నచ్చేలా ఇంటిలోపల సృజనాత్మకంగా మార్చుకోవచ్చు.

హాయి గొలిపే అలంకరణ

- మొక్కలు, పువ్వులు ఎప్పుడూ ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదంగా మారుస్తాయి. అందుకని, రోజులో ఎక్కువసార్లు చూసే ఎదురుగోడ వైపు నచ్చిన పూల మొక్కల కుండీలను లేదా ఫ్లవర్ వేజ్‌లను అలంకరిస్తే ఆ రంగులు చూపులకు, మనసుకు హాయిని కలిగిస్తాయి.
- విండోస్‌లో వరుసలుగా వస్తున్న స్టెప్ హ్యాంగర్స్ పూల కుండీల సెట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. వేసవి వేడి గాలి తగ్గుతుంది. ఇంటి వాతావరణం ఆహ్లాదంగానూ ఉంటుంది.
- గది అలంకరణలో ఒక పాతకాలపు కుర్చీ లేదా ఆర్ట్‌పీస్, నగిషీలతో ఉండే బామ్మల కాలం నాటి అద్దం.. ఇలా ఏదో ఒకటి వెనకటి తరానికి చెందిన వస్తువును ఉపయోగించాలి. వాడకుండా పడేసిన యాంటిక్ పీస్‌ను కొద్దిగా మెరుగుపరిచి కూడా ఇలా అలంకరణలో వాడచ్చు. దీని వల్ల గది అందంలో ప్రత్యేకత కనిపిస్తుంది.
- సోఫా, బెడ్ కుషన్ కవర్లు తక్కువ ఖర్చువే అయినా మంచి బ్రైట్ కలర్ ఉన్నవి ఎంచుకోవాలి. చెక్క లేదా డల్ ఫర్నీచర్ ఉంటే లేత, కాంతిమంతమైన రంగుల కాంబినేషన్లతో కుషన్ కవర్లు ఎంచుకుంటే చాలు ఇంటి అలంకరణలో స్పష్టమైన తేడా కనిపిస్తుంది.
- గది లోపలి గోడల రంగులు తేలికపాటివి ఉంటే కుషన్ కవర్లు ముదురు రంగులు ఎంచుకోవాలి. గోడల రంగులు గాఢత గల ముదురు రంగులు ఉంటే కుషన్ కవర్ల రంగులు లేతవి కాంట్రాస్ట్‌గా ఎంచుకుంటారు. వేసవి కాలం ఇంటిలోపల లేత రంగుల అలంకరణ మనసుకు హాయిని కలిగిస్తుంది.

గెలుపు దారి

కోడర్ టు రియల్ ఎస్టేట్ క్వీన్



రియల్ ఎస్టేట్ రంగంలో మహిళల పేర్లు అరుదుగా వినిపిస్తాయి. కోడర్, స్ట్రాటజీ కన్సల్టెంట్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్, సీయీవోగా మంచి పేరు తెచ్చుకున్న 39 సంవత్సరాల అనన్య త్రిపాఠి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగు పెట్టి విజయం సాధించింది. 'రియల్ ఎస్టేట్ క్వీన్'గా పేరు తెచ్చుకుంది...

ఆర్మీ ఆఫీసర్ కూతురు అయిన అనన్య త్రిపాఠి తరచుగా ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు మారుతూ ఉండేది. 'రకరకాల ప్రాంతాలలో చదువుకోవడం వల్ల ఎన్నో సంస్కృతుల గురించి తెలుసుకునే అవకాశం, అదృష్టం దొరికింది' అంటుంది అనన్య.

పుణెలోని ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ పూర్తిగా చేసిన అనన్య ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ కంపెనీ 'టీసీఎస్' తొలి ఉద్యోగం చేసింది.

కోడర్‌గా మంచి పేరు వచ్చినా తన దృష్టి వ్యాపారంగంపై మళ్లింది. అలా కోళికోడ్ -ఐఐఎంలో ఎంబీఏ చేసింది. క్యాంపస్ సెలెక్షన్‌లో 'మెకిన్సీ'కి ఎంపికైన ఏకైక స్టూడెంట్ అనన్య.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ కంపెనీ 'మెకిన్సీ'లో ఏడు సంవత్సరాల ప్రయాణం తనకు ఎన్నో పాఠాలు నేర్పింది.

మార్గదర్శకులలాంటి వ్యక్తులతో పరిచయం జరిగింది.

విశ్లేషణాత్మకంగా ఉండడంతో పాటు స్ట్రక్చర్డ్ డాటా తాలూకు సమస్యలను పరిష్కారించడానికి సంబంధించిన జ్ఞానాన్ని మెకిన్సీలో సొంతం చేసుకుంది. అయితే ఫ్యాషన్ ఇ-కామర్స్ కంపెనీ 'మింత్రా' నుంచి వచ్చిన అవకాశం అనన్య కెరీర్‌ను మార్చి వేసింది. ఇ-కామర్స్ గురించి ఎన్నో సందేహాలు ఉన్న ఆ కాలంలో 'మింత్రా' నుంచి వచ్చిన ఆఫర్‌కు వెంటనే ఓకే చెప్పడం కష్టమే. అయినప్పటికీ సందేహాలను పక్కన పెట్టి చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ హోదాలో 'మింత్రా'లో చేరింది అనన్య. మూడున్నరేళ్లలో 'మింత్రా' లాభాలను పెంచింది.

ఆ తరువాత గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్మ్ 'కేకేఆర్ కేప్‌స్టోన్' నుంచి కొత్త కెరీర్ ఆపర్చునిటీ వెదుక్కుంటూ వచ్చింది. 'కేకేఆర్'లో మాక్స్ హెల్త్‌కేర్, వినీ కాస్మెటిక్స్‌లాంటి కంపెనీలతో కలిసి పనిచేసింది. అనన్య మెటర్నిటీ లీవ్‌లో ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ గ్రూప్ 'బ్రూక్‌ఫీల్డ్' నుండి పిలుపు వచ్చింది. మామూలుగానైతే మెటర్నిటీ బ్రేక్‌లో ఉన్నప్పుడు సెలవు కాలం పూర్తయ్యేంత వరకు చాలా కంపెనీలు వేచి చూడవు. అయితే బ్రూక్‌ఫీల్డ్ మాత్రం అనన్య ప్రతిభాసామర్థ్యాలపై నమ్మకంతో ఓపిగ్గా వేచి చూసింది.


వారి నమ్మకాన్ని అనన్య వమ్ము చేయలేదు.

'పలు పరిశ్రమలకు సంబంధించి ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్‌లలో అనన్యకు అపారమైన అనుభవం ఉంది. స్ట్రాటజీ కన్సల్టెంట్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా ఆమె ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది' అంటాడు బ్రూక్‌ఫీల్డ్ రియల్ ఎస్టేట్ మేనేజింగ్ పార్టనర్ అంకుర్ గుప్తా.


బ్రూక్‌ఫీల్డ్ రియల్ ఎస్టేట్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మరోసారి గెలుపు జెండా ఎగరేసిన అనన్య త్రిపాఠి నుంచి వినిపించే సక్సెస్‌మంత్రా 'కంఫర్ట్ జోన్ నుంచి బయటికి రావాలి'.

సాగుబడి

ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు
రేవతి కార్తె: 31 నుంచి



బెడ్స్ మధ్యలో రాళ్ల భూమి



బెడ్స్ మధ్య కలుపు ఆచ్ఛాదన



మామిడి తోటలో వీసీ డా. నీరజా ప్రభాకర్ తదితరులు



కలుపు ఆచ్ఛాదనపై సస్యగవ్య పిచికారీ

సస్యగవ్యతో బంజరు భూమి సాగు!

- ప్రకృతి సేద్యంపై శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ వినూత్న ప్రయోగం
- జీవామృతం కూడా వాడకుండా కేవలం.. కలుపు మొక్కలతో తయారు చేసే 'సస్యగవ్య'తోనే భూసారం పెంపు!
- నాలుగేళ్లలో గణనీయంగా పెరిగిన సేంద్రియ కర్బనం, సేంద్రియ పదార్థం, టోటల్ నత్రజని
- బంజర్లు, నిస్సారమైన భూములను ఖర్చు లేకుండా సాగులోకి తెచ్చే ఫలప్రదమైన మార్గం ఇది అంటున్న వర్సిటీ

మన దేశంలో 28.7% భూమి (9 కోట్ల 78 లక్షల హెక్టార్ల భూమి బంజరు భూమి ఉంది. విచ్చలవిడిగా రసాయనాల వినియోగం వల్ల పూర్తిగా నిస్సారమై సాగుయోగ్యం కాకుండా పోయిన భూమి కూడా ఇందులో కలసి ఉంది. ఇటువంటి రాళ్లు రప్పలతో కూడిన బంజరు, నిస్సారమైన భూములను సైతం కేవలం ద్రవరూప ఎరువు 'సస్యగవ్య'తో పునరుజ్జీవింపచేయ వచ్చని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ ప్రయోగాత్మకంగా రుజువు చేసింది.

వేదకాలం నాటి కృషిపరాశర గ్రంథం నుంచి తీసుకున్న సాగు పద్ధతిలో బంజరు భూములను, నిస్సారమైన భూములను పునరుజ్జీవింపజేస్తూ తిరిగి సాగులోకి తేవడానికి ఉపయోగపడే వినూత్న ప్రకృతి సేద్య పద్ధతిని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ అనుసరిస్తోంది. అనేక రకాల పండ్ల మొక్కలను ఐదేళ్లుగా ఈ పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తోంది. వనపర్తి జిల్లా మదనాపురంలోని ఉద్యాన బోధనా క్షేత్రంలో 11 ఎకరాల రాళ్లతో కూడిన బంజరు భూమిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జడల శంకరస్వామి 2019 నుంచి ఈ ప్రయోగాత్మక సాగు పద్ధతిని అవలంభిస్తూ భూమిని క్రమంగా సారవంతం చేస్తున్నారు.

ఎత్తుమడులు.. అధిక సాంద్రత...

11 ఎకరాలను ఎకరం ప్లాట్లుగా చేసి నేల తీరుకు సరిపోయే పంటలను సాగు చేస్తున్నారు. ఉదాహరణకు రాళ్లు రప్పలతో కూడిన నేలలో దానిమ్మ (భగువ) రకం మొక్కల్ని అధిక సాంద్రతలో ఎకరానికి 300 నాటారు. అదేవిధంగా, 7 రకాల మామిడి, మూడు రకాల అంజూర, జామ, మునగ తదితర తోటలను వేశారు.

భూమిని దుక్కి చేసి 2.5 అడుగులు (75 సెం.మీ.) వెడల్పుతో.. సాళ్ల మధ్యలో మీటరు లోతున తవ్విన మట్టిని పోసి 2 మీటర్ల ఎత్తున బెడ్స్ చేశారు. సాళ్ల మధ్య 16 అడుగులు, మొక్కల మధ్య 10 అడుగుల దూరం పాటించారు.

ఎత్తుమడులపై మొక్కలు అధిక సాంద్ర పద్ధతిలో నాటి డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్నారు. గుంతకు 5 కిలోల వర్మీ కంపోస్టు వేసి మొక్కలు నాటారు. ఇక ఆ తర్వాత ఎటువంటి రసాయనిక ఎరువులు గానీ, సేంద్రియ ఎరువులు గానీ, పిచికారీలు గానీ చేయటం లేదు.

కలుపు మొక్కలే బలం!

ఏ పొలంలో మొలిచే కలుపు మొక్కలను పీకి ఆ పొలంలోనే ఆచ్ఛాదనగా వాడటంతో పాటు.. ఆ మొక్కలను మురగబెట్టి సస్యగవ్య అనే ద్రవ రూప ఎరువును తయారు చేస్తున్నారు. దీన్ని అదే పొలంలో గడ్డీ గాదాన్ని కుళ్లించడానికి వినియోగించటం ద్వారా భూమిని సారవంతం చేసుకోవచ్చు. బంజరు భూముల్ని, సారం కోల్పోయిన భూముల్ని సాగులోకి తేవటానికి బయటి నుంచి ఎటువంటి ఉత్పాదకాలను ఖర్చుపెట్టి కొని తెచ్చి వేయాల్సిన అవసరం లేదని రైతులకు తెలియజెప్పడానికే ఈ ప్రయోగాన్ని చేపట్టామని డా. శంకర స్వామి 'సాక్షి సాగుబడి'కి వివరించారు. కలుపు మొక్కలుగా మనం భావించేవాటిలో చాలా మటుకు నిజానికి ఔషధ మొక్కలేనని అంటూ.. వాటిని పీకి పారేయటం కాకుండా అదే నేలలో కలిపేస్తే చాలు.

ఇక ఏ రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపుమందులు చల్లకుండా ఉంటే.. ఆ భూమిలోనే ఉండే సూక్ష్మజీవరాశి సంరక్షించబడి భూమిని క్రమంగా సారవంతం చేస్తుందని ఆయన తెలిపారు.గులక రాళ్లు సైతం భూసారాన్ని పెంపొందించడానికి దోహదపడుతాయని తమ అనుభవంలో వెల్లడైందన్నారు.

గణనీయంగా పెరిగిన సేంద్రియ కర్బనం

సస్యగవ్యతో సేద్యం చేయనారంభించిన తొలి దశలో, నాలుగేళ్ల తర్వాత పండ్ల తోటలో భూసార పరీక్షలు చేయించగా భూసారం గణనీయంగా వృద్ధి చెందింది. 11 ఎకరాల్లో సగటున సేంద్రియ కర్బనం 0.24 నుంచి 0.53కి, సేంద్రియ పదార్థం 0.1 నుంచి 1%కి పెరిగింది. వీటితో పాటు మట్టిలో టోటల్ నైట్రోజన్ 0.015 నుంచి 0.045కి పెరిగిందని డా. శంకర స్వామి తెలిపారు.

సస్యగవ్యను వరుసగా నాలుగేళ్లు వాటం వల్ల సాగుకు యోగ్యం కాని భూమిని కూడా తిరిగి సారవంతం చేయటం సాధ్యమేనన్నారు. ఒక్కో రకం పండ్ల తోట సాగులో ఉన్న తోటలో వేర్వేరు రకాల కలుపు మొక్కలు, ఔషధ మొక్కలు మొలుస్తున్న విషయం గుర్తించామన్నారు.

మట్టిలోని గులకరాళ్లు కూడా పరోక్షంగా మట్టిని సారవంతం చేయడానికి పరోక్షంగా దోహదపడుతున్నట్లు కూడా గుర్తించామని అంటూ.. సాగు భూమిలోని గులక రాళ్లు పనికిరానివేమీ కాదన్నారు.

ఇంతకీ దిగుబడి ఎంత?



స్వల్ప ఖర్చుతోనే బంజరు భూముల్ని, రసాయనిక వ్యవసాయం వల్ల నిస్సారమైన భూముల్ని తిరిగి సారవంతం చేసుకొని ఫలసాయాన్నిచ్చేలా పునరుజ్జీవింపచేయొచ్చని మా ప్రయోగం రుజువు చేసింది. సస్యగవ్యతో కూడిన ప్రకృతి సేద్యంలో 4 ఏళ్ల తర్వాత ఒక్కో దానిమ్మ (భగువ) చెట్టుకు 3.96 కిలోల పండ్లు, అంజూర (డయాన) చెట్టుకు 13.8 కిలోల పండ్లు, జామ (అలహాబాద్ సఫేది) చెట్టుకు 11.65 కిలోల దిగుబడి వచ్చింది. బయటి నుంచి ఏదీ కొని వేయకుండా సాధించిన ఫలసాయం ఇది.

– డా. జడల శంకరస్వామి (97010 64439),
ఉద్యాన కళాశాల, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం



'సస్యగవ్య' తయారీ ఇలా...

పొలంలో మొలిచిన కలుపు మొక్కలను ఏడాదికి మూడు దఫాలు పీకి వాటితో సస్యగవ్యను డా. శంకర స్వామి తయారు చేయిస్తున్నారు. ఆ పొలంలోని తాజా కలుపు మొక్కలు కిలో, తాజా ఆవు పేడ కిలో, ఆవు మూత్రం లీటరు, రెండు లీటర్ల నీటి (1:1:1:2)తో కలిపి పొలంలోనే నీడన ఫైబర్ పీపాల్లో మురగబెడుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం కలియదిప్పుతుంటే 10-12 రోజుల్లో సస్యగవ్య ద్రవ రూప ఎరువు సిద్ధమవుతుంది.

ఆ పొలంలోనే సాళ్ల మధ్యలో ఆచ్ఛాదనగా వేసిన గడ్డీ గాదం, ఆకులు అలములు, కొమ్మలు రెమ్మలపై సస్యగవ్యను 1:1 పాళ్లలో నీరు కలిపి పిచికారీ చేస్తున్నారు. వారం తర్వాత ఆ గడ్డీ గాదాన్ని రొటోవేటర్‌తో మట్టిలో కలియదున్ని, ఆ మట్టిపై మరోసారి సస్యగవ్యను పిచికారీ చేస్తున్నారు. తద్వారా ఈ సేంద్రియ పదార్థం కుళ్లి మట్టిలో కలిసిపోయి భూమి సారవంతం అవుతోంది.

ఏడాదిలో మూడు సీజన్లలో కొత్తగా కలుపు మొలిచినప్పుడు ఆ కలుపు మొక్కలతో మాత్రమే దీన్ని తయారు చేసి వాడుతున్నారు. భూమిని సారవంతం చేయటానికి ఈ ఒక్క పని తప్ప మరే ఎరువూ వేయటం లేదు. డ్రిప్ ద్వారా అవసరం మేరకు నీరు మాత్రం క్రమం తప్పకుండా ఇస్తున్నారు. రైతులు అనుసరించడానికి ఇది చాలా అనువైన, ఖర్చులేని పద్ధతని డా. శంకరస్వామి అంటున్నారు.

గుంటూరులో చిరుధాన్య వంటకాలపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈనెల 30, 31, ఏప్రిల్ 1 తేదీలలో ఉ. 10-5 గంటల వరకు చిరుధాన్యాలతో తయారుచేసే వివిధ రకాల వంటకాలపై శిక్షణ కార్యక్రమం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ రైతు శిక్షణా కేంద్రంలో జరుగుతుంది. మిల్లెట్స్ రాంబాబు తదితరులు ప్రత్యక్షంగా చిరుధాన్యాలతో అనేక వంటకాల తయారీ విధానాన్ని తెలియజేస్తారు. వసతి, మిల్లెట్ భోజనం సదుపాయం ఉంది. పాల్గొనదలచినవారు 97053 83666 / 95538 25532కు ఫోన్ చేసి తప్పనిసరిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వేంకటేశ్వరరావు తెలిపారు.

ఎడ్ల బండితో పిచికారీ!

- యువ రైతు మక్బూం అలీ ఆవిష్కరణ
- 15 నిమిషాల్లోనే ఎకరాకు పురుగుల మందు పిచికారీ

కూలీల సమస్యను అధిగమించడంతోపాటు పెట్టుబడి తగ్గించుకునే ఆలోచనతో ఓ యువరైతు వినూత్న స్ప్రేయర్‌ను రూపొందించారు. ఎడ్లబండిపై పెట్టుకొని ఉపయోగించుకునేందుకు ఈ స్ప్రేయర్ అనువైనది కావటం విశేషం. అందరి మన్ననలు అందుకుంటున్న మక్బూం అలీపై ప్రత్యేక కథనం.

నారాయణపేట జిల్లా నర్వ మండలం కల్వాల్ గ్రామానికి చెందిన మక్బూం అలీ(38)కి మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆర్థిక స్థోమత లేక ఇంటర్‌తోనే చదువు ఆపేసి వ్యవసాయంలో స్థిరపడ్డారు. సాగునీటి ఇబ్బందులున్నప్పటికీ.. రెండెకరాల్లో కంది, ఆముదాలు, పత్తితోపాటు మరో ఎకరా పొలంలో వరి సాగు చేస్తున్నారు. ఏటా పెట్టుబడి పెరగడం, రాబడి తగ్గుతుండడంతో ఖర్చు ఎలా తగ్గించుకోవాలని ఆలోచిస్తుంటారు. పురుగు మందులతోపాటు కూలీల ఖర్చు తగ్గించేందుకు ప్రయత్నించే క్రమంలో ఈ ఆవిష్కరణ వెలుగుచూసింది. ఎడ్ల బండిపై 5 హెచ్‌పీ ఇంజిన్, స్ప్రే పంపు, బ్యాటరీ, డైనమో, రెండు వైఫర్ మోటర్లు, రెండు డ్రమ్ములు, రెండు స్ప్రేయింగ్ గన్లతో సుమారు రూ.45 వేల వ్యయంతో అలీ దీన్ని రూపొందించారు. ఎడ్ల బండిపై కూర్చున్న రైతు బండిని తోలుకెళ్తూ ఉంటే.. బండి వెనుక వైపు బిగించిన రెండు స్ప్రేగన్లు ఏకకాలంలో పిచికారీ చేస్తాయి. అటు 20 అడుగులు, ఇటు 20 అడుగుల (దాదాపు ఆరు సాళ్లు) వరకు పురుగుల మందును ఈ యంత్రం పిచికారీ చేస్తుంది. మనిషి అవసరం లేకుండానే రెండు స్ప్రేగన్లు, రెండు డ్రమ్ముల ద్వారా 15 నిమిషాల్లోనే ఎకరం పొలంలో మందు పిచికారీ చేస్తాయి. ఎడ్లబండిపై కూర్చునే వ్యక్తికి, ఎద్దులకు మూడు నుంచి నాలుగు మీటర్ల దూరంలో వెనుక వైపున పురుగుమందు పిచికారీ అవుతున్నందున ఇబ్బంది ఉండదు. అలీని కలెక్టర్ ప్రశంసించడమే కాకుండా 'ఇంటింటా ఇన్నోవేషన్'కు ఎంపిక చేశారు. టీహబ్ అధికారులూ ప్రశంసించారు.

– పెరుమాండ్ల కిషోర్ కుమార్,
సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్
ఫొటోలు: సుదర్శన్‌గౌడ్, నర్వ



ఎడ్ల బండిపై నుంచి స్ప్రేగన్ సహాయంతో పురుగుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం

స్ప్రేగన్‌తో వేగంగా మందులు పిచికారీ



రసాయనిక వ్యవసాయంలో తెగుళ్ల బెడద ఎక్కువ. పంటలపై వాటి తీవ్రత అధికంగా ఉంటుంది. ఒక్కో సందర్భంలో ఒక్క రోజులోనే పంట మొత్తానికి తెగుళ్లు వ్యాపించొచ్చు. నేను రూపొందించిన స్ప్రేగన్‌తో వేగంగా మందులు పిచికారీ చేయొచ్చు. దీంతోపాటు నిర్దేశించిన మేరకు ఖచ్చితత్వంతో ఎరువులు వేసేలా రూ.500 ఖర్చుతో పరికరాన్ని రూపొందించాను. కూలీలు అవసరం లేకుండా రైతు ఒక్కరే ఎరువులు వేసుకోవచ్చు. శాస్త్రవేత్త కావాలన్నది నా సంకల్పం. అయితే ఆర్థిక స్థోమత లేమి కారణంగా చదువు మధ్యలోనే ఆగింది. నాకున్న ఆలోచనతో స్ప్రేగన్ తయారు చేసిన. ప్రభుత్వ ప్రోత్సహించాలని కోరుతున్నా.

– మక్బూం అలీ (97038 20608),
యువ రైతు, కల్వాల్, నర్వ



ప్రీక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ప్రీక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఫ్లోరిడాలో సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 4–6, 7–6 (7/4), 10–4తో బొలెలీ–వావాసోరి (ఇటలీ) జోడీని ఓడించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–వీనస్ (న్యూజిలాండ్) జంట 6–7 (5/7), 4–6తో డోడిగ్ (క్రొయేషియా)–ఆస్టిన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడింది.

మనుష్–మానవ్‌లకు డబుల్స్ టైటిల్



లెబనాన్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఫీడర్ లెవెల్ రెండో టోర్నీలో భారత్‌కు చెందిన మనుష్ షా–మానవ్ ఠక్కర్ జోడీ డబుల్స్ టైటిల్ సాధించింది. బీరుట్‌లో జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మనుష్–మానవ్ ద్వయం 11–7, 11–5, 9–11, 11–6తో భారత్‌కే చెందిన ముదిత్–ఆకాశ్ పాల్ జోడీపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సత్యన్ జ్ఞానశేఖరన్–మనిక బత్రా (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది.

గెలుపే లక్ష్యంగా భారత్

- నేడు అఫ్గానిస్తాన్‌తో ఫుట్‌బాల్ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్
- కెప్టెన్ సునీల్ ఛెత్రికి 150వ మ్యాచ్



గువాహటి: భారత ఫుట్‌బాల్ జట్టు ఇప్పుడు సొంతగడ్డపై అఫ్గానిస్తాన్‌తో పోరుకు సిద్ధమైంది. 2026 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో భాగంగా సౌదీ అరేబియాలో జరిగిన అఫ్గానిస్తాన్ హోం మ్యాచ్ ఒక్క గోల్ నమోదు కాకుండానే 'డ్రా'గా ముగిసింది. ఇప్పుడు సొంత ప్రేక్షకుల మధ్య మంగళవారం జరిగే పోరులో భారత్ గోల్సే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18 చానెల్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. మరోవైపు భారత దిగ్గజం, కెప్టెన్ సునీల్ ఛెత్రికిది 150వ అంతర్జాతీయ మ్యాచ్ కానుంది. 2005లో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అరంగేట్రం చేసిన సునీల్ ఛెత్రి... 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 93 గోల్స్ చేశాడు.

శ్రీలంక ఘనవిజయం

328 పరుగులతో ఓడిన బంగ్లాదేశ్



సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 328 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో లంక 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కష్టసాధ్యమైన 511 పరుగుల లక్ష్యం ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 47/5తో నాలుగో రోజు సోమవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లాదేశ్ 49.2 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. క్రితం రోజు బ్యాటర్ మోమినుల్ హక్ (87 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటంతో బంగ్లాదేశ్ ఆమాత్రం స్కోరు చేసింది. ప్రధాన బ్యాటర్లంతా చేతులెత్తేసినా... మిరాజ్ (33)తో మోమినుల్ ఏడో వికెట్‌కు 66 పరుగులు, తర్వాత షోరీఫుల్ ఇస్లామ్ (12)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 47 పరుగులు జత చేశాడు. శ్రీలంక పేసర్ కసున్ రజిత (5/56) బంగ్లాదేశ్‌ను దెబ్బ కొట్టాడు. ఇరుజట్ల మధ్య రెండో టెస్టు ఈ నెల 30 నుంచి చటోగ్రామ్‌లో జరుగుతుంది.

బెంగళూరు బల్లే బల్లే...

ఐపీఎల్ సీజన్ తొలి ఐదు మ్యాచ్‌లలో సొంతగడ్డపై ఆడిన జట్లే గెలిచాయి... ఆరో మ్యాచ్‌లో ఒకదశలో పరిస్థితి కాస్త భిన్నంగా అనిపించింది. సాధారణ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు కాస్త తడబడింది. అయితే దినేశ్ కార్తీక్ దూకుడైన ఇన్నింగ్స్ చిన్నస్వామి మైదానంలో ఆర్‌సీబీకి కావాల్సిన విజయాన్ని అందించింది. బ్యాటింగ్ వైఫల్యంతో పంజాబ్ వెనుకబడగా... కోహ్లి అర్ధసెంచరీతో తన జట్టుకు చుక్కానిలా నిలిచాడు.

ఆర్‌సీబీకి తొలి విజయం

- 4 వికెట్లతో పంజాబ్ ఓటమి
- కోహ్లి అర్ధసెంచరీ



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి

బెంగళూరు: ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌లో ఓడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మలి పోరులో విజయాన్ని సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన పోరులో ఆర్‌సీబీ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. శిఖర్ ధావన్ (37 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బెంగళూరు 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు చేసి గెలిచింది. కోహ్లి (49 బంతుల్లో 77; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా... దినేశ్ కార్తీక్ (10 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు.

కీలక భాగస్వామ్యాలు...

తొలి 3 ఓవర్లలో 10 పరుగులు... యశ్ దయాళ్ స్పెల్ ఇది! ఈ బౌలింగ్ వల్లే పంజాబ్‌కు సరైన ఆరంభం లభించలేదు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 40 పరుగులు కాగా... బెయిర్‌స్టో (8) పెవిలియన్ చేరాడు. అనంతరం ధావన్, ప్రభ్‌సిమ్రన్ (17 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 38 బంతుల్లో 55 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేసి మ్యాక్స్‌వెల్ ఈ జోడీని విడదీయగా... కొద్ది సేపటికే వరుస బంతుల్లో లివింగ్‌స్టోన్ (17), ధావన్ వెనుదిరగడం జట్టును దెబ్బ తీసింది. ఈ దశలో స్యామ్ కరన్ (17 బంతుల్లో 23; 3 ఫోర్లు), జితేశ్ శర్మ (20 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే ఆరు బంతుల వ్యవధిలో వీరిద్దరూ అవుటయ్యారు. జోసెఫ్ వేసిన చివరి ఓవర్లో శశాంక్ సింగ్ (21 నాటౌట్) దూకుడుగా ఆడి 2 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో కింగ్స్ మెరుగ్గా ముగించగలిగింది.



దినేశ్ కార్తీక్

కోహ్లి జోరు...

ఛేదనలో కరన్ వేసిన తొలి ఓవర్లోనే 4 ఫోర్లతో కోహ్లి జోరుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టాడు. ఈ ఓవర్ రెండో బంతికే 'సున్నా' వద్ద కోహ్లి ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో బెయిర్‌స్టో వదిలేయడం కూడా కలిసొచ్చింది. అర్ష్‌దీప్ ఓవర్లో కూడా అతను 3 ఫోర్లతో ఆధిక్యం ప్రదర్శించారు. అయితే మరో ఎండ్‌లో ఏ బ్యాటర్ కూడా ప్రభావం చూపలేకపోయారు. డుప్లెసిస్ (3), గ్రీన్ (3), మ్యాక్స్‌వెల్ (3) పూర్తిగా విఫలం కాగా... చహర్ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టినా... రజత్ పటిదార్ (18) కూడా ఎక్కువసేపు నిలవలేదు. దాంతో భారం మొత్తం కోహ్లిపైనే పడింది. 31 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. 25 బంతుల్లో 47 పరుగులు చేయాల్సిన స్థితిలో కోహ్లి అవుట్ కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే కార్తీక్, లోమ్రోర్ (17 నాటౌట్) కలిసి నాలుగు బంతుల ముందే ఆర్‌సీబీని గెలిపించారు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (సి) కోహ్లి (బి) మ్యాక్స్‌వెల్ 45; బెయిర్‌స్టో (సి) కోహ్లి (బి) సిరాజ్ 8; ప్రభ్‌సిమ్రన్ (సి) రావత్ (బి) మ్యాక్స్‌వెల్ 25; లివింగ్‌స్టోన్ (సి) రావత్ (బి) జోసెఫ్ 17; కరన్ (సి) రావత్ (బి) దయాళ్ 23; జితేశ్ (సి) రావత్ (బి) సిరాజ్ 27; శశాంక్ (నాటౌట్) 21; బ్రార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 176. వికెట్ల పతనం:** 1–17, 2–72, 3–98, 4–98, 5–150, 6–154. **బౌలింగ్:** సిరాజ్ 4–0–26–2, యశ్ దయాళ్ 4–0–23–1, జోసెఫ్ 4–0–43–1, గ్రీన్ 2–0–19–0, డాగర్ 3–0–34–0, మ్యాక్స్‌వెల్ 3–0–29–2. **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** కోహ్లి (సి) బ్రార్ (బి) హర్షల్ 77; డుప్లెసిస్ (సి) కరన్ (బి) రబాడ 3; గ్రీన్ (సి) జితేశ్ (బి) రబాడ 3; పటిదార్ (బి) బ్రార్ 18; మ్యాక్స్‌వెల్ (బి) బ్రార్ 3; రావత్ (ఎల్బీ) (బి) కరన్ 11; కార్తీక్ (నాటౌట్) 28; లోమ్రోర్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రా లు 18; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–26, 2–43, 3–86, 4–103, 5–130, 6–130. **బౌలింగ్:** కరన్ 3–0–30–1, అర్ష్‌దీప్ 3.2–0–40–0, రబాడ 4–0–23–2, బ్రార్ 4–0–13–2, హర్షల్ 4–0–45–1, చహర్ 1–0–16–0.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X గుజరాత్
వేదిక: చెన్నై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మే 26న చెన్నైలో ఐపీఎల్ ఫైనల్

- 2012 తర్వాత మళ్లీ టైటిల్ పోరుకు ఆతిథ్యం
- అహ్మదాబాద్‌లో క్వాలిఫయర్–1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు
- ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన బీసీసీఐ



ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ సోమవారం ప్రకటించింది. మే 26న ఐపీఎల్ ఫైనల్‌కు చెన్నై ఆతిథ్యమిస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. 2012 తర్వాత చెన్నైలో మళ్లీ ఐపీఎల్ టైటిల్ పోరు జరగనుండటం విశేషం. మే 19వ తేదీతో లీగ్ దశ మ్యాచ్‌లు పూర్తవుతాయి. అనంతరం మే 21న క్వాలిఫయర్–1 మ్యాచ్‌కు... మే 22న ఎలిమినేటర్ మ్యాచ్‌కు అహ్మదాబాద్ వేదిక కానుంది. మే 24న చెన్నైలో క్వాలిఫయర్–2 మ్యాచ్... మే 26న ఫైనల్ మ్యాచ్ చెన్నైలో జరుగుతాయి. సార్వత్రిక ఎన్నికల తేదీలు ఖరారు కాకముందు ఫిబ్రవరిలో బీసీసీఐ ఏప్రిల్ 7 వరకు 21 మ్యాచ్‌లతో కూడిన తొలి దశ షెడ్యూల్‌ను విడుదల చేసింది.

ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక
ఏప్రిల్ 8	చెన్నై X కోల్‌కతా	చెన్నై
ఏప్రిల్ 9	పంజాబ్ X హైదరాబాద్	మొహాలి
ఏప్రిల్ 10	రాజస్తాన్ X గుజరాత్	జైపూర్
ఏప్రిల్ 11	ముంబై X బెంగళూరు	ముంబై
ఏప్రిల్ 12	లక్నో X ఢిల్లీ	లక్నో
ఏప్రిల్ 13	పంజాబ్ X రాజస్తాన్	మొహాలి
ఏప్రిల్ 14	కోల్‌కతా X లక్నో	కోల్‌కతా
ఏప్రిల్ 14	ముంబై X చెన్నై	ముంబై
ఏప్రిల్ 15	బెంగళూరు X హైదరాబాద్	బెంగళూరు
ఏప్రిల్ 16	గుజరాత్ X ఢిల్లీ	అహ్మదాబాద్
ఏప్రిల్ 17	కోల్‌కతా X రాజస్తాన్	కోల్‌కతా
ఏప్రిల్ 18	పంజాబ్ X ముంబై	మొహాలి
ఏప్రిల్ 19	లక్నో X చెన్నై	లక్నో
ఏప్రిల్ 20	ఢిల్లీ X హైదరాబాద్	ఢిల్లీ
ఏప్రిల్ 21	కోల్‌కతా X బెంగళూరు	కోల్‌కతా
ఏప్రిల్ 21	పంజాబ్ X గుజరాత్	మొహాలి
ఏప్రిల్ 22	రాజస్తాన్ X ముంబై	జైపూర్
ఏప్రిల్ 23	చెన్నై X లక్నో	చెన్నై
ఏప్రిల్ 24	ఢిల్లీ X గుజరాత్	ఢిల్లీ
ఏప్రిల్ 25	హైదరాబాద్ X బెంగళూరు	హైదరాబాద్
ఏప్రిల్ 26	కోల్‌కతా X పంజాబ్	కోల్‌కతా
ఏప్రిల్ 27	ఢిల్లీ X ముంబై	ఢిల్లీ
ఏప్రిల్ 27	లక్నో X రాజస్తాన్	లక్నో
ఏప్రిల్ 28	గుజరాత్ X బెంగళూరు	అహ్మదాబాద్
ఏప్రిల్ 28	చెన్నై X హైదరాబాద్	చెన్నై
ఏప్రిల్ 29	కోల్‌కతా X ఢిల్లీ	కోల్‌కతా
ఏప్రిల్ 30	లక్నో X ముంబై	లక్నో
మే 1	చెన్నై X పంజాబ్	చెన్నై
మే 2	హైదరాబాద్ X రాజస్తాన్	హైదరాబాద్
మే 3	ముంబై X కోల్‌కతా	ముంబై
మే 4	బెంగళూరు X గుజరాత్	బెంగళూరు
మే 5	పంజాబ్ X చెన్నై	ధర్మశాల
మే 5	లక్నో X కోల్‌కతా	లక్నో
మే 6	ముంబై X హైదరాబాద్	ముంబై
మే 7	ఢిల్లీ X రాజస్తాన్	ఢిల్లీ
మే 8	హైదరాబాద్ X లక్నో	హైదరాబాద్
మే 9	పంజాబ్ X బెంగళూరు	ధర్మశాల
మే 10	గుజరాత్ X చెన్నై	అహ్మదాబాద్
మే 11	కోల్‌కతా X ముంబై	కోల్‌కతా
మే 12	చెన్నై X రాజస్తాన్	చెన్నై
మే 12	బెంగళూరు X ఢిల్లీ	బెంగళూరు
మే 13	గుజరాత్ X కోల్‌కతా	అహ్మదాబాద్
మే 14	ఢిల్లీ X లక్నో	ఢిల్లీ
మే 15	రాజస్తాన్ X పంజాబ్	గువాహటి
మే 16	హైదరాబాద్ X గుజరాత్	హైదరాబాద్
మే 17	ముంబై X లక్నో	ముంబై
మే 18	బెంగళూరు X చెన్నై	బెంగళూరు
మే 19	హైదరాబాద్ X పంజాబ్	హైదరాబాద్
మే 19	రాజస్తాన్ X కోల్‌కతా	గువాహటి
మే 21	క్వాలిఫయర్-1	అహ్మదాబాద్
మే 22	ఎలిమినేటర్	అహ్మదాబాద్
మే 24	క్వాలిఫయర్-2	చెన్నై
మే 26	ఫైనల్	చెన్నై

నోట్: ఒకే మ్యాచ్ ఉన్న రోజు రాత్రి గం.7:30 నుంచి... రెండు మ్యాచ్‌లు ఉన్న రోజు తొలి మ్యాచ్ మధ్యాహ్నం గం. 3:30 నుంచి, రెండో మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి జరుగుతాయి. మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్‌లో, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయి.

సినిమా

ఇక ప్రచారం తర్వాతే..!



● కమల్ హాసన్

'విక్రమ్' (2022) మూవీ బ్లాక్ బస్టర్ తర్వాత కమల్‌హాసన్ తదుపరి చిత్రం కోసం ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారు. నిజానికి శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్' (భారతీయుడు)కి సీక్వెల్‌గా కమల్ చేసిన 'ఇండియన్ 2' ఈపాటికే విడుదల కావాల్సింది. అయితే పలు కారణాల వల్ల షూటింగ్‌లో జాప్యం జరిగింది. ఈ ఏడాది ఈ చిత్రం థియేటర్‌కి వచ్చే అవకాశం ఉంది. దాదాపు పాతికేళ్ల క్రితం వచ్చిన 'ఇండియన్'కి సీక్వెల్ కావడంతో 'ఇండియన్2'పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా కమల్‌హాసన్ అంగీకరించిన మరో చిత్రంపై కూడా అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. అదే 'థగ్ లైఫ్'. కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'నాయగన్' (నాయకుడు) తర్వాత దాదాపు 35 ఏళ్లకు ఈ కాంబినేషన్ 'థగ్ లైఫ్'తో రిపీట్ అవుతోంది. అయితే ఈ చిత్రం షూటింగ్‌కి కాస్త బ్రేక్ పడింది. ఈ విషయం గురించి ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కమల్‌హాసన్ మాట్లాడుతూ – ''ఇండియన్ 2, ఇండియన్ 3' చిత్రాల షూటింగ్ పూర్తయింది. రెండో భాగం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత మూడో భాగం పనులు కూడా ఆరంభమవుతాయి. 'కల్కి 2898ఏడీ'లో గెస్ట్ రోల్ చేశాను. ఇక 'థగ్ లైఫ్' షూటింగ్‌ని ఎన్నికల ప్రచారం తర్వాత మొదలుపెడతాం'' అని స్పష్టం చేశారు. కాగా ఇప్పటివరకూ 'థగ్ లైఫ్' షూటింగ్ కొంత భాగం జరిగింది. ఈ మార్చిలో సెర్బియాలో షెడ్యూల్ ప్లాన్ చేశారు దర్శకుడు మణిరత్నం. అయితే లోక్‌సభ ఎన్నికల కారణంగా ఆ షెడ్యూల్‌ను వాయిదా వేశారు. ఎన్నికల ప్రచారం తర్వాతే ఈ షూటింగ్‌లో కమల్‌హాసన్ పాల్గొంటారు. ఈ చిత్రంలో కమల్ మూడు పాత్రల్లో కనిపిస్తారని టాక్. ఇక 'మక్కల్ నీది మయమ్' పేరిట 2018లో కమల్‌హాసన్ పొలిటికల్ పార్టీ ఆరంభించిన సంగతి తెలిసిందే.

మా డేటింగ్ మొదలైంది అప్పుడే! - విజయ్ వర్మ



● తమన్నా



● విజయ్ వర్మ

'నువ్వు కావాలయ్యా...' అంటూ 'జైలర్'లోని ప్రత్యేక పాటలో తమన్నా చేసిన డ్యాన్స్ అందర్నీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో ఎక్కువగా వార్తల్లో నిలిచిన పాటల్లో ఇదొకటి. కాగా.. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ అయితే తమన్నాతో దాదాపు ఇలానే అన్నారట. 'నీతో ఎక్కువ సమయం గడపాలని ఉంది' అని చెప్పారట విజయ్. గత ఏడాది కొత్త సంవత్సరం పార్టీలో విజయ్, తమన్నా చాలా క్లోజ్‌గా కనిపించడంతో ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. పైగా సినిమాల్లో కూడా చేయనంతగా విజయ్ వర్మతో 'లస్ట్ స్టోరీస్ 2' సిరీస్‌లో ముద్దు సన్నివేశాల్లో నటించారు తమన్నా. ఆ సిరీస్‌లో ఇద్దరి కెమిస్ట్రీ ప్రేమలో ఉన్నారేమోననే అభిప్రాయం పలువురికి కలగజేసింది. అయితే అప్పుడు కాదు.. అసలు డేటింగ్ మొదలైంది ఎప్పుడంటే అంటూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు విజయ్ వర్మ. ఆ ఇంటర్వ్యూలో విజయ్ వర్మ మాట్లాడుతూ – ''లస్ట్ స్టోరీస్ 2' అప్పుడు మేం డేటింగ్‌లో లేము. ఆ షూటింగ్ మొత్తం పూర్తయ్యాక 'ర్యాప్‌అప్ పార్టీ' ఏర్పాటు చేయాలనుకున్నారు. కానీ అది జరగలేదు. దాంతో తమన్నా, నేను, మరో ఇద్దరు పార్టీ చేసుకున్నాం. ఆ పార్టీలోనే 'నాకు నీతో ఎక్కువ సమయం గడపాలని ఉంది' అంటూ నా ఫీలింగ్‌ని తమన్నాతో చెప్పాను. ఆ తర్వాత మా ఫస్ట్ డేట్ సెట్ కావడానికి 20, 25 రోజులు పట్టింది'' అని పేర్కొన్నారు. సో.. ప్రపోజ్ చేసిన 25 రోజులకు విజయ్, తమన్నాల డేటింగ్ మొదలైందన్న మాట. ఇక ఈ ఇద్దరూ పలు సందర్భాల్లో ఒకరంటే మరొకరికి బాగా ఇష్టమన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే పెళ్లి గురించి మాత్రం క్లారిటీ ఇవ్వడంలేదు.

హిట్ కాంబినేషన్ రిపీట్

హిట్ మూవీ 'రంగస్థలం' (2018) తర్వాత హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. సోమవారం ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. రామ్‌చరణ్ కెరీర్‌లోని ఈ 17వ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణను మొదలుపెట్టి, వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ చేయాలన్నది చిత్రబృందం ప్లాన్ అని సమాచారం.



● రామ్‌చరణ్, సుకుమార్

గ్యాంగ్స్ మోత



● విశ్వక్ సేన్, ఆయేషా ఖాన్

విశ్వక్ సేన్, నేహా శెట్టి హీరో హీరోయిన్లుగా, అంజలి ఓ కీలక పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మే 17న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మోత' అనే మాస్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాలో విశ్వక్ సేన్, ఆయేషా ఖాన్ కాంబినేషన్‌లో ఈ పాట వస్తుంది. యువన్ శంకర్‌రాజా స్వరకల్పనలో చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను ఎమ్‌ఎమ్ మానసి పాడారు.

సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారా?



● తాప్సీ



● మథియాస్ బో

హీరోయిన్ తాప్సీ సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. మథియాస్, తాప్సీ వివాహం చేసుకున్నట్లుగా గతంలో కూడా వార్తలు వచ్చాయి. కానీ ఆ వార్తలను తాప్సీ ఖండించారు. అయితే తాజాగా మథియాస్, తాప్సీల వివాహం తెరపైకి వచ్చింది. అత్యంత సన్నిహితులు, బంధువుల సమక్షంలో మథియాస్, తాప్సీ వివాహబంధంతో ఒక్కటయ్యారని బాలీవుడ్ సమాచారం. వీరి పెళ్లి వేడుకలు ఈ నెల 20నే మొదలయ్యాయని, 23న వివాహం జరిగిందని టాక్. తాప్సీ మెయిన్ లీడ్‌గా నటించిన సినిమాలతో అసోసియేట్ అయిన కనికా థిల్లాన్‌తో పాటు కొందరు బాలీవుడ్ నటీనటులు తాము ఓ పెళ్లి వేడుకలో పాల్గొంటున్నామన్నట్లుగా సోషల్ మీడియాలో హింట్ ఇచ్చారు. దీంతో వీరు హాజరైంది తాప్సీ వివాహానికే అనే ప్రచారం జరుగుతోంది. మరి.. తాప్సీ, మథియాస్ పెళ్లి జరిగిందా అనే విషయంపై ఆ ఇద్దరే క్లారిటీ ఇవ్వాలి.

మనసు మురిసెను ఇలా...



● మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'మధురము కదా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'మధురము కదా.. ప్రతి ఒక నడక నీతో కలిసి ఇలా... తరగని కథ మనది కనుక మనసు మురిసెను ఇలా...' అంటూ సాగుతుంది ఈ పాట. గోపీ సుందర్ స్వరకల్పనలో శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను శ్రేయా ఘోషల్ పాడారు. ఈ పాట ఆవిష్కరణ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ – ''ఫ్యామిలీ గురించి ఆలోచించేవారి కథే ఈ చిత్రం'' అన్నారు. ''హైదరాబాద్‌లో హోలీ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. మీ ఫ్యామిలీస్‌లోని 'ఫ్యామిలీ స్టార్స్' అందరికీ హోలీ శుభాకాంక్షలు'' అన్నారు మృణాల్‌ఠాకూర్. ''మధ్య తరగతి కుటుంబాల్లో జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు 'దిల్' రాజు.

ధూం ధాం ప్రేమ

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికుమార్, 'వెన్నెల' కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. సాయి కిశోర్ మచ్చా దర్శకత్వంలో ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తది దశకు చేరుకుంది. ఈ వేసవిలోనే విడుదల చేయాలనుకుంటున్నారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు గోపీ సుందర్ స్వరకర్త.



● చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

వినోదం... భావోద్వేగం


ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి ఓ సినిమా తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మోహనకృష్ణ ఇంద్రగంటి సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సతీమణి అనిత క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''వినోదం, భావోద్వేగాలకు సినిమాలో అధిక ప్రాధాన్యం ఉంటుంది'' అని చెప్పారు. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.



● రూప, ప్రియదర్శి

సీక్వెల్ ప్లాన్ రెడీ

అమెరికన్ గాడ్జిల్లా ఫ్రాంచైజీ నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తున్న తాజా చిత్రం 'గాడ్జిల్లా X కాంగ్: ది న్యూ ఎంపైర్'. లెజెండరీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని వార్నర్ బ్రదర్స్ ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 29న విడుదల చేయనుంది. ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఉందంటున్నారు ఈ చిత్రదర్శకుడు ఆడమ్ విన్‌గార్డ్. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వసూళ్లపైనే సీక్వెల్ ఆధారపడి ఉంటుందని, చెప్పాల్సిన కథ అయితే చాలా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో రెబెక్కా హాల్, బ్రియాన్ హెన్రీ, కైలీ హోట్లీ, అలెక్స్ ఫెర్న్స్ లీడ్ రోల్స్‌లో నటించారు.



● గాడ్జిల్లా X కాంగ్: ది న్యూ ఎంపైర్' పోస్టర్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	191	72,832
నిఫ్టీ ▲	83	22,097

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	16,422	▽	7
డోజోన్స్	39,339	▽	137
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,918	▽	13
డాక్స్	18,261	▲	55
షాంఘై	3,026	▽	23
నికాయ్	40,414	▲	474

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.66
€	యూరో	ఎస్‌బీఐ	89.19	91.57
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.43	55.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.42
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.46	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.51

అమ్మకాల్లో ఆన్‌లైన్‌దే హవా..

కోల్‌కతా: కొద్దిరోజులపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను నిలువరించిన కోవిడ్-19 శకం ముగిసినప్పటికీ ఆన్‌లైన్ సర్వీసులకు డిమాండ్ కొనసాగుతోంది. కరోనా మహమ్మారి కారణంగా జనజీవనం నిలిచిపోవడంతో ఊపందుకున్న ఆన్‌లైన్ ట్రెండ్ తదుపరి దశలో మరింత ఊపందుకుంది. ప్రజలు తమ అవసరాల కోసం ఆఫ్‌లైన్ స్టోర్లకంటే ఆన్‌లైన్ కొనుగోళ్లకే మొగ్గుచూపుతున్నారు. ఇందుకు స్మార్ట్‌ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్లను వినియోగిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ అమ్మకాలు ఆఫ్‌లైన్ స్టోర్లను మించి నమోదవుతున్నట్లు మార్కెట్ రీసెర్చ్ సంస్థల తాజా నివేదిక పేర్కొంది. నీల్సన్‌ఐక్యూ, జీఎఫ్‌కే ఇండియా సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదిక వివరాలు చూద్దాం..

కోవిడ్-19 ముగిసినప్పటికీ ఇదే ట్రెండ్

డోర్ డెలివరీ ఎఫెక్ట్

కరోనా తదుపరి లాక్‌డౌన్‌లు ఎత్తివేయడంతోపాటు.. అన్ని రకాల ఆంక్షలనూ ప్రభుత్వం తొలగించింది. అయినప్పటికీ వినియోగదారులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందుకు ఇటీవల జనంలోకి చొచ్చుకుపోయిన సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడుతున్నారు. దీంతో ఫిజికల్‌గా స్టోర్ల సందర్శనకంటే ఈకామర్స్‌వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో మహమ్మారి కాలంలో జోరందుకున్న డోర్ డెలివరీ వ్యవస్థ రాను రాను బహుముఖాలుగా విస్తరించింది. ఫలితంగా నిత్యావసరాలు మొదలు విచక్షణ ప్రకారం కొనుగోళ్లు చేపట్టే వస్తువుల విషయంలోనూ ఆన్‌లైన్‌కే ఓటు వేస్తున్నారు.



భారీ వృద్ధి బాటలో

లాక్‌డౌన్ రోజుల్లో కూరగాయలు, ఫాస్ట్‌ఫుడ్ తదితర నిత్యావసరాల కోసం కాంటాక్ట్‌లెస్ డోర్ డెలివరీలకు అలవాటుపడిన ప్రజలు తదుపరి కాలంలో టీవీ సెట్ల దగ్గర్నుంచి ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు తదితర వినిమయ వస్తువులను సైతం ఈ కామర్స్ సైట్ల ద్వారా కొనుగోలు చేసేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఈ ట్రెండ్ లాక్‌డౌన్ రోజులకుమించి కనిపిస్తోంది. ప్రధానంగా మెట్రో నగర ప్రాంతాలలో ఈకామర్స్ ద్వారా కొనుగోళ్లు భారీగా ఎగశాయి. ఇంటినుంచే కొనుగోలు చేయగలగడం, డోర్‌డెలివరీ సౌకర్యం, విభిన్న ప్రాడక్టుల అందుబాటు తదితర సానుకూలతలు కీలకపాత్రను పోషిస్తున్నాయి. ఫ్రాస్ట్‌ఫ్రీ ఫ్రిజ్‌లు, 55 అంగుళాలకుమించిన టీవీలు వంటి ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు 2023లో రెట్టింపయ్యాయి. కాగా, గతేడాదిలో ఎఫ్‌ఎంసీజీ విభాగ అమ్మకాలు అంతక్రితం ఏడాది(2022)తో పోలిస్తే ఊపందుకున్నాయి.

ఫుడ్ డెలివరీలోకి టాటా న్యూ



ముంబై: టాటా గ్రూప్ రూపొందించిన మల్టీపర్పస్ సూపర్ యాప్ టాటా న్యూ వచ్చే ఏడాది రెండో వసంతంలోకి అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో డిజైన్‌ను సరికొత్తగా మార్చే యోచనలో ఉంది. అంతేకాకుండా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలోకి ప్రవేశించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇందుకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ)ను వినియోగించుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ వివరాల ప్రకారం సాంకేతిక అంశాల కారణంగా యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ)ను బ్లాక్ నుంచి వైట్ బ్యాక్‌గ్రౌండ్‌లోకి మార్చనుంది. 2022 ఏప్రిల్ 7న టాటా గ్రూప్ సూపర్ యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలుత క్లోజ్‌డ్ యూజర్ గ్రూప్‌తో టాటా న్యూ యాప్ ప్రారంభంకాగా.. రెండు నగరాల(బెంగళూరు, ఢిల్లీ)కే పరిమితమైంది. ప్రస్తుతం ఓఎన్‌డీసీతోపాటు మ్యాజిక్‌పిన్ సహకారం ద్వారా ఫుడ్ డెలివరీ సర్వీసులను ప్రవేశపెట్టనుంది. గతేడాది ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ కారణంగా మ్యాజిక్‌పిన్ ఫుడ్ ఆర్డర్లు రెట్టింపయ్యాయి. కాగా.. గత నెలలో కొత్త సీఈవోగా సీఈవో నవీన్ తహిల్యానికి బాధ్యతలు అప్పగించడంతోపాటు పలు మార్పులకు టాటా న్యూ తెరతీసింది. వివిధ బిజినెస్ చీఫ్‌లతో నవీన్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలో పరిస్థితులపై ఉద్యోగులతో సర్వే చేపట్టారు.

ఆఫీసు స్పేస్ డిమాండ్ కొనసాగొచ్చు: కొలియర్స్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ కొనసాగొచ్చని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ కొలియర్స్ ఇండియా తెలిపింది. 2024 జనవరి – మార్చిలో బెంగళూరు, ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, పుణే నగరాల్లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 35% వృద్ధి చెందవచ్చని తాజాగా అంచనా వేసింది. ఈ ఆరు ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 1.36 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉండవచ్చని అంటోంది. గత ఏడాదిలో ఇదే కాలానికి ఈ నగరాల్లో మొత్తం 1.01 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలాల లీజు ఒప్పందాలు కుదిరాయని వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
25-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.25

ఈ-గేమింగ్ కట్టడిపై కేంద్రం కసరత్తు

స్వతంత్ర నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు యోచన


న్యూఢిల్లీ: దేశీయంగా ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని కట్టడి చేసేందుకు స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయడంపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా నేషనల్ లా యూనివర్సిటీ, ఈ-గేమింగ్ ఫెడరేషన్ కలిసి పరిశ్రమవర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నిర్దిష్ట ప్రతిపాదనలను సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పరిశ్రమ మెరుగైన నిర్వహణ కోసం నియంత్రణ ఉండక తప్పదని ఎన్‌ఎల్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాఘవ్ పాండే తెలిపారు. అయితే, ఇటు పరిశ్రమ వృద్ధికి దోహదపడటం, అటు నియంత్రించడం మధ్య సమతౌల్యం కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ, ఇతర నియంత్రణ సంస్థలతో సంప్రదింపులతో పాటు నియంత్రించాల్సిన అంశాలపై సమగ్ర అధ్యయనంతోనే తగిన విధానాలను రూపొందించడానికి వీలవుతుందని చెప్పారు. ఆన్‌లైన్ గేమింగ్‌కి సంబంధించి గేమింగ్ సంస్థలే స్వీయ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలంటూ గతంలో చేసిన ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. దేశీయంగా డ్రీమ్11, మొబైల్ ప్రీమియర్ లీగ్, డెల్టాటెక్ గేమింగ్, నజారా, గేమ్స్24 గీ7 వంటి పలు సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి.



3 బిలియన్ డాలర్ల మార్కెట్..

ప్రస్తుతం భారత గేమింగ్ మార్కెట్ దాదాపు 3 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఇందులో 80 శాతం వాటా రియల్ మనీ ప్లాట్‌ఫాంలదే ఉంటోంది. అమెరికా, బ్రెజిల్‌ను కూడా దాటేసి భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద గేమింగ్ మార్కెట్‌గా మారినట్లు గేమింగ్ కంపెనీ విన్‌జో ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. భారత్‌లో 56.8 కోట్ల మంది గేమర్స్ ఉండగా, 2023లో 950 కోట్ల పైచిలుకు గేమింగ్ యాప్ డౌన్‌లోడ్స్ నమోదైనట్లు వివరించింది. ఇంతటి భారీ స్థాయిలో విస్తరించిన ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ.. మనీలాండరింగ్ స్కాములు, భారీ పన్నుల భారం మొదలైన సమస్యలతో సతమతమవుతోంది. తమ పరిశ్రమకు నియంత్రణ సంస్థను ఏర్పాటు చేస్తే సక్రమంగా నడుస్తున్న వాటికి ఇలాంటి సమస్యలు తగ్గగలవని గేమింగ్ కంపెనీలు భావిస్తున్నాయి. దీంతో కంపెనీలు కలిసి స్వీయ నియంత్రణ సంస్థలను (ఎస్‌ఆర్‌బీలు) ఏర్పాటు చేసుకోవచ్చంటూ కేంద్రం ప్రతిపాదించింది. అయితే, బడా సంస్థలు సదరు ఎస్‌ఆర్‌బీలను ప్రభావితం చేయడానికి, అవి నిజంగానే స్వతంత్రంగా పని చేయడానికి అవకాశాలు తక్కువగా ఉండొచ్చని భావించి స్వతంత్ర నియంత్రణ సంస్థ ఏర్పాటుపై దృష్టి సారించింది.

గుండె సంరక్షణకు లీ హెల్త్ ఔషధం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: న్యూట్రాసూటికల్స్ తయారీ సంస్థ లీ హెల్త్ డొమెయిన్ గుండె సంరక్షణకై సహజ సిద్ధ మూలికలతో లైఫోస్టెరాల్ సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌ను తయారు చేసింది. వెల్లుల్లి సారం, గామా ఒరిజనోల్, ఫైటోస్టెరాల్, లైకోపీన్, పసుపులో ఉండే కుర్కుమిన్, మెంతికూర, నల్ల మిరియాల నుంచి తీసిన పైపెరిన్‌తో వీటిని రూపొందించామని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. 'అత్యంత శక్తివంతమైన ఈ సమ్మేళనాలు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను సమతుల్యం చేస్తాయి. క్రమరహిత హృదయ స్పందనలను స్థిరీకరిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడతాయి' అని చెప్పారు. అమెజాన్, లీ హెల్త్ డొమెయిన్, ఫార్మసీలలో లైఫోస్టెరాల్ లభిస్తుంది.

అమెరికాలో తొలిసారిగా అమూల్ పాలు



న్యూఢిల్లీ: అమూల్ పాలు తొలిసారిగా విదేశీ మార్కెట్లలో లభించనున్నాయి. వారం రోజుల్లో అమెరికాలో అమూల్ పాలను ప్రవేశపెట్టనున్నట్లు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) ఎండీ జయేన్ మెహతా తెలిపారు. 'మేము దశాబ్దాలుగా డెయిరీ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాం. కానీ తాజా పాలను భారత్ వెలుపల ప్రవేశపెట్టడం మాత్రం ఇదే ప్రథమం. అమూల్ తాజా, గోల్డ్, శక్తి, స్లిమ్ ఎన్ ట్రిమ్ ఉత్పత్తులను వారం రోజుల్లో ప్రవేశపెడతాం' అని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం 108 ఏళ్ల చరిత్ర గల పాల సహకార సంఘం మిషిగాన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఎంఎంపీఏ)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వివరించారు. పాల సేకరణ, ప్రాసెసింగ్ ఎంఎంపీఏ చేపడుతుందని, అమూల్ బ్రాండ్ పేరిట మార్కెటింగ్ తమ సంస్థ చేపడుతుందని మెహతా చెప్పారు. ముందుగా న్యూయార్క్, న్యూజెర్సీ, షికాగో, వాషింగ్టన్, డల్లాస్, టెక్సాస్ తదితర ప్రాంతాల్లో అమూల్ పాలు లభిస్తాయి. వచ్చే 3–4 నెలల్లో బ్రాండింగ్, మార్కెటింగ్‌పై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు మెహతా చెప్పారు. రాబోయే రోజుల్లో పనీర్, పెరుగు, మజ్జిగ వంటి ఉత్పత్తులను కూడా ప్రవేశపెడతామని తెలిపారు. జీసీఎంఎంఎఫ్ ఇప్పటికే 50 దేశాలకు పాల ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇస్రో-ఎన్ఆర్ఎస్‌సీ, హైదరాబాద్‌లో ఉద్యోగాలు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో).. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
- » **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ సైంటిస్ట్-20, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-06, ప్రాజెక్ట్ సైంటిస్ట్ బి-04, ప్రాజెక్ట్ అసోసియేట్1-02, ప్రాజెక్ట్ అసోసియేట్2-12, జేఆర్ఎఫ్-27.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **పనిచేయాల్సిన ప్రదేశాలు:** షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, జీడిమెట్ల, బాలానగర్, హైదరాబాద్, రీజనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రాలు-నాగ్‌పూర్, న్యూఢిల్లీ, కోల్‌కతా, జోధ్‌పూర్, బెంగళూరు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.04.2024
- » **వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌లోని 352 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో(కేజీబీవీ) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరు, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఇంటర్మీడియట్‌లో అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, బడి మధ్యలో మానేసిన వారు (డ్రాపౌట్స్), పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్ర్యరేఖకు(బీపీఎల్) దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో రూ.1,40,000 మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తారు.ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం అందిస్తారు. అడ్మిషన్లు పొందిన వారి వివరాలను ఆయా పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో ప్రదర్శిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024
- » **వెబ్‌సైట్:** https://apkgbv.apcfss.in

ఏయూఈఈటీ-2024

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సెల్ఫ్ సపోర్ట్ విధానంలో వివిధ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్(ఏయూఈఈటీ-2024) నిర్వహించనుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** బీటెక్‌లో ప్రవేశం కోసం కనీసం 45 శాతం మార్కులతో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో 10+2 ఉత్తీర్ణులవ్వాలి(రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40శాతం ఉండాలి).
- » **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప.
- » **ఆలస్య రుసుం లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2024.
- » **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 03.05.2024
- » **ప్రవేశ పరీక్ష తేది:** 05.05.2024.
- » **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

టీఎస్ ఎల్‌పీసెట్-2024

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య-శిక్షణ మండలి.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి లేటరల్ ఎంట్రీ ఇన్ టూ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎల్‌పీసెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని పాలిటెక్నిక్/ఇన్‌స్టిట్యూషన్స్(ప్రభుత్వ/ఎయిడెడ్/అన్ ఎయిడెడ్/ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు)ల్లో రెండో సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో ప్రవేశపరీక్ష ద్వారా అడ్మిషన్స్ కల్పిస్తారు.

- » **డిప్లొమా విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, ప్యాకేజింగ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ.
- » **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెనింగ్(డీఈటీ) నిర్వహించే బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024.
- » **ప్రవేశపరీక్షతేది:** 20.05.2024.
- » **వెబ్‌సైట్:** www.sbtet.telangana.gov.in

సీటెట్‌కు సన్నద్ధమవ్వండిలా!

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సీటెట్‌గా సుపరిచితం! ఉపాధ్యాయ అర్హత పరీక్షగానూ గుర్తింపు! బీఈడీ,డీఈడీ ఉత్తీర్ణులు ఇందులో అర్హత సాధిస్తే.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలు, సీబీఎస్ఈ అనుబంధ స్కూల్స్, ఎన్‌సీటీఈ గుర్తింపు ఉన్న పాఠశాలల్లో.. ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం లభిస్తుంది! సీటెట్ నిర్వాహక సంస్థ సీబీఎస్ఈ.. తాజాగా సీటెట్-జూలై-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష తేదీని సైతం ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో.. సీటెట్-జూలై-2024 వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..

- » సీటెట్ జూలై-2024 నోటిఫికేషన్ విడుదల
- » జాతీయ స్థాయిలో జూలై 7న సీటెట్ నిర్వహణ
- » పేపర్-1, పేపర్-2లుగా సీటెట్
- » సీటెట్ స్కోర్‌కు శాశ్వత గుర్తింపు

ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం-ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే వారికి బీఈడీ, డీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)తోపాటు సీటెట్‌లోనూ అర్హత ఉండాలి. సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ వంటి వాటిలో అడుగు పెట్టాలంటే సీటెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా మారింది. సీబీఎస్ఈ సీటెట్ పరీక్షను పేపర్-1, పేపర్-2లుగా నిర్వహిస్తుంది.

అర్హతలు

- ఆయా పేపర్‌ను అనుసరించి డీఈడీ, బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **పేపర్-1:** పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునే వారు పేపర్-1కు హాజరు కావాలి.
- **పేపర్-2:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్ కోసం పేపర్-2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై ఉత్తీర్ణత సాధించాలి.

150 మార్కులకు పేపర్-1 పరీక్ష

పేపర్-1 పరీక్ష అయిదు విభాగాల్లో ఉంటుంది. అవి..చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి (30 ప్రశ్నలు-30 మార్కులు), మ్యాథమెటిక్స్ (30 ప్రశ్నలు-30 మార్కులు),ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (30 ప్రశ్నలు-30 మార్కులు),లాంగ్వేజ్-1 (30 ప్రశ్నలు-30 మార్కులు),లాంగ్వేజ్-2(30 ప్రశ్నలు-30 మార్కులు). మొత్తం 5 విభాగాల్లో 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2 విభాగాలకు సంబంధించి అభ్యర్థులకు 20 లాంగ్వేజ్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో తమకు ఆసక్తి ఉన్న లాంగ్వేజ్‌లు రెండింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది.



పేపర్-2 ఇలా

రెండున్నర గంటల వ్యవధిలో 150 మార్కులకు పేపర్ 2 నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులకు, మ్యాథమెటిక్స్, సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు (లేదా) సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు, లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులకు, లాంగ్వేజ్-2, 30 ప్రశ్నలు-30 మార్కులకు పరీక్ష ఉంటుంది.

60 శాతం మార్కులు తప్పనిసరి

సీటెట్ పేపర్-1, పేపర్-2లలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు పొందాలనే నిబంధన విధించారు. అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో (90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి.

శాశ్వత గుర్తింపు

సీటెట్‌లో ఉత్తీర్ణత పొందితే ఆ స్కోర్‌కు జీవితకాల గుర్తింపు కల్పించే విధానం అమలవుతోంది. దీంతో ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 2
- **సీటెట్ తేదీ:** 2024, జూలై 7 (పేపర్-2: 9:30-12; పేపర్-1: 2 - 4:30 వరకు)
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

బెస్ట్ స్కోర్ సాధించేలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

బోధన, అభ్యసనంకు సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీ మీద ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీ సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం- నాయకత్వం- గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్ పేపర్లకు ఇలా

అభ్యర్థులు తాము బోధించాలనుకునే భాషలో నిర్వహించే లాంగ్వేజ్-1 విభాగంలో రాణించేందుకు.. అదే విధంగా మరో ఇతర లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరీక్షించే లాంగ్వేజ్-2 పేపర్‌లో రాణించేందుకు ఆయా భాషా విభాగాలకు సంబంధించి స్కూల్ స్థాయిలోని సబ్జెక్ట్ పుస్తకాలను పూర్తిగా చదవాలి. సాధారణంగా లాంగ్వేజ్-2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంపొందించుకుంటే రాణించవచ్చు.

అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సిద్ధం కావాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యం మీద ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి పేపర్-1లో ఒకటి నుంచి నుంచి అయిదో తరగతి స్థాయిలో.. పేపర్-2లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఈ విభాగంలో రాణించేందుకు బోటనీ బేసిక్ అంశాలతోపాటు, పర్యావరణం, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత సీటెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేక అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదివాలి. వాతావరణ,భౌగోళిక పరిస్థితులు,నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ చదవాలి.

క్లుప్తంగా...

బంగారం తరలిస్తున్న వాహనం స్వాధీనం

రూ.80 కోట్ల విలువచేసే సొత్తు ఉన్నట్లు సమాచారం


బంగారాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనం

చిలమత్తూరు: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు భారీగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం కర్ణాటక వైపు నుంచి వస్తున్న ఎస్ఐఎస్ ప్రోసిగర్ బీవీసీ లాజిస్టిక్ వాహనాన్ని చెక్‌పోస్టులో ఆపి తనిఖీ చేశారు. ఇందులో భారీఎత్తున బంగారం, వజ్రాలు తరలిస్తున్నట్టు గుర్తించి వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో సుమారు రూ.80 కోట్లు విలువ చేసే సొత్తు ఉన్నట్టు తెలుస్తోంది. వాహన సిబ్బంది బిల్లులు చూపగా.. వాహనం లోపల తనిఖీ చేసి అందులోని ఆభరణాలను లెక్క కట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. కమర్షియల్, ఇన్‌కం ట్యాక్స్, రెవెన్యూ ,పోలీసు అధికారులు రోజంతా విచారణ చేపట్టారు. సాయంత్రానికి మలబార్ గోల్డ్‌కు సంబంధించిన ఉద్యోగులు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. తర్వాత వాహనాన్ని ప్రత్యేక భద్రత నడుమ ట్రెజరీకి తరలించారు. ఆ వాహనాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కూడా పరిశీలించి, సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

'పచ్చ' పైత్యానికి తగిన గుణపాఠం చెప్పాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబు, పచ్చ మీడియా అండ్‌కోకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రజల్ని కోరారు. సోమవారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పవన్‌కళ్యాణ్, నేడు బొజ్జల సుధీర్ అనే వ్యక్తి పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లోని స్లీపర్ సెల్స్ మాదిరిగా రాష్ట్రంలోని 2.50 లక్షల మంది వలంటీర్లను పోల్చడం దారుణమన్నారు. తండ్రి ఫారెస్ట్ మంత్రిగా ఉన్న సమయంలో ఎర్ర చందనం ద్వారా దోచేసిన సొమ్ములున్నాయనే అజ్ఞానం, అహంకారంతో లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా బొజ్జల సుధీర్ మాటలున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలు వలంటీర్లను తమ కుటుంబ సభ్యులుగా చూస్తున్నారన్నారు. కేరళ వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాలు సైతం వలంటీర్ వ్యవస్థను ప్రశంసిస్తున్నాయని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వారికి తగిన గుణపాఠం చెబుతామని డిప్యూటీ సీఎం హెచ్చరించారు.

కంపిస్తున్న కాల 'కూటమి'

దద్దరిల్లిన నిరసన గళం.. రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తుల తిరుగుబాటు

సంక్షేమ ప్రభుత్వంపై కక్షకట్టిన కాల 'కూటమి' కంపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తుల తిరుగుబాటుతో తెలుగుదేశం త్రయం సతమతమవుతోంది. ప్రజాగళం అంటూ ఆంధ్ర రాష్ట్రాన్ని వంచించేందుకు బయలుదేరిన టీడీపీ, జనసేన బీజేపీ అసమ్మతి నిరసన 'గళం' హూంకారానికి వణుకుతున్నాయి. ఆగ్రహజ్వాలలతో అట్టుడుకుతున్నాయి.

- వణుకుతున్న టీడీపీ, జనసేన బీజేపీ అధిష్టానాలు
- అవనిగడ్డలో 'మండలి' తిరుగుబాటు!
- రెబల్స్‌గా ముద్దరబోయిన, ఆమంచి స్వాములు
- తునిలో యనమలకు ఇంటిపోరు
- పెందుర్తిలో బండారు వర్గీయుల ఆందోళన

సాక్షి, నెట్‌వర్క్: పెందుర్తి టీడీపీ టికెట్‌ను జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించడంతో టీడీపీ కార్యకర్తలు సోమవారం నిరసనకు దిగారు. సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కాదని పొత్తులో భాగంగా జనసేనకు సీటును కట్టబెట్టడంపై మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు తీరుతో మనస్థాపం చెందిన బండారు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారని ఆగ్రహంతో ఊగిపోయారు. బండారు ఇంటి వద్దకు చేరి చంద్రబాబు, లోకేశ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ జెండాలు, కరపత్రాలను దహనం చేశారు.

- చిత్తూరు తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలు ధిక్కారస్వరం వినిపిస్తున్నారు. స్థానికేతరుడు దగ్గుమళ్ల ప్రసాదరావును ఎంపీ అభ్యర్థిగా అంగీకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు. టీడీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు పీటర్ సోమవారం మరికొంత మంది ఎస్సీ నేతలతో కలిసి చిత్తూరులో విలేకరులతో మాట్లాడారు. స్థానికులను అభ్యర్థిగా ప్రకటిస్తేనే సహకరిస్తామని తెగేసి చెప్పారు. లేకుంటే తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.
- తూర్పుగోదావరి జిల్లా అనపర్తి సీటును పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారన్న ప్రచారం జరుగుతుండడంతో టీడీపీ నేతల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తాయి. వాస్తవానికి ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును తొలి జాబితాలోనే ఆ పార్టీ ప్రకటించింది. అయితే ఇప్పుడు జరుగుతున్న ప్రచారంపై అధిష్టానం స్పష్టత ఇవ్వకపోవడంతో కార్యకర్తలు నిరసనకు దిగారు. ఆదివారం ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నల్లమిల్లి కుటుంబాన్ని నిలదీశారు. టికెట్‌పై స్పష్టత వచ్చేవరకు ప్రచారం చేయొద్దని డిమాండ్ చేశారు. అయినా పార్టీ అధిష్టానం నుంచి ఎటువంటి ప్రకటనా రాకపోవడంతో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు రాజీనామాలు చేసి పత్రాలను సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్ చెరువులో ఉన్న టీడీపీ జోన్-2 ఇన్‌చార్జ్ రావు వెంకట సుజయ కృష్ణ రంగారావుకు అందజేశారు.
- టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఆయన సోదరుడు కృష్ణుడికి మధ్య ఉన్న విభేదాలు రచ్చకెక్కాయి. రామకృష్ణుడు కూతురు, తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య ప్రచారానికి కృష్ణుడు దూరంగా ఉంటున్నారు. కృష్ణుడికి సన్నిహితుడైన మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావునూ పార్టీ దూరం పెట్టడంపై ఆయన వర్గం మండిపడుతోంది. దీంతో రాజకీయ భవిష్యత్ దృష్ట్యా కృష్ణుడు తనతో తొలి నుంచి ఉన్న నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. సోమవారమే అనుచరులతో భేటీ కావాలని ఆయన తలంచారు. ముఖ్య నేతలకు ఆహ్వానాలూ పంపారు. చివరి నిమిషంలో భేటీని వాయిదా వేశారు. మంగళ, బుధవారాల్లో నిర్వహించాలని నిర్ణయించారు.


నూజివీడు మండలం దిగవల్లిలో టీడీపీ రెబల్ అభ్యర్థి ముద్దరబోయిన ప్రచారం

- విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో రగులుతున్న కుంపటిని చల్లార్చేందుకు ఆ పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు ఆరంభించింది. చంద్రబాబు దూతగా యార్లగడ్డ మురళీకృష్ణ ఎస్.కోటకు సోమవారం వచ్చారు. రెబల్ అభ్యర్థి గొంప కృష్ణ, ఆయన వర్గీయులతో మంతనాలు జరిపారు. చివరి వరకు వేచి చూడాలని సూచించారు.
- తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం నిర్వహించిన మొదటి సమావేశానికి జనసేన ముఖ్య నాయకులు గైర్హాజరయ్యారు. ఆరణి అభ్యర్థిత్వాన్ని తొలి నుంచి జనసేన, టీడీపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆరణి ఏర్పాటుచేసిన సమావేశానికి జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు రాలేదు.
- టీడీపీ నైతిక విలువలు లేని పార్టీ అని, పక్క పార్టీ ఎమ్మెల్యే తన పదవికి, పార్టీకి రాజీనామా చేయకుండానే వస్తే అతనిని నూజివీడు ఇన్‌చార్జిగా నియమించిందని తెలుగుదేశం నూజివీడు రెబెల్ అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం దిగవల్లిలో సోమవారం రాత్రి అభిమానులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధిష్టానం తీరుపై మండిపడ్డారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు వెల్లడించారు.
- ప్రకాశం జిల్లా గిద్దలూరు సీటును తెలుగుదేశం పార్టీకి కేటాయించడంపై జనసేన నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. ఆదివారం రాత్రి కంభంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆమంచి స్వాములు పాల్గొని రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు.
- కూటమిలో అవనిగడ్డ, విజయవాడ వెస్ట్ సీట్లు కుంపటి రాజేస్తున్నాయి. అవనిగడ్డ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంతో ఇప్పటి వరకు ఇక్కడ ఎవరు పోటీ చేస్తారన్న స్పష్టత లేదు. ఇటీవల జనసేనలో చేరిన ఎంపీ బాలశౌరి, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, కాంట్రాక్టర్ విక్కృతి శ్రీను టికెట్ కోసం పోటీ పడుతున్నారు. కొత్తగా పార్టీలో చేరే మరో నేతకు అవనిగడ్డ నియోజక వర్గాన్ని కేటాయిస్తారనే ప్రచారం ఊపందుకుంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తాజాగా ఆ పార్టీ తీరుపై ధ్వజమెత్తారు. సీటును జనసేనకు కేటాయిస్తే సహించేది లేదని, మండలి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆయన వర్గీయులు తేల్చిచెప్పారు. విజయవాడ వెస్ట్ సీటును బీజేపీకి కేటాయించారని ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీ తరఫున సుజనా చౌదరిని పోటీకి దింపేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు చక్రం తిప్పుతున్నట్టు సమాచారం. సుజనాకు సీటు ఇస్తే ఓటమి ఖాయమనే భావన వ్యక్తమవుతుండడంతో ఇక్కడ సీటు ఆశిస్తున్న జనసేన నేత పోతిన మహేష్ ఇండిపెండెంట్‌గానైనా పోటీకి సిద్ధపడుతున్నట్టు సమాచారం.


బండారుకు మద్దతుగా టీడీపీ కరపత్రాలు, జెండాలను దహనం చేస్తున్న కార్యకర్తలు


సుజయ కృష్ణ రంగారావుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న అనపర్తి టీడీపీ శ్రేణులు

హే జీసస్.. రోత రాతల పాపాలను క్షమించుడి!



సాక్షి, అమరావతి: రామోజీ పచ్చ పైత్యం రోజు రోజుకీ పరాకాష్టకు చేరుతోంది. క్రైస్తవుల సంక్షేమంపై జగన్ వివక్ష అంటూ విషం చిమ్మే నీచానికి రామోజీ దిగజారిపోయారు. రాయితీలపై అడ్డగోలుగా కోత అంటూ మడత వ్యాఖ్యలు చేస్తూ ఈనాడులో అబద్ధాలు అచ్చేయడాన్ని 'హే జీసస్.. రామోజీ రోత రాతలు చూడు ప్రభు' అని క్రైస్తవ సమాజం వ్యాఖ్యానిస్తోంది. పాపపు రాతల తీరును క్షమించమని ప్రార్థిస్తున్నాయి. చంద్రబాబు ఐదేళ్లపాలనలో క్రైస్తవులకు అరకొర రాయితీలు, పథకాలతో సరిపెట్టినా పచ్చ కళ్లకు అంతా సవ్యంగా కన్పించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రైస్తవులకు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా తోడ్పాటు అందిస్తుంటే రామోజీకి మింగుడు పడటంలేదు.



ఆరోపణ: టీడీపీ హయాంలో స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం, చర్చిలకు వెన్నుదన్ను.

వాస్తవం: స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ అంటూ కేవలం రెండు కార్యక్రమాలు అమలు చేసిన టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో క్రిస్టియన్ మైనార్టీల కోసం ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. ఆ రెండు కార్యక్రమాలే ఏదో గొప్పగా చేసేసినట్లు ఈనాడు పచ్చ కలర్ ఇచ్చే ప్రయత్నం చేసింది.

ఆరోపణ: వైఎస్సార్‌సీపీ పాలనలో క్రైస్తవులకు కుచ్చుటోపీ, యువతకు శిక్షణ లేదు, వెన్ను విరిచారు.

వాస్తవం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్(మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచింది. సుమారు 6.82 లక్షల క్రైస్తవ మైనారిటీల సంక్షేమ పథకాల అమలుతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉంది. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ వాహన మిత్ర, లా నేస్తం, వైఎస్ఆర్ చేయూత, వంటి ఎన్నో కొత్త కార్యక్రమాలు వారి ఉన్నతికి దోహదం చేశాయి. కరోనా లాక్‌డౌన్ సమయంలో పాస్టర్లకు వన్-టైమ్ ప్రత్యేక ఆర్థిక సహాయం, జెరూసలేంకు తీర్థయాత్ర, చర్చిల ద్వారా, చర్చి నడిపే సంస్థలకు సహాయం అందించడం వంటి ప్రత్యేక తోడ్పాటుతో క్రిస్టియన్ మైనార్టీల్లో ఆత్మస్థైర్యం నింపింది.

ఆరోపణ: ఆర్థిక సాయమూ అంతంతే

వాస్తవం: చంద్రబాబు ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం ఐదేళ్లలో రూ.29 కోట్లు, శిక్షణ కోసం రూ. 3.55 కోట్లు ఖర్చు చేస్తే అదే గొప్ప అంటూ ఈనాడు డబ్బాలు కొట్టింది. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 మార్చి వరకు క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సంస్థ ద్వారా ఏకంగా రూ. 416.58కోట్లు అందించింది. దీనిలో ఒక్క చేయూత పథకం(స్వయం ఉపాధి) ద్వారా 27,150 మందికి రూ.50.90కోట్లు అందించింది. దీంతోపాటు 90శాతం సబ్సిడీపై 90 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు(నిత్యావసర సరుకుల సరఫరా వాహనాలు) రూ.55 లక్షలు ఆర్థిక సాయం అందించింది.

ఆరోపణ: అప్పుడలా ఇప్పుడిలా అంటూ తప్పుడు లెక్కలు

వాస్తవం: టీడీపీ ప్రభుత్వం(2014-19)లో చర్చిలకు సాయం, రాయితీలపై రుణాలు, నైపుణ్య శిక్షణ వంటివి అరకొరగా జరిగితే గొప్పగా జరిగినట్టు ఈనాడు మసిపూసి మారేడు కాయ చేసింది. వైఎస్సార్‌సీపీ 2019-24 మధ్య క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందించిన ఆర్థిక తోడ్పాటును ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించింది.

క్రిస్టియన్ మైనార్టీల్లో వివిధ వృత్తులు, ఉన్నత, ఇతర చదువులకు ఈ ప్రభుత్వం అందించిన సాయం...

పథకం	లబ్ధిదారులు	అందిన సాయం (రూ.లక్షల్లో)
జగనన్న విద్యా దీవెన	17,075	4,976.62
జగనన్న వసతి దీవెన	16,280	1,690.01
జగనన్న అమ్మఒడి	41,578	6,037.69
వైఎస్ఆర్ వాహన మిత్ర	4,021	402.1
జగనన్న చేదోడు	1,092	109.27
నేతన్న నేస్తం	38	9.12
వైఎస్ఆర్ చేయూత	27,150	5,090.43
వైఎస్ఆర్ ఆసరా	4,338	5,431.39
వైఎస్ఆర్ మత్స్యకార భరోసా	54	5.40
వైఎస్ఆర్ పెన్షన్ కానుక	26,833	7,196.66
జగనన్న తోడు	4036	18.87
మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్	90	55.98
వైఎస్సార్ కళ్యాణమస్తు	199	137.8
జగనన్న విదేశీ విద్యా దీవెన	70	745.54

- పాస్టర్లకు గౌరవ వేతనం కింద కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో రూ.5వేలు చొప్పున వన్-టైమ్ గ్రాంట్‌గా 29,841 మందికి రూ.1490లక్షలు అందించింది. దీంతోపాటు నెలకు రూ.5వేలు చొప్పున 8427 మంది పాస్టర్లకు గౌరవ వేతనంగా రూ.7109.9లక్షలు అందించింది.
- ఇవి కాక లా నేస్తం కింద జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు చొప్పున 2020-21లో రూ.30 లక్షలు, 2021-22లో రూ.50 లక్షలు కేటాయించింది.
- కొత్త చర్చిల నిర్మాణం, పాత చర్చిల మరమ్మత్తులు, పునరుద్ధరణ, ఇతర మౌలిక వసతుల కోసం రూ.5 లక్షలు చొప్పున, శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.3 నుంచి 5 లక్షలు చొప్పున నిధులు ఇచ్చింది. ఇప్పటివరకు 98 చర్చిలకు రూ.5.67కోట్లు నిధులు అందించింది.
- జెరూసలేం, ఇతర బైబిల్ ప్రదేశాలకు తీర్థ యాత్ర పథకం కింద, వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉన్న ప్రతి లబ్ధిదారునికి రూ.60వేలు, వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే ఎక్కువ ఉంటే రూ.30 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఇప్పటివరకు 1,060 మంది లబ్ధిదారులకు రూ.591.60 లక్షలు నిధులు కేటాయించింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943